



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 243 | ఆదివారం | 02-08-2026 | ఖమ్మం   Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**   పేజీలు: 12+8 | వెల రూ. 5.00





09

## బాక్సింగ్‌లో భారత్‌కు డబుల్ ధమాకా

కామన్వెల్త్ క్రీడల్లో బాక్సింగ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా

ఆపరేషన్ ముస్కాన్‌లో 6,307 మంది చిన్నారుల విముక్తి 12

## ఎన్‌డిఎస్ఎ నివేదిక ఆధారంగానే

# నీటి నిల్వలు

- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో ఎల్లంపల్లి అంతర్భాగం
- కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాల వల్లే సమస్యలు
- గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయి
- అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీల పునరుద్ధరణ
- నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ వెల్లడి
- మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరితో కలిసి ఎల్లంపల్లి, కడెం, ఎస్ఆర్ఎస్‌పి సందర్శన



ప్రజాపక్షం/అంతర్గాం/ నిర్మల్ / ఖానాపూర్/ముప్కాల్

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో అంతర్భాంగా ఎల్లంపల్లి రిజర్వాయర్ ఉండేదని, ఇక్కడి నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేయడం సరికాదని కాదని రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్, నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు, నిజామాబాద్ జిల్లాలోని ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టును మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావుతో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ పరిశీలిన సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాల వల్లే సమస్యలు తలెత్తాయని విమర్శలు చేశారు. మేడిగడ్డ బ్యారేజ్, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు, ఎల్లంపల్లి ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ(ఎన్‌డిఎస్ఎ) కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని లిఖితపూర్వకంగా సూచించిందని తెలిపారు.ఇటీవల జరిగిన సాంకేతిక తరువాయి 8లో





### చెరువుల పునరుజ్జీవంతో

## మారిన మహానగర రూపు

ప్రజాపక్షం/హైదరాబాద్

'చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం నాకెంతో సంతృప్తినిచ్చింది' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ క్యూర్ పరిధిని క్యూర్ చేసుకుంటూ మన చెరువులకు జీవం పోస్తూ భావి తరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును అంకితం తరువాయి 8లో

## అల్లూరి విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేట్‌వే

- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభ సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- ఎపిలో రూ.18 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



**విశాఖపట్నం :** ఎపిలోని ఉత్తరాంధ్ర జిల్లాలకు గేట్ వే గా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుందని, రాష్ట్ర అభివృద్ధికి, స్వర్ణాంధ్ర విజన్ సాకారానికి ఇది ముఖ్యమైన రోజని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ విమానాశ్రయం ప్రారంభోత్సవం సహా మొత్తంగా రూ.18 వేల కోట్ల విలువైన వివిధ అభివద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. అభివద్ధిలో రికార్డులు సాధించడమే కాదు, తరువాయి 8లో

### క్షమించడం కాదు.. విద్యార్థులకు

## క్షమాపణలు చెప్పాలి

- ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్‌గాంధీ ఫైర్
- తమిళనాడులో ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు పరామర్శ



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరో సారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని విద్యార్థులకు మోదీ 'క్షమాపణలు' చెప్పాలని, అంతేకానీ వారిని 'క్షమించడం' కాదని వ్యాఖ్యానించారు. విద్యార్థులతో నిజాయితీగా ఉండని వ్యవస్థలో, విద్యార్థులను నిజాయితీగా పనిచేయమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమిళనాడులోని మామల్లపురంలో నీట్ సంబంధిత ఆత్మహత్యల కారణంగా తమ వారిని కోల్పోయిన తరువాయి 12లో

## ధరణి అక్రమాలపై

# ఉక్కుపాదం




- ఫాస్ట్‌ట్రాక్ విచారణతో వివరాలు బట్టబయలు
- నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమినీ చేర్చలేదు : మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్


ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. సచివాలయంలో శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో విచారిస్తున్నామని, అక్రమార్కులెవరైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా భారీ స్థాయిలో అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని, వీటిపై ఆధారాలతో సహా విచారణ కొనసాగుతోందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఒక్క తరువాయి 12లో






## జనాభా లెక్కలు సరైనవేనా?



భూమిపై మనం భావిస్తున్నదానికంటే ఎక్కువ మంది ప్రజలు నివసిస్తున్నారేమోనని ఒక కొత్త అధ్యయనం సూచిస్తోంది. ఫిన్లాండ్‌లోని ఆల్టో యూనివర్సిటీ పరిశోధకులు 1975 నుంచి 2010 వరకు 35 దేశాల్లో జరిగిన 300 గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టుల సమాచారాన్ని విశ్లేషించారు. గ్రామీణ ప్రాంతాల జనాభాను అధికారి క లెక్కలు 84 శాతం వరకు తక్కువగా చూపించి ఉండవచ్చని ఈ పరిశోధన వెల్లడించింది. శాటిలైట్ చిత్రాలు, నమూనా ఆధారిత అంచనాలపై ఆధారపడటం వల్ల మారుమూల గ్రామాల జనాభా సరిగా నమోదుకాకపోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే ప్రపంచ జనాభా వాస్తవంగా బిలియన్ల మేర పెరిగి ఉంటుందనే వాదనపై కొంతమంది నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతు న్న జనభా లెక్కల సేకరణ సరైన దిశగా ముందుకు వెళ్లడం లేదని, పూర్తి సమాచారం అందడం లేదన్న వాదనలు కూడా ఉన్నాయి.

## 116 సంవత్సరాల తర్వాత...



పుస్తకం వేరొకరి చేతికి వెళితే మళ్లీ తిరిగి రాదనే సామెత అందరికీ తెలిసిందే. అయితే, యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లో ఒ'సలీవాన్ ఒవెన్ అనే వ్యక్తి తన ఇంట్లో ఉన్న పురాతన పుస్తకాన్ని భద్రంగా దాని గమ్యస్థానానికి చేర్చాడు. వివరాల్లోకి వెళితే, వాల్టర్ గ్రిఫిత్ ఒవెన్ అనే వ్యక్తి 'థ్లాన్‌రూస్ట్' లైబ్రరీ నుంచి 1910లో ఒక పుస్తకాన్ని తీసుకున్నాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో వలంటీర్‌గా, రెండో ప్రపంచ యుద్ధంలో కాన్వేలోని మెల్బరీ హార్బర్‌లో అధికారిగా పనిచేసిన గ్రిఫిత్, తాను తీసుకున్న పుస్తకాన్ని లైబ్రరీకి తిరిగి ఇవ్వలేకపోయాడు. కాలం గడిచిపోయింది. ఆ కుటుంబంలోని వారంతా ఈ విషయాన్ని మరచిపోయారు. గ్రిఫిత్ మనవడు ఒ'సలీవాన్ ఇటీవలే ఆ పుస్తకాన్ని గుర్తించి, థ్లాన్‌రూస్ట్ లైబ్రరీలో దానిని అప్పగించాడు. అంటే ఆ పుస్తకం 116 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత తన గమ్యాన్ని చేరింది.

## కారు సీటుగా మారిన స్మగ్లర్



సరిహద్దు అధికారులు ఎదుర్కొన్న అత్యంత విచిత్రమైన స్మగ్లింగ్ ప్రయత్నాల్లో ఇది ఒకటి. 2001లో, అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం, శాన్‌డియాగోలో ఉన్న శాన్ సిద్రో పోర్ట్ ఆఫ్ ఎంట్రీలో చోటు చేసుకున్న ఈ ఘటనలో, మెక్సికో నుంచి ఒక వ్యక్తి కారులోని సీటులా కనిపించేలా తనను తాను మార్చుకుని, అమెరికా–మెక్సికో సరిహద్దు దాటేందుకు ప్రయత్నించాడు. ప్యాడింగ్, సీటు కవర్లు, కారు అలంకరణ సామగ్రితో తన శరీరాన్ని పూర్తిగా కప్పుకుని, సాధారణ కార్ సీటులో భాగంలా కనిపించాలని ప్రయత్నించాడు. అధికారులు తనను అదనపు సీటు గా భావిస్తారని అతడు ఆశించాడు. అయితే ఈ వింత ప్రయత్నం ఎక్కువసేపు దాచబడలేదు. సీటు భాగంలో కనిపించిన స్వల్ప కదలికలు అధికారులకు అనుమానం కలిగించాయి. పరిశీలించగా, అది సాధారణ సీటు కాదని, అందులో ఒక మనిషి దాక్కున్నాడని గుర్తించారు. ఈ సంఘటన అప్పట్లో విస్తృతంగా ప్రచారం పొందింది. అసాధారణమైన ఆలోచనతో చేసినప్పటికీ, మానవ శరీరాన్ని ఒక వస్తువులా దాచే ప్రయత్నం ఎంత ప్రమాదకరమో ఇది చూపించింది. చట్టవిరుద్ధంగా సరిహద్దులు దాటేందుకు కొందరు ఎంత విచిత్రమైన మార్గాలను అన్వేషిస్తారో చెప్పే ఉదాహరణగా ఈ ఘటన గుర్తుండిపోయింది.

## 'స్మార్ట్' వీధి దీపాలు



కెన్యాలో సాధారణ వీధి దీపాలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చే కొత్త విధానం అమలవుతోంది. సౌరశక్తితో పనిచేసే ఈ స్మార్ట్ ల్యాంప్‌పోస్టులు పగటిపూట సూర్యకాంతిని నిల్వ చేసుకుని, రాత్రివేళ ఎల్ఇడి వెలుగును అందిస్తాయి. అంతేకాకుండా కొన్ని ల్యాంప్‌పోస్టులు ఉచిత వై–ఫై సదుపాయాన్ని కూడా అందిస్తున్నాయి. విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యా లు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇవి ప్రజల జీవితాలను మార్చుతున్నాయి. విద్యార్థులు రాత్రివేళ సురక్షితమైన వెలుగులో చదువుకోవచ్చు, ఆన్‌లైన్ విద్యా వనరులను పొందవచ్చు. చిన్న వ్యాపారులు డిజిటల్ చెల్లింపులు నిర్వహించగలుగుతున్నారు. సోలార్ ప్యానెల్స్ సేకరించిన శక్తిని చిన్న బ్యాటరీల్లో నిల్వచేసి, ల్యాంప్‌తో పాటు వై–ఫై రౌటర్లకు ఉపయోగిస్తున్నారు. కొన్ని నమూనాల్లో మొబైల్ ఛార్జింగ్ సదుపాయాలు కూడా ఉన్నాయి. ఈ సాంకేతికత పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంతో పాటు డిజిటల్ చేరువను పెంచుతోంది. కెన్యాలో వీధి దీపాలు ఇప్పుడు కేవలం వెలుగు ఇవ్వడం మాత్రమే కాదు, జ్ఞానానికి మార్గదర్శకంగా మారుతున్నాయి.

## లక్షల సంవత్సరాల నాటి గొడ్డలి..



బ్రిటన్‌లోని కెంట్ ప్రాంతంలో మంచుయుగం నాటి ఒక పురావస్తు స్థలంలో పురావస్తు శాస్త్రవేత్తలు 800కు పైగా చరిత్రపూర్వ రాతి పనిముట్లు గుర్తించారు. వాటిలో అత్యంత విశేషమైనది సుమారు 12 అంగుళాల (30సెంటీమీటర్లు) పొడవున్న భారీ చెకుముకి రాయి (ఫ్లింట్)తో తయారైన చేతి గొడ్డలి. దీని వయస్సు మూడు లక్షల సంవత్సరాలకు పైగా ఉందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఈ పనిముట్టును లోయర్ పాలియోలిథిక్ కాలంలో తయారు చేశారు. ఇది ఆదిమానవ చరిత్రలో అత్యంత ప్రాచీన దశ. ఆ సమయంలో ఆధునిక మానవులు (హోమో సేపియన్స్) ఇంకా ఆవిర్భవించలేదు. హోమో హైడెల్‌బెర్గెన్సిస్ (లేదా తొలి నియాండర్తల్ పూర్వీకులు) వంటి మానవ జాతులు యూరప్‌లో నివసించేవి. ఈ చేతి గొడ్డలి బ్రిటన్‌లో ఇప్పటివరకు లభించిన అతిపెద్ద రాతి పనిముట్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. సాధారణంగా ఇలాంటి చేతి గొడ్డళ్లు 10 నుంచి 20 సెంటీమీటర్ల పొడవు మాత్రమే ఉంటాయి. కానీ ఈ గొడ్డలి దాదాపు 30 సెంటీమీటర్ల పొడవుతో, ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ భారీ పనిముట్టును ఏ ప్రయోజనం కోసం ఉపయోగించారనే విషయంలో శాస్త్రవేత్తలు రెండు ప్రధాన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొదటిది, ఆ కాలంలో జీవించిన ఏనుగులు, ఖడ్గమృగాలు లేదా అడవి ఎద్దులు వంటి పెద్ద జంతువులను వేటాడిన తర్వాత వాటి మాంసాన్ని కోయడానికి, ఎముకల నుంచి మాంసాన్ని వేరుచేయడానికి దీన్ని ఉపయోగించి ఉండవచ్చని భావిస్తున్నారు. రెండో అభిప్రాయం ప్రకారం, ఇది రోజువారీ వినియోగం కోసం కాకుండా, ఆ పనిముట్టును తయారు చేసిన వ్యక్తి నైపుణ్యాన్ని, సామాజిక హోదాను సూచించే ప్రతీకగా ఉండి ఉండవచ్చు.

– బిఎస్ఎస్ మైత్రేయి

# క్రీడలకూ కాషాయం రంగు!

సమాజాన్ని ఏకం చేసే అత్యంత శక్తివంతమైన వేదికల్లో క్రీడలది అగ్రస్థానం. భాష, మతం, ప్రాంతం, రాజకీయ భావజాలం, ఆర్థిక స్థితి వంటి అన్ని భేదాలను దాటి ప్రజలను ఒకే భావోద్వేగంతో కలిపే శక్తి క్రీడలకు మాత్రమే ఉంది. ఒక జాతీయ జట్టు విజయం సాధిస్తే దేశమంతా సంబరాలు చేసుకుంటుంది. ఓటమి ఎదురైనా అదే దేశం ఆ బాధను పంచుకుంటుంది. అందుకే క్రీడలు కేవలం వినోదానికి పరిమితం కావు. అవి జాతీయ గుర్తింపునకు, సామాజిక ఐక్యతకు, అంతర్జాతీయ ప్రతిష్ఠకు ప్రతీకలుగా నిలుస్తాయి. అలాంటి రంగంలో రాజకీయాల ప్రభావం పెరిగితే సహజంగానే ఆందోళనలు వ్యక్తమవుతాయి. ఇటీవలి కాలంలో భారత హాకీ జట్టు జెర్సీ రంగు మార్పు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దశాబ్దాలుగా నీలిరంగు జెర్సీతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భారత హాకీ జట్టు ఇకపై ప్రపంచకప్‌లో కొత్తగా 'కాషాయం' రంగుతో బరిలోకి దిగనుంది. ఈ మార్పును కొందరు సాధారణ రూపకల్పన మార్పుగా భావిస్తే, మరికొందరు క్రీడా వారసత్వానికి సంబంధించిన అంశంగా చూస్తున్నారు. ఈ చర్చలో ఏ రంగు గొప్పది, ఏ రంగు తక్కువది అనే ప్రశ్న లేదు. భారత జాతీయ పతాకంలోని ప్రతీ రంగూ సమాన గౌరవం పొందుతుంది. కానీ, ఒక జాతీయ జట్టు ఎన్నో దశాబ్దాలుగా నిర్మించుకున్న గుర్తింపును మార్చే నిర్ణయం తీసుకున్నప్పుడు ఆ ప్రక్రియ ఎంత పారదర్శకంగా సాగింది? సంబంధిత క్రీడా సంస్థలు, మాజీ ఆటగాళ్లు, అభిమానుల అభిప్రాయాలను ఎంతవరకు పరిగణనలోకి తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం అవసరం. ఒక జట్టు వేసుకునే జెర్సీ కేవలం వస్త్రం కాదు. అది ఒక జట్టు చరిత్రను, విజయాలను, అభిమానుల జ్ఞాపకాలను మోస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల జాతీయ జట్లు తమ సంప్రదాయ రంగులతోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించాయి. ఆ రంగులు వారి క్రీడా సంస్కృతిలో భాగమయ్యాయి. అందుకే అలాంటి గుర్తింపును మార్చే ముందు విస్తృత చర్చ, స్పష్టమైన వివరణ, అన్ని వర్గాల సమ్మతి అవసరం. లేకపోతే చర్చ క్రీడల గురించి కాకుండా రాజకీయాల గురించి మారుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు, క్రీడా సంస్థలు నిర్ణయాలు తీసుకుంటాయి. అయితే జాతీయ ప్రతీకలతో ముడిపడిన అంశాల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం మరింత ముఖ్యమైన బాధ్యత. పారదర్శకత లోపిస్తే అసలు ఉద్దేశం ఎంత మంచిదైనా సందేహాలు పెరుగుతాయి. క్రీడాకారుల ప్రదర్శన గురించి మాట్లాడాల్సిన సమయంలో జెర్సీ రంగు ప్రధాన చర్చగా మారుతుంది. ఇది క్రీడలకు మేలు చేయదు. ఈ సంఘటన ఒక్కటే కాదు. గత కొన్నేళ్లుగా క్రీడలు, రాజకీయాలు ఒకదానిలోకి మరొకటి ప్రవేశిస్తున్నాయనే భావన బలపడుతోంది. దీనికి అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. భారత్–పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక క్రీడా పోటీలు ఎన్నో సంవత్సరాలుగా నిలిచిపోయాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం, భారత్‌లో అనిశ్చితిని పెంచేందుకు ప్రయత్నించడం వంటి చర్యలకు పాకిస్థాన్ పాల్పడుతున్నదని ప్రభుత్వ వాదన. వాస్తవానికి వాటి ప్రాధాన్యతను ఎవరూ కాదనలేరు. అయితే ఈ పరిస్థితి వల్ల క్రీడలే ఎక్కువ నష్టపోయాయి. అభిమానులు ప్రపంచంలో అత్యంత ఆసక్తికరమైన క్రీడా పోటీలను కోల్పోయారు. ఆటగాళ్లు సహజమైన అంతర్జాతీయ పోటీ అవకాశాలను చేజార్చుకున్నారు. అలాగే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో పాకిస్థాన్ ఆటగాళ్లకు అవకాశం లేకపోవడం కూడా రాజకీయాలు క్రీడలపై చూపిన ప్రభావానికి మరో ఉదాహరణగా నిలుస్తుంది. ఒకప్పుడు ఈ లీగ్‌లో పాల్గొన్న ఆటగాళ్లు తరువాత పూర్తిగా దూరమయ్యారు. ఈ నిర్ణయాలకు ప్రభుత్వ విధానాలు, భద్రతా అంశాలు కారణాలుగా నిలిచినా, దాని ప్రభావం మాత్రం క్రీడలపై పడింది. క్రీడాకారులు రాజకీయ నిర్ణయాల ఫలితాన్ని అనుభవించాల్సి వచ్చింది. క్రీడలను రాజకీయాల నుండి ఎంతవరకు దూరంగా ఉంచగలమనే ప్రశ్న ఇక్కడ మళ్లీ ముందుకు వస్తుంది. ప్రపంచ చరిత్రలో రాజకీయాలు క్రీడలను ప్రభావితం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఒలింపిక్స్ బహిష్కరణలు జరిగాయి. అంతర్జాతీయ ఆంక్షలు అమలయ్యాయి. కొన్ని దేశాలు ప్రత్యర్థులతో ఆడేందుకు నిరాకరించాయి. కానీ అవన్నీ అసాధారణ పరిస్థితులు. వాటిని శాశ్వత విధానాలుగా మార్చడం క్రీడాస్ఫూర్తికి విరుద్ధం. రాజకీయ విభేదాలు శాశ్వతం కావు. ప్రభుత్వాలు మారుతాయి. విధానాలు మారుతాయి. కానీ క్రీడలు ప్రజల మధ్య నిర్మించే అనుబంధం చాలా కాలం నిలుస్తుంది. క్రీడల ప్రధాన లక్ష్యం పోటీ ద్వారా పరస్పర గౌరవాన్ని పెంపొందించడం. మైదానంలో ప్రత్యర్థులు ఎంత తీవ్రంగా పోటీ పడినా, మ్యాచ్ ముగిసిన తరువాత చేతులు కలుపుతారు. అదే క్రీడా స్ఫూర్తి. అదే ప్రపంచానికి శాంతి సందేశం. చరిత్రలో క్రికెట్ దౌత్యం, పింగ్‌పాంగ్ దౌత్యం వంటి ఉదాహరణలు దేశాల మధ్య సంభాషణకు క్రీడలు ఎలా దోహదపడ్డాయో చూపించాయి. ప్రజల మధ్య ఏర్పడే విశ్వాసాన్ని రాజకీయ చర్చలు ఒక్కసారిగా సృష్టించలేవు. క్రీడలు ఆ అవకాశాన్ని కల్పిస్తాయి. అందుకే క్రీడలను రాజకీయాలకు పొడిగింపుగా చూడకూడదు. జాతీయ జట్టు ఏ రంగు జెర్సీ ధరించాలి, ఏ రూపకల్పన ఉండాలి వంటి నిర్ణయాలు రాజకీయ చర్చలుగా మారితే అసలు లక్ష్యం దెబ్బతింటుంది. ఆటగాళ్ల శిక్షణ, వ్యూహం, సన్నద్ధత, విజయావకాశాలు ప్రధాన చర్చ కావాలి. జెర్సీ రంగు కాదు. ఒక క్రీడాకారుడు మైదానంలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. అతడు ఏ రాజకీయ భావజాలానికీ ప్రతినిధి కాదు. అందుకే అతడిని రాజకీయ వివాదాల కేంద్రంగా మార్చడం సమంజసం కాదు. మైదానంలో అతని ప్రతిభ మాత్రమే మాట్లాడాలి. భారత్ ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగాలంటే ఆధునిక శిక్షణ కేంద్రాలు, శాస్త్రీయ కోచింగ్, ప్రతిభావంతుల గుర్తింపు, పారదర్శక ఎంపికలు, మెరుగైన పోషకాహార వ్యవస్థ, అంతర్జాతీయ స్థాయి పోటీ అవకాశాలపై దృష్టి పెట్టాలి. జెర్సీ రంగు కంటే క్రీడాకారుడి ప్రదర్శనే దేశ గౌరవాన్ని నిలబెడుతుంది. రాజకీయాలు ప్రజాస్వామ్యానికి అవసరం. అలాగే, క్రీడలు సమాజానికి అవసరం. అయితే ఈ రెండింటి పాత్రలు వేరు. రాజకీయాలు పాలనను నిర్దేశిస్తాయి. క్రీడలు ప్రజలను కలుపుతాయి. అందుకే వీటి మధ్య ఆరోగ్యకరమైన దూరం ఉండాలి. ముఖ్యంగా అంతర్జాతీయ క్రీడా పోటీల్లో జాతీయ ప్రయోజనం అంటే ఆటగాళ్లకు అత్యుత్తమ వాతావరణం కల్పించడం. వారిని రాజకీయ చర్చల మధ్య నిలబెట్టడం కాదు. ●

# భారత్‌పై అమెరికా బలవంతపు సుంకాలు

**ఆర్.సూర్యమూర్తి**

తన వాణిజ్య విధానాన్ని రూపొందించుకోవటానికి అమెరికాకు పూర్తి సార్వభౌమ హక్కు ఉంది. ప్రపంచ సరఫరా గొలుసులలో బలవంతపు కార్మిక వ్యవస్థను ఎదుర్కోవడానికి దానికి పూర్తి హక్కు ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం నుండి బలవంతపు కార్మిక శ్రమను నిర్మూలించాలనే నైతిక ఆవశ్యకతకు భారతదేశంతో సహా కొన్ని దేశాలు మాత్రమే అభ్యంతరం చెప్పగలవు. అయితే, వాషింగ్టన్ ఆ లక్ష్యాన్ని సాధించేందుకు ఏ మార్గాన్ని ఎంచుకుందనేది మరింత లోతైన పరిశీలనకు అర్హమైనది.

న్యూఢిల్లీతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)పై చర్చలు జరుపుతూనే, భారతదేశంతో సహా 60 దేశాల నుండి దిగుమతులపై శాశ్వత సెక్షన్ 301 సుంకాలను విధించడం ద్వారా, ట్రంప్ ప్రభుత్వం వాణిజ్య అమలుకు, వాణిజ్య బలవంతానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మసకబార్చింది. దీని సందేశం స్పష్టంగా ఉంది. చర్చలు కొనసాగవచ్చు, కానీ సుంకాలే ప్రధాన ఒత్తిడి సాధనంగా ఉంటాయి.

ఇది భారతదేశానికి ఆందోళన కలిగించాలి. ఎందుకంటే, అదనపు 10 శాతం సుంకం ఆర్థికంగా వినాశకరమైనది కానందుకు కాదు, అది భారతదేశం–అమెరికా వాణిజ్య సంబంధాల స్వరూపాన్ని, మూలాలనే మారుస్తుంది కాబట్టి. చూడగానే భారతదేశం సాపేక్షంగా ఎటువంటి నష్టం లేకుండా బయటపడినట్లు కనిపిస్తుంది.


కార్మికుల బలవంతపు శ్రమతో ఉత్పత్తి చేయబడిన వస్తువుల దిగుమతులను నిషేధించడానికి న్యూఢిల్లీ తన విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించిన తరువాత, యు.ఎస్. వాణిజ్య ప్రతినిధి కార్యాలయం (యుఎస్‌టిఆర్), భారతీయ ఎగుమతులపై ప్రతిపాదిత అదనపు సుంకాన్ని 12.5 శాతం నుండి 10 శాతానికి తగ్గించింది. లిఖితపూర్వక సమర్పణలు, బహిరంగ విచారణలు, ద్వైపాక్షిక సంప్రదింపుల ద్వారా వాషింగ్టన్‌తో నెలల తరబడి నిరంతర సంప్రదింపుల తర్వాత ఇది జరిగిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ సరిగ్గానే పేర్కొంది. జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, స్మార్ట్‌ఫోన్‌లు, ఉక్కు, అల్యూమినియం, ఆటో విడిభాగాలు వంటి సెక్షన్ 232 సుంకాల పరిధిలోకి ఇప్పటికే వచ్చిన ఉత్పత్తులతో సహా, అమెరికాకు భారతదేశం చేసే ఎగుమతులలో దాదాపు 45శాతం కొత్త సుంకం నుండి మినహాయింపు పొందాయి.

అధిక సుంకాలను ఎదుర్కొంటున్న అనేక పోటీ ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, భారతదేశం సాపేక్షంగా అనుకూలమైన స్థానాన్ని సంపాదించుకుంది. అది శుభవార్త. దుర్వార్త ఏమిటంటే, భారతదేశం ఒక వ్యూహాత్మక ఓటమిని విస్మరిస్తూ, ఒక వ్యూహాత్మక విజయాన్ని జరుపుకుంటుండవచ్చు. 12.5 శాతం నుండి 10శాతానికి తగ్గింపు అంశం వార్తలలో ప్రధానాంశంగా నిలిచింది. కానీ అసలు కథ సుంకం రేటు కాదు, ఆ సాధనం శాశ్వతత్వం గురించి. సెక్షన్ 301 సుంకాలకు గడువు ముగింపు నిబంధన లేదు. నిబంధనల పాటిస్తున్నట్లు అమెరికా మాత్రమే నిర్ధారించేంత వరకు అవి అమలులో ఉంటాయి. మరో మాటలో చెప్పాలంటే, వాషింగ్టన్ ఏకకాలంలో దర్యాప్తుదారుగా, ప్రాసిక్యూటర్‌గా, న్యాయమూర్తిగా, శిక్ష అమలుదారుగా వ్యవహరిస్తుంది.

అది నియమాల ఆధారిత వాణిజ్యం కాదు. అది నిబంధనలు ఒక పక్షం రాసి, తన విచక్షణ మేరకు అమలు చేసే వాణిజ్యం. ఈ వ్యత్యాసం కీలకమైనది, ఎందుకంటే భారతదేశం, అమెరికా వాణిజ్య యుద్ధంలో నిమగ్నమైన ప్రత్యర్థులు కాదు. అవి ఒక చారిత్రాత్మక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంగా పదే పదే వర్ణించబడుతున్న అంశంపై చర్చలు జరుపుతున్న వ్యూహాత్మక భాగస్వాములు. ఇరుపక్షాల అధికారులు చర్చలు తుది దశలో ఉన్నాయని, కేవలం మార్కెట్ ప్రవేశం, వ్యవసాయం, డిజిటల్ వాణిజ్యం, పెట్టుబడి, కార్మిక, పర్యావరణ ప్రమాణాలు వంటి కొన్ని క్లిష్టమైన సమస్యలు మాత్రమే పరిష్కారం కాకుండా మిగిలి ఉన్నాయని సూచించారు. వాణిజ్య ఒప్పందాలు అనిశ్చితిని తగ్గించడానికి ఉద్దేశించబడ్డాయి. అయినప్పటికీ, చర్చలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, వాషింగ్టన్ ఒక కొత్త సుంకాల విధానాన్ని సంస్థాగతం చేయాలని నిర్ణయించుకుంది. ఇది ఒక స్పష్టమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: అసలు భారతదేశం దేని గురించి చర్చలు జరుపుతోంది? ఒక దేశం అమెరికా డిమాండ్‌లకు కట్టుబడి, తన దేశీయ చట్టాలను సవరించి, విచారణలలో పాల్గొని, ప్రక్రియ అంతటా సహకరించినప్పటికీ, శాశ్వత సుంకాలకు లోబడి ఉండాల్సివస్తే, భవిష్యత్‌కు సంబంధించిన నిబద్ధతలు భిన్నమైన ఫలితాలను ఇస్తాయని నమ్మటం ఎలా?

ఈ వైరుధ్యాన్ని విస్మరించడం కష్టం. కార్మికుల బలవంతపు శ్రమతోనే తయారు చేయబడిన వస్తువులు దిగుమతులను నిషేధించడంలో విఫలమైనందుకే ఈ సుంకాలు విధించామని వాషింగ్టన్ వాదిస్తోంది. కోరిన విధంగానే భారతదేశం కచ్చితంగా స్పందించింది. బలవంతపు లేదా నిర్బంధ కార్మిక శ్రమ ద్వారా ఉత్పత్తి చేయబడిన వస్తువుల దిగుమతిని నిషేధిస్తూ, 2026 జూన్ లో తన విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించింది. యుఎస్‌టిఆర్ స్వయంగా భారతదేశ విధాన ప్రతిస్పందనను గుర్తించి, దానిని దిగువ 10 శాతం సుంకాల శ్రేణిలోకి మార్చింది. అయినప్పటికీ సుంకం అలాగే ఉంది.

> *భారతదేశం రాయితీలతో కాకుండా విశ్వాసంతో చర్చలు జరపాలి. ఏకపక్ష వాణిజ్య చర్యల భవిష్యత్ అమలును బిటిఎ స్పష్టంగా ప్రస్తావించాలి. సుంకాలు విధించే ముందు సంప్రదింపుల యంత్రాంగాలను, పారదర్శకమైన సమ్మతి సమీక్షలను, స్వతంత్ర వివాద పరిష్కార ప్రక్రియలను, అంగీకరించిన షరతులు నెరవేరిన తర్వాత సెక్షన్ 301 క్రింద చర్యలను తొలగించడానికి స్పష్టంగా నిర్వచించిన మార్గాలను ఇది ఏర్పాటు చేయాలి. లేకపోతే, ఈ ఒప్పందం వాషింగ్టన్ నుండి పదేపదే జరిగే ఏకపక్ష జోక్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది.*



సుంకాల ఉపశమనం లభిస్తుందనే ఆశతో న్యూఢిల్లీ అమెరికా ఏకపక్ష డిమాండ్లకు తలొగ్గుతూనే ఉండాలా? లేక అటువంటి సమస్యలను ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) పరిధిలోనే పరిష్కరించుకోవాలని పట్టుబట్టాలా? సమాధానం స్పష్టంగా ఉండాలి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కేవలం అమెరికా ఏకపక్ష సుంకాల చర్యలతో కలిసి ఉండే పత్రంగా మారడానికి భారతదేశం అనుమతించకూడదు.

అంతే శ్రద్ధకు అర్హమైన మరో ఆందోళన కూడా ఉంది. బలవంతపు కార్మిక శ్రమ పేరుతో సుంకాలు ఒక ప్రమాదకరమైన సంప్రదింపుల సంప్రదాయాన్ని సృష్టిస్తాయి. బిటిఎను ముగించే ముందు విధాన మార్పులను రాబట్టడంలో వాషింగ్టన్ విజయం సాధిస్తే, భారతదేశంతో సంప్రదింపులకు ఏకపక్ష ఒత్తిడే అత్యంత ప్రభావవంతమైన వ్యూహం అని భవిష్యత్ ప్రభుత్వాలు నిర్ధారణకు రావచ్చు. వచ్చేసారి సమస్య బలవంతపు కార్మిక శ్రమ విధానం కాకపోవచ్చు. అది వాతావరణ నిబద్ధతలు, డిజిటల్ నియంత్రణ, డేటా పాలన, వ్యవసాయ రాయితీలు, ఔషధాల ధరలు, మేధో సంపత్తి, కార్మిక ప్రమాణాలు లేదా భారతదేశ భౌగోళిక రాజకీయ సంబంధాలు కూడా కావచ్చు.నిజానికి, ఇటీవల అమెరికా వాణిజ్య చర్యలు ఇప్పటికే అటువంటి గమనాన్ని సూచిస్తున్నాయి. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా సమర్థించబడిన సెక్షన్ 232 సుంకాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. పరస్పర సుంకాలు విపరీతంగా పెరిగిపోయాయి. వ్యూహాత్మక అంశాలతో ముడిపడి ఉన్న దేశాల వారీ సుంకాలు సర్వసాధారణమయ్యాయి. అదనపు ఉత్పాదక సామర్థ్యంపై మరో సెక్షన్ 301 విచారణ ఇప్పటికే కొనసాగుతోంది.

నేటి 10 శాతం సుంకం సవాలు కాదు. రేపటి సమర్థనే అసలైన సవాలు. సుంకం 10శాతమైనా లేదా 12.5 శాతమైనా, శాశ్వత విధాన అనిశ్చితి పెట్టుబడులను నిరుత్సాహపరుస్తుంది, సరఫరా నిర్ణయాలను క్లిష్టతరం చేస్తుంది, ఫైనాన్సింగ్ ఖర్చులను పెంచుతుంది.

ఇది ఇతర వాణిజ్య భాగస్వాములకు పంపే సందేశం కూడా అంతే ఆందోళనకరమైనది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలకు చర్చలు జరుపుతూనే ఏకపక్ష సుంకాలు విధించటం బహుళపక్ష వాణిజ్య వ్యవస్థ క్రమంగా క్షీణించే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ వాణిజ్య చట్టం లేదా ప్రపంచ వాణిజ్య సంస్థ కాకుండా, దేశీయ రాజకీయ పరపతే మార్కెట్ ప్రవేశాన్ని నిర్ణయిస్తుందని దేశాలు ఎక్కువగా నిర్ధారణకు రావచ్చు. అది ప్రపంచ వాణిజ్యాన్ని పోటీపడే ప్రభావ క్షేత్రాలుగా విభజించడాన్ని వేగవంతం చేస్తుంది. నియమాల ఆధారిత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థకు అగ్రగామిగా నిలవడానికి భారతదేశం దశాబ్దాలుగా కృషి చేసింది. కేవలం కొంతమంది పోటీదారుల కంటే తక్కువ సుంకాన్ని పొందిందన్న కారణంతో ఆ సూత్రాన్ని విడిచిపెట్టకూడదు.

వీటన్నిటి అర్థం భారతదేశం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) నుండి వైదొలగాలని కాదు. దానికి పూర్తి విరుద్ధంగా, అమెరికాతో మరింత సన్నిహిత ఆర్థిక ఏకీకరణకు ఆధారమైన వ్యూహాత్మక తర్కం ఇప్పటికీ బలంగా ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా విస్తరిస్తోంది. సెమీకండక్టర్లు, రక్షణ రంగ తయారీ, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, కృత్రిమ మేధస్సు, డిజిటల్ టెక్నాలజీల రంగాలలో సహకారం మునుపెన్నడూ లేనంత గాఢంగా ఉంది. సమర్థవంతంగా చర్చలు జరిపి కుదుర్చుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం, సరఫరా గొలుసుల స్థితిస్థాపకతను బలోపేతం చేయగలదు, ప్రపంచ తయారీ రంగం చైనాపై అధికంగా ఆధారపడకుండా వైవిధ్యపరుస్తుంది. భారతీయ ఎగుమతిదారులకు గణనీయమైన అవకాశాలను అందించగలదు. కానీ, ఈ సంబంధం వ్యూహాత్మకంగా ముఖ్యమైనది కాబట్టే, భారతదేశం రాయితీలతో కాకుండా విశ్వాసంతో చర్చలు జరపాలి. ఏకపక్ష వాణిజ్య చర్యల భవిష్యత్ అమలును బిటిఎ స్పష్టంగా ప్రస్తావించాలి. సుంకాలు విధించే ముందు సంప్రదింపుల యంత్రాంగాలను, పారదర్శకమైన సమ్మతి సమీక్షలను, స్వతంత్ర వివాద పరిష్కార ప్రక్రియలను, అంగీకరించిన షరతులు నెరవేరిన తర్వాత సెక్షన్ 301 క్రింద చర్యలను తొలగించడానికి స్పష్టంగా నిర్వచించిన మార్గాలను ఇది ఏర్పాటు చేయాలి. లేకపోతే, ఈ ఒప్పందం వాషింగ్టన్ నుండి పదేపదే జరిగే ఏకపక్ష జోక్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది.

అలాగే సుమారు 45 శాత ం ఎగుమతులు కొత్త సుంకాల పరిధిలోకి రాలేదని వాణిజ్య మంత్రిత్వ శాఖ సరిగ్గానే నొక్కి చెప్పింది. ఇవి స్పష్టమైన విజయాలు. అయినప్పటికీ, విజయాన్ని అంతిమంగా, భారతదేశం సుంకాన్ని 12.5శాతం నుండి 10శాతానికి తగ్గించుకోవడానికి చర్చలు జరిపిందా లేదా అనే దానితో కాకుండా, తుది ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఇటువంటి ఏకపక్ష చర్యలు సర్వసాధారణం కాకుండా నిరోధిస్తుందా లేదా అనే దానితో సరిచూసుకోవాలి.


ఒత్తిడిలో చర్చలు జరపడం వల్ల శాశ్వత భాగస్వామ్యాలు అరుదుగా ఏర్పడతాయని చరిత్ర సూచిస్తుంది. అందువల్ల, భారతదేశం బిటిఎ తుది దశలను స్పష్టతతో సమీపించాలి. స్వల్పకాలిక సుంకాల ఉపశమనం కోసం దీర్ఘకాలిక వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని వదులుకునే ప్రలోభాన్ని అది నిరోధించాలి. ఒక సమగ్ర వాణిజ్య ఒప్పందం ఏకపక్ష అడ్డంకులను చట్టబద్ధం చేయకుండా, వాటిని తగ్గించాలని అది పట్టుబట్టాలి.

# స్నేహం ఓ త్యాగం ఆపదలో అభయహస్తం!

స్నేహం అంటే ఓ త్యాగం, ఆపదలో అభయహస్తం, కష్టాల్లో ఓ శీతల నేస్తం, ఆపదలో సాంత్వన నీడను చేకూర్చే మహావృక్షం. ప్రాణ స్నేహితులకు ప్రత్యామ్నాయం ఉండదు. స్నేహం చేయని మనిషి ఉండడు. స్నేహితులు లేని తనువు ఉండదు. ప్రతి వ్యక్తి జీవితంలో స్నేహానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. స్నేహితుల హస్తాలు నిస్వార్థ నేస్తాలు. బంధువులతో లేని ఓ అపురూపమైన అనుబంధం స్నేహితులతో ఉంటుంది. కొన్ని సమయాల్లో కుటుంబ సభ్యులతో పంచుకోలేని విషయాలను సహితం స్నేహితులతో పంచుకుంటాం. మనకు స్నేహితులు అనేకులు ఉండవచ్చు కాని ప్రాణ మిత్రులు కొద్ది మంది మాత్రమే ఉంటారు. ప్రాణ స్నేహితులతో మనం అన్ని విషయాలను దాపరికం లేకుండా పంచుకుంటాం. మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది స్నేహ హస్తం. సహానుభూతికి ఓ చక్కని ఉదాహరణ స్నేహం. పరస్పర గౌరవానికి, త్యాగానికి చిరునామా ఫ్రెండ్‌షిప్. సన్నిహిత మిత్రుడు అంటే ఓ మహా నమ్మకం. స్నేహానికి వయోభేదం లేదు. చంటి వాడి నుంచి పండు ముసలి వరకు అందరికీ స్నేహితులు ఉంటారు, వద్దన్నా ఆనందాలను వడ్డిస్తూ ఉంటారు.

**జాతీయ స్నేహ దినోత్సవం–2026 :**

స్నేహం విలువను తెలుసుకోవడం, మంచి స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అపార్థాలను నివృత్తి చేసుకొని స్నేహాన్ని కొనసాగించడం, బేదాభిప్రాయాలను దూరం చేసుకోవడం, పౌర సమాజం లో శాంతి పందిరి వేయడానికి అనుకూలమైన అనువైన సందర్భంగా ప్రతి ఏట ఆగస్టు మాసంలోని మొదటి ఆదివారం రోజు, అనగా 02 ఆగస్టు 2026 న భారతదేశ వ్యాప్తంగా జాతీయ స్నేహ దినోత్సవం (నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే) పాటించడం కొనసాగుతున్నది. 2026 జాతీయ స్నేహ దినం వేదికగా స్నేహ మార్గం ద్వారా శాంతి, సంఘీభావం, సంస్కృతుల మధ్య అవగాహనలను పెంపొందించే ప్రయత్నాలు నిర్వహించాలి. వివిధ దేశాలు, జాతులు, మతాలు,



కులాలు, అసమానతలను మరిచి అందరం స్నేహ బంధంతో ఏకం కావడమే లక్ష్యంగా ఈ దినోత్సవా న్ని జరుపుకుంటాం. స్నేహ బంధం పరమ పవిత్రమైనది. నిజమైన స్నేహితుల మధ్య విడదీయరాని ప్రేమ అనే అభేద్య బంధం పెనవేసుకొని ఉంటుంది. మంచి స్నేహితులు కొన్ని విషయాల్లో విభేదించినా, సదా ఒక్కటిగానే ఉంటా రు.

**స్నేహితులతో కొత్త ప్రపంచం పరిచయం :**

చిన్ననాడే స్నేహం అనే బంధం మొలకెత్తుతుంది. అమ్మానాన్న తర్వాత మన సంక్షేమాన్ని, శ్రేయస్సును నిస్వార్థంగా తలుస్తూ మనవెంట నడిచే వ్యక్తులు మన ప్రాణ మిత్రులు మాత్రమే. బడికి వెళ్లడంతో మనకు నూతన స్నేహితులు పుడతారు. వారితోనే మన దినచర్య ముడిపడి ఉంటుంది. చదవడం, ఆడడం, పాడడం, మాట్లాడుకోవడం, సరదాగా తిరగడం లాంటివి మన ప్రాణ స్నేహితులతోనే ముడిపడి ఉంటాయి. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునే స్థాయికి స్నేహం ఎదుగుతుంది. వయస్సు పెరిగిన కొద్దీ తరగతులు మారుతూ, కొత్త మిత్రులు వచ్చి చేరతారు. పాత మిత్రుల స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. స్నేహితులు పెరిగిన కొద్దీ బయటి ప్రపంచం కొత్తగా కనిపిస్తుంది. అందరి సంస్కృతీ వారసత్వాలు అర్థం అవుతాయి. మన జీవితానికి లక్ష్యాలను కూడా మిత్రులు నిర్ణయించుకునే స్థాయి కూడా వస్తుంది. జాతీయ స్నేహ దినం వేదికగా పాత మిత్రులను కలవడం, కొత్త మిత్రులతో సరదాగా గడపడం, ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, పాత స్నేహితుల సమావేశం పెట్టుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ పంచుకోవడం, తమతమ అనుభవాలను పంచుకోవడం, స్నేహితుల కష్టాలను తెలుసుకొని సహాయం చేయడం, సామాజిక మాధ్యమాల్లో స్నేహబంధాల విలువను వివరించడం, పాత స్నేహితులతో ఉన్న ఫోటోలను పంచుకోవడం, హాపీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు.

**(02 ఆగస్టు జాతీయ స్నేహ దినోత్సవం సందర్భంగా)**

# సింగరేణికే మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్



● జెన్‌కోను వేలం నుంచి తప్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని పికెఒసి2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను జెన్‌కోకు కాకుండా సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సిడబ్ల్యుయు–ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొగ్గు వెలికితీత కనీస పరిజ్ఞానం గానీ, యంత్రాలు కూడా లేని జెన్‌కో ఈ వేలం పాటలో పాల్గొనడమంటే సింగరేణికి అన్యాయం చేయడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 3న జరగనున్న బొగ్గు బ్లాక్ వేలంలో జెన్‌కో పోటీ నుంచి తప్పుకుని, డీప్‌సైడ్ బ్లాక్‌ను నేరుగా సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ గతంలోను తాడిచర్ల1 గనిని జెన్‌కోకు కేటాయించినప్పటికీ, గనుల నిర్వహణ సామర్థ్యం లేక ఎఎంఆర్ అనే ప్రైవేట్ సంస్థ ద్వారా బొగ్గు తవ్విస్తున్నారని, ఇందుకు టన్నుకు రూ.3800లు జెన్‌కో చెల్లిస్తుండగా అదే సింగరేణి రూ.3400లకే సరఫరా చేస్తోందన్నారు. ఇదే క్రమంలో, ప్రైవేట్ కాంట్రాక్టర్లకే లాభం చేకూర్చడం ద్వారా వందల కోట్లను దోచుకునేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బొగ్గు వెలికితీతలో ఎంతో పరిజ్ఞానం ఉన్న పలు ప్రైవేట్ సంస్థలు మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ టెండర్లలో ఈసారి ఆసక్తి చూపలేదని, అయినప్పటికీ ఏ మాత్రం పరిజ్ఞానం గానీ యంత్రాంగం గానీ లేని జెన్‌కో టెండర్‌లో పాల్గొనడం వెనుక ఇంధన శాఖలోని కొంతమంది అధికారుల హస్తం ఉందని ఆరోపించారు. తద్వారా ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చడం ద్వారా వందల కోట్లు దండుకునేందుకే ఇదంతా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో ప్రస్తుతం 40 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 30 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి రాకపోతే 2032 తర్వాత మణుగూరు ప్రాంతంలో సింగరేణి కార్యకలాపాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో 3,500 మంది శాశ్వత ఉద్యోగులు, 2,000 మంది కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడుతుందని ఆయన తెలిపారు.

**బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది**

సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయాలనే కుట్రలు పన్నితే గతంలో బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి సంస్థ పట్ల వ్యవహరించిన తీరు కారణంగానే గత అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి విస్తరించి ఉన్న 11 నియోజకవర్గాల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిందని వారు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బిఆర్‌ఎస్ తరహాలో వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో ఆ కాంగ్రెస్‌కు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని, మణుగూరు బొగ్గు గనిని వేలం పాట నుంచి జెన్‌కోను తప్పించి సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా ఇలాంటి ప్రయత్నాలను కార్మిక ఉద్యమాలతో అడ్డుకున్నామని వారు గుర్తు చేశారు. మీడియా సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, ఎస్‌సిడబ్ల్యుయు నేత వేణుమాధవ్ పాల్గొన్నారు.



# భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా బిల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ విద్వేషపూరిత ప్రసంగం, విద్వేషపూరితమైన నేరాల (నివారణ) బిల్లు 2026'పై ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ తన బాధ్యతను నిష్పాక్షికంగా, సమగ్ర పరిశీలనతో, నిర్మాణాత్మక చర్చల స్ఫూర్తితో నిర్వహిస్తుందనే పూర్తి విశ్వాసం ఉందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 'తెలంగాణ విద్వేషపూరిత ప్రసంగం, విద్వేషపూరితమైన నేరాల (నివారణ) బిల్లు 2026'పై ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ తొలి సమావేశం శనివారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో జరిగింది. సమావేశంలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, సెలెక్ట్ కమిటీ చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, సిపిఐ శాసనసభాపక్ష నాయకులు, కమిటీ సభ్యులు కూనంనేని సాంబశివరావు, కమిటీ సభ్యులు దానం నాగేందర్, కోవా లక్ష్మీ, జి.మధుసూదన్ రెడ్డి, తోట లక్ష్మీ కాంతారావు, కవ్వంపల్లి సత్యనారాయణ, మామిడాల యశస్విని, కోనేటి మాణిక్ రావు, అహ్మద్ బిన్ అబ్దుల్ బలాల, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ఈ బిల్లును సమగ్రంగా పరిశీలించి, తగిన సిఫార్సులతో కూడిన నివేదికను శాసనసభకు సమర్పించే ముఖ్యమైన బాధ్యతను ఈ కమిటీకి సభ అప్పగించినట్లు చెప్పారు. సెలెక్ట్ కమిటీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే విధంగా, భవిష్యత్తు తరాలకు కూడా మార్గదర్శకంగా ఉండే విధంగా సభ్యుల సహకారంతో నియమాలను రూపొందిస్తామని తెలిపారు. సెలెక్షన్ కమిటీలో అనుభవం ఉన్న సభ్యులు ఉన్నారని, అందరం కలిసి సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. తరుచు సమావేశాలు నిర్వహిస్తూ సాధ్యమైనంత త్వరగా నివేదికను సభాపతి అందజేస్తామని వెల్లడించారు.

# అంతర్రాష్ట్ర, ప్రాంతీయ అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



● దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో రాష్ట్రం తరఫున ప్రస్తావించాల్సిన కీలక అంతర్రాష్ట్ర, ప్రాంతీయ అంశాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రణాళిక శాఖకు సూచించారు. ఇందుకోసం రాష్ట్రానికి సంబంధించిన అన్ని ఎజెండా అంశాలను సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 20న తమిళనాడులోని చెన్నై సమీపంలోని మహాబలిపురంలో జరగనున్న దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశం సన్నాహకాలపై సిఎస్ సంజయ్ జాజు శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ప్రాథమిక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ తరపున కౌన్సిల్ ముందు ఉంచాల్సిన అంశాలతో పాటు, వివిధ శాఖలు చేపట్టాల్సిన సన్నాహకాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సిఎస్ జాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన సమాచారం, గణాంకాలు, ప్రతిపాదనలతో సమావేశానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతర్రాష్ట్ర ప్రాధాన్య అంశాలు, ప్రాంతీయ ప్రయోజనాలకు సంబంధించిన కీలక సమస్యలను గుర్తించి, వాటిని కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రం తరపున ప్రస్తావించే అవకాశాలను పరిశీలించాలని ప్రణాళిక శాఖకు సంజయ్ జాజు సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ అంశాలపై రానున్న రెండు రోజుల్లో పూర్తి వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తెలంగాణ తరపున సమగ్ర ప్రతిపాదనలు, సిఫార్సులను రూపొందించి ముఖ్యమంత్రి పరిశీలనకు పంపించాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ అధికారులు వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, గౌరవ్ ఉప్పల్, ఈ.శ్రీధర్, క్రిస్టినా జెడ్ జోంగ్తు తదితరులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు కోసం యువత రాజకీయాల్లోకి రావాలి

● సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ్మా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ భవిష్యత్ కోసం యువత రాజకీయాల్లోకి రావాలని, కేంద్ర యువజన వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సమర శంఖం పూరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ్మా పిలుపునిచ్చారు. తద్వారా యువత ఈ దేశ భవిష్యత్‌ను నిర్ణయించాలని కోరారు. సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర 3వ మహాసభల లోగోను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇటి నరసింహ్మా మాట్లాడుతూ దేశంలో అత్యధిక జనాభా యువతదే అయినప్పటికీ, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ వైపు సాగుతోందని విమర్శించారు. జాతీయ యువజన విధానం పేరుతో ప్రకటనలు చేస్తున్నా, యువతకు శాశ్వత ఉద్యోగాలు, నాణ్యమైన ప్రభుత్వ విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, ప్రజాస్వామ్య భాగస్వామ్యం వంటి అంశాలపై స్పష్టమైన హామీలు అమలు కావడంలేదన్నారు. దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయకుండా, ఎన్నికల సమయంలో మాత్రమే యువతను గుర్తు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. యువత రాజకీయాలకు దూరంగా ఉంటే ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదన్నారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరిరక్షణలో యువత ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగ, విద్య, వైద్య, కార్మిక హక్కులు, మహిళల భద్రత, రైతుల సంక్షేమం, శాస్త్రీయ దృక్పథం వంటి అంశాలపై ఉద్యమాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

**యువతకు కొత్త దిశానిర్దేశం చేసే చరిత్రాత్మక వేదికగా మహాసభలు**

సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు యువతకు కొత్త దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక వేదికగా నిలుస్తాయని రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన విధానాలు, నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యా, వైద్య రంగాల పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం, శాంతి, శాస్త్రీయ సోషలిజం వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిపి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు వారు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో మహాసభలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నేర్లకంటి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు బిజ్జా శ్రీనివాసులు, లింగం రవి, నానాబాల రామకృష్ణ, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, ఎం.శ్రీమాన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.




# 19 నుంచి పోలీసు కొలువులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (టిఎస్ఎల్‌పిఆర్‌బి) ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 7,437 పోలీసు, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఆన్‌లైన్ దరఖాస్తుల తేదీలను ప్రకటించింది. ఈ నెల19 ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 9 సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని బోర్డు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. దరఖాస్తులు www.tgprb.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే స్వీకరిస్తామని, ఇతర మార్గాల్లో పంపిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. ఈ నియామక ప్రక్రియలో సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్, ఫైర్‌ఫైటర్, వార్డర్, డిప్యూటీ జైలర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తదితర పోస్టులు ఉన్నాయి. బోర్డు నిర్ణయించిన ఒకేసారి చెల్లించే ఫీజుతో దరఖాస్తు, ప్రిలిమినరీ రాత పరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్/ఎఫిషియెన్సీ టెస్ట్, ఫైనల్ రాత పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్, బయోమెట్రిక్స్, ఫలితాల ప్రాసెసింగ్ తదితర మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది. పోస్టును బట్టి ఒసి/బిసిలకు రూ.600 నుంచి రూ.1,500, ఎస్సీ/ఎస్టీ స్థానిక అభ్యర్థులకు రూ.600 నుంచి రూ.750 వరకు ఫీజు నిర్ణయించింది. ఒకటి కంటే ఎక్కువ కామన్ ప్రొసీజర్ కేటగిరీలకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు ఒకే పిఎంటి, పిఇటి నిర్వహించి, అదనపు దరఖాస్తులపై ఫీజు రాయితీ కూడా కల్పిస్తామని బోర్డు వెల్లడించింది. అలాగే దరఖాస్తు చేసుకునే ముందు మొబైల్‌లో ఆధార్ ఫేస్ ఆథెంటికేషన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.


తెలంగాణ ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటి కలెక్టరు వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబగద్వాల జిల్లా

**ఫారం - VII**

**రూఢి ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)**

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)

జిల్లా కలెక్టరు, జోగులాంబ గద్వాల
ప్రొసిడింగ్స్ నెం. G/372/2025 — తేది : 09.06.2025

ప్రత్యేక ఉపకలెక్టరు, (భూసేకరణ)
జె.యల్.ఐ.పి లేఖ నెం. A2/41/2018 — తేది : 06.06.2026

జిల్లా రాజపత్రం నెం. 15/2026 — తేది : 06.06.2026

ఈ దిగువ నిర్ధిష్ట పరిచిన జోగులాంబగద్వాల జిల్లా, గద్వాల మండలము మేలచెర్వు గ్రామము విస్తీర్ణము ఎ. 6.475 సెం.లు ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా అనగా Package No. 99(D) D-17 Canal నిర్మాణ నిమిత్తము, అవసరమైయున్నదని భావించనైనది.
కావున జోగులాంబగద్వాల జిల్లా, గద్వాల మండలము మేలచెర్వు గ్రామము విస్తీర్ణము ఎ.6.475 సెం.లు గల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

| క్ర. సం. | సర్వే నెం. | భూమి వర్గం (పట్టా / ప్రభుత్వ/ఇనాం వగై.) | భూమి రకం (మెట్ట / తరి మొ.) | భూసేకరణ చేయు విస్తీర్ణము ఎ.సెం.లు | పేరు / చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు) | [illegible] |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 1 | లావుణీ పట్టా | మెట్ట | 2.225 | ప్రభుత్వ భూమి<br>**అనుభవదారులు**<br>1. మాదమ్మ W/o పెద్ద తిమ్మన్న | లేవు |
| 2 | 127 | పట్టా | మెట్ట | 0.725 | 1.బోయ తిమ్మమ్మ W/o పెద్ద వీరన్న<br>**అనుభవదారులు**<br>1. బోయ తిమ్మమ్మ W/o పెద్ద వీరన్న | లేవు |
| 3 | 128 | పట్టా | మెట్ట | 1.275 | 1.మల్లమ్మ W/o యేల్కూర్ పక్కీరన్న<br>2.రహీముద్దీన్ S/o ఇమామ్ సాబ్<br>**అనుభవదారులు**<br>1.M.D.రహీముద్దీన్ S/o ఇమామ్ సాబ్<br>2.మల్లమ్మ W/o పకీరన్న | లేవు |
| 4 | 129 | పట్టా | మెట్ట | 0.25 | 1.రాముడు S/O కుర్వ నాగన్న<br>2. జయలక్ష్మి W/o కుర్వ పరుశరాముడు<br>**అనుభవదారులు**<br>1. కుర్వ ఈదన్న S/o నాగన్న | లేవు |
| 5 | 139 | పట్టా | మెట్ట | 0.60 | 1. కుర్వ అనంతమ్మ W/o హనుమంతు<br>**అనుభవదారులు**<br>1. అనంతమ్మ W/o హనుమంతు<br>2.బాట | లేవు |
| 6 | 140 | పట్టా | మెట్ట | 0.60 | 1. కూతల వెంకటమ్మ W/o కుత్యాల బోయ కృష్ణ<br>2.చింతలన్న S/o సుంకన్న<br>3. కుర్వ కిష్టమ్మ W/o చెంద్రన్న<br>4.కుర్వ ఆంజనేయులు S/o ఈదన్న<br>5. పరుశరాముడు S/o సుంకన్న<br>**అనుభవదారులు**<br>1. కుర్వ సుంకన్న S/o పి.చింతలన్న<br>2.కె.అనంతమ్మ W/o హనుమంతు<br>3. బాట | లేవు |
| 7 | 141 | పట్టా | మెట్ట | 0.80 | 1. బోయ పెద్ద రాముడు S/o చిన్నయ్య<br>2. బోయ చిన్న రాముడు S/o చిన్నయ్య<br>3. బోయ తిమ్మన్న S/o చిన్నయ్య<br>**అనుభవదారులు**<br>1. పెద్ద రాముడు S/o చిన్నయ్య<br>2.చిన్న రాముడు S/o చిన్నయ్య<br>3.P.B.తిమ్మన్న S/o చిన్నయ్య | లేవు |
| మొత్తం విస్తీర్ణం : 6.475 | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ వలన ఎవ్వరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావాసం మరియు పునరుపాధి కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

భూసేకరణ తల పెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోతమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏద్దైన పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టరు. జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల
సం/- అదనపు కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా
సం/- కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO NO. 578/LA/PP/Advt/Pub/2026-27




# నామినేటెడ్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్ కసరత్తు... విధివిధానాలు ఖరారు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పిఎసిఎస్) డైరెక్టర్లు, చైర్మన్లతో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెట్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్ కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా శనివారం టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి సమావేశమై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించి పార్టీ పరంగా అనుసరించాల్సిన విధివిధానాలను రూపొందించారు. ఉమ్మడి జిల్లాలకు నియమించిన ఇంఛార్జీ మంత్రులు, ఆయా జిల్లాల్లోని మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, సీనియర్ నాయకులతో సమావేశమై అందరి సమన్వయంతో ఆశావహుల జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఈ నామినేటెడ్ పోస్టుల్లో భర్తీలో సుమారు 60 శాతం స్థానాలను గత మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గంలో పనిచేసిన నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకులకు కేటాయించడంతో నియామకాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించారు. అన్ని స్థాయిల్లో సంప్రదింపులు పూర్తిచేసి తుది జాబితాను సిద్ధం చేసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంయుక్తంగా తుది నిర్ణయం తీసుకుంటారని సమావేశంలో నిర్ణయించారు.

# సుప్రీంకోర్టు తీర్పుతో సాగునీటి ప్రాజెక్టులకు ఊతం

సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గౌరవెల్లి, పాలమూరు రంగారెడ్డి, సీతమ్మసాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీం కోర్టు తీర్పు కొత్త ఊపునిస్తుందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని, రైతుల సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని తెలిపారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ, సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వంటి ప్రముఖులను నియమించి సుప్రీంకోర్టులో సమర్థవంతంగా న్యాయపోరాటం చేసిన ఫలితంగానే ఈ అనుకూల తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ హక్కుల పరిరక్షణలో ముఖ్యమంత్రి తీసుకున్న చొరవ, ప్రభుత్వం చేసిన న్యాయ పోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని పొన్నం ప్రభాకర్ అభినందించారు. సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఒక్కరోజులో 2.20 లక్షల లావాదేవీలు

# మీసేవ ఆల్‌టైమ్ రికార్డు

● డిజిటల్ సేవల్లో తెలంగాణ మరో మైలురాయి

● దేశంలోనే నంబర్-1 ప్రభుత్వ ఆన్‌లైన్ వేదికగా మీసేవ : మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వేదిక మీసేవ మరో అరుదైన రికార్డును సృష్టించింది. సాధారణంగా రోజుకు 70 నుంచి 80 వేల మధ్య నమోదయ్యే లావాదేవీలు, జూలై 31న ఒక్కరోజే 2,20,172కు చేరుకుని ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేశాయి. ప్రజల నుంచి లభిస్తున్న విశ్వాసం, ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ సంస్కరణల ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ డిజిటల్ వేదికను మరింత బలోపేతం చేస్తూ ప్రభుత్వ సేవలను ఒకే వేదికపై వేగంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఒక్కరోజులో ఇంత భారీ స్థాయిలో ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా లావాదేవీలు పూర్తికావడం దేశంలోనే మీసేవను అత్యుత్తమ ప్రభుత్వ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌గా నిలబెట్టిందన్నారు. జూలై 31న నమోదైన లావాదేవీల్లో ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఫ్యామిలీ కార్డు దరఖాస్తులు, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు అత్యధికంగా నమోదై తొలి మూడు స్థానాల్లో నిలిచాయని వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చి, అత్యాధునిక సాంకేతికతతో సేవల వేగం, నాణ్యత, పారదర్శకతను మరింత పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం

● ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులకు మంత్రి తుమ్మల భరోసా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్‌పామ్ రైతుల సమస్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుందని, రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా అన్ని చర్యలు చేపడుతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులకు భరోసా ఇచ్చారు. శనివారం సచివాలయంలో వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నిర్మల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, శాంభరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు మంత్రి చేపడుతున్న చర్యలను రైతు నాయకులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలు సకాలంలో అందుబాటులో ఉండేలా కంపెనీలను ఆదేశించాలని, అవసరమైన ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రిని ఆయిల్ పామ్ కంపెనీల ద్వారా తక్కువ ధరలకు సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తప్పకుండా అన్ని చర్యలు చేపడుతుందని ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అధికారులు, కంపెనీలు, రైతులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రాంతం దేశంలోనే ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని, ఆయిల్ పామ్ అధిక ఆదాయం అందించే పంట అని, దీనికి మార్కెటింగ్ సమస్యలు లేవని, ప్రకృతి వైపరీత్యాల ప్రభావం కూడా తక్కువగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. రైతులు కోరిన వెంటనే నాణ్యమైన మొక్కలను అందుబాటులో ఉంచేలా ఆయిల్ పామ్ కంపెనీలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్.**

టెండర్ నోటీస్ ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)

Nit No. 12/EE/CMC/CIR-48/2026-27 — Dt: 31.07.2026

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా (05) పనుల కొరకు నెం. Nit No. 12/EE/CMC/CIR-48/2026-27 (ఐటెమ్ నెం.01 నుండి 05), తేదీ: 31.07.2026 ప్రకారం టెండర్లను ఆహ్వానించడమైనది. **అంచనా విలువ:** రూ.75.78 లక్షలు, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్ 01.08.2026 ఉ.11:30గం.ల నుండి బిడ్ల విక్రయం ప్రారంభమవుతుంది మరియు బిడ్ల సమర్పణకు ఆఖరి తేదీ: 11.08.2026 ఉ.11:30గం.ల వరకు మరియు సమర్పణ సమయానికి ఒక గంట ముందు బిడ్ల విక్రయం ముగుస్తుంది. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్ : సిఎంసి

DIPR R.O. No. : 7126-PP/CL/ADVT/2026-27, Date: 01-08-2026

**చొప్పదండి మున్సిపాలిటీ**

సంక్షిప్త టెండర్ నోటీసు

(1) NIT నం. 01/MCC/ E1/2026-27, తేదీ: 01-08-2026
(2) MGF & 15వ ఆర్థిక సంఘం (Tied) గ్రాంట్ల కింద పనులు - పనుల సంఖ్య: 28, మొత్తం అంచనా విలువ: రూ. 65.50 లక్షలు.
(3) బిడ్లు సమర్పించడానికి చివరి తేదీ: 11-08-2026, సాయంత్రం 5:00 గంటలకు.
(4) బిడ్లు తెరిచే తేదీ: 12-08-2026, ఉదయం 11:00 గంటల నుండి.
(5) 15వ ఆర్థిక సంఘం (Untied) గ్రాంట్ కింద హైడ్రాలిక్ ఎక్స్కవేటర్ అద్దెకు తీసుకోవడం - పనుల సంఖ్య: 01, మొత్తం అంచనా విలువ: రూ. 5.00 లక్షలు.
(6) బిడ్లు సమర్పించడానికి చివరి తేదీ: 05-08-2026, సాయంత్రం 5:00 గంటలకు.
(7) బిడ్లు తెరిచే తేదీ: 06-08-2026, ఉదయం 11:00 గంటల నుండి.

మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన అధికారి పేరు & చిరునామా: కమిషనర్, చొప్పదండి మున్సిపాలిటీ, జిల్లా: కరీంనగర్, సంప్రదించవలసిన నంబర్: 9032538877; వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- కమిషనర్, చొప్పదండి మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 7159-PP/CL/ADVT/2026-27, Date: 01-08-2026

**సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, STSQM (HQ) CMC, 2వ అంతస్తు, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, NAC బిల్డింగ్, ఇజ్జత్ నగర్-500 084.

RFQ No. 03/SE/STSQM/CMC/2026-27 — Date: 01.08.2026

"ఫ్రంట్ బ్రష్ అమరిక, టిల్టింగ్ బ్రష్ & రెండు సక్షన్ హెడ్‌లతో కూడిన రెండు వైపు బ్రష్‌లు, నాన్ స్లీపర్ క్యాబిన్, సైడ్ PTO తో కూడిన 12T GVW LCV స్ప్రే లాన్స్, 10మీటర్ల హోస్‌తో కూడిన హై ప్రెషర్ వాటర్ పంప్ (20 LPM @ 40 Bar) ఎలక్ట్రికల్ రివర్స్ అలారం, సైడ్ వ్యూ మిర్రర్స్, రిఫ్లెక్టర్ స్ట్రిప్స్ & టూల్ బాక్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, ఇన్షియల్ కమిషనింగ్ స్పేర్స్'తో కూడిన 3.0 క్యూ.మీ. ట్రక్ మౌంటెడ్ రోడ్ స్వీపింగ్ మెషీన్" కొనుగోలు కోసం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (CMC) కొటేషన్లు కోరుతోంది. ఆ సక్తిగల సంస్థలు నిర్దేశించిన "కొటేషన్ కోసం అభ్యర్థన ఫారం" లోని కొరకు తమ పోటీ కొటేషన్లను సీల్డ్ కవర్ ద్వారా ఆఫీస్ ఆఫ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (STSQM), సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, 2nd ఫ్లోర్, NAC బిల్డింగ్, ఇజ్జత్ నగర్-500084 చిరునామాకు సమర్పించవలసిందిగా కోరడమైనది.

**RFQ షరతులు :**
1. చెల్లుబాటు అయ్యే GST రిజిస్ట్రేషన్, పాన్ కార్డు ఉన్న మ్యానుఫాక్చరర్ /సప్లయర్స్ /ఏజెన్సీలు మాత్రమే RFQను సమర్పించడానికి అర్హులు.
2. CMC ద్వారా టెండర్లను పిలవడం కోసం సంస్థలు వర్తించే అన్ని పన్నులతో సహా తమ పోటీ ధరలను సమర్పించాల్సి ఉంటుంది. ఉదహరించిన ధరలను ధృవీకరించిన తర్వాత, RFQను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కు CMCకి ఉంటుంది.
3. కొటేషన్లు 10.08.2026, ఉదయం 11:00 గంటల లోపు సమర్పించాలి.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ STSQM, CMC.

DIPR R.O. No. : 7153-PP/CL/ADVT/2026-27, Date: 01-08-2026

**చౌటుప్పల్ పురపాలక కార్యాలయం, యాదాద్రి భువనగిరి జిల్లా.**

నెం. E1/289/MCCPL/2026-27 — ఆసక్తి వ్యక్తీకరణ (EOI) — తేదీ: 01.08.2026

మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టే అన్ని రకాల పనులకోసం థర్డ్ పార్టీ నాణ్యతా ప్రమాణాల నియంత్రణల సంప్రదింపుల సేవలు అందించడానికి ఆసక్తిగల సంస్థల నుండి ప్రతిపాదనలను మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ఆహ్వానిస్తున్నారు.ఆసక్తిగల సంస్థలు అన్ని రకాల పనులను చేపట్టేందుకు తమ ఆర్థి ప్రతిపాదనలతోపాటు ఆసక్తి వ్యక్తీకరణను, అవసరమైన పత్రాలను పురపాలక సంఘం కమిషనర్‌కు తేదీ: 06.08.2026 సాయంత్రం 4.00 గంటల సమయానికి అందజేయవలసిందిగా కోరడమైనది.

**కన్సల్టెన్సీ సంస్థలకు ఉండాల్సిన అర్హతలు:**
ఎ. సంస్థ కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే రిజిస్ట్రేషన్ పొంది ఉండవలెను.
బి. కన్సల్టెన్సీ సంస్థ కనీసం 17 సంవత్సరాలుగా (పదిహేడు) ఉనికిలో ఉండి థర్డ్‌పార్టీ పనులకుగాను సంప్రదింపుల కర్తగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండాలి.
సి. సదరు కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వరంగంలో థర్డ్‌పార్టీ నాణ్యతా ప్రమాణాల నియంత్రణ సంప్రదింపులకర్తగా కనీసం పది సంవత్సరాలు (పది) అనుభవం కలిగి ఉండాలి.
డి. టెండరుదారుడు గడచిన ఐదు సంవత్సరాలకాలంలో లెక్కచూసినప్పుడు ఏదోఒక సంవత్సరంలో ఏడాదికి రూ.1.00 కోట్లు టర్నోవరు కలిగి ఉండాలి. టెండరుదారుడు చార్టర్డ్ ఎకౌంటెంటు ధృవీకరించిన ఆడిట్ ప్రతిని మాకు సమర్పించాలి.
ఇ. సదరు కన్సల్టెన్సీ సంస్థ ఒకే యు.ఎల్.బి. అంటే అర్బన్ లోకల్ బాడీలో ఒక టి.పి.క్యూ.సి ఏజన్సీగా రూ.100 కోట్ల పనులను (ప్రాజెక్టు/వర్కులు) నిర్వహించి ఉండాలి. సదరు సంస్థ సంబంధిత అనుభవంగల పత్రాలను సమర్పించాలి. ఈ పత్రాలను ధృవీకరించే అధికారి హోదా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్థాయికి తగ్గకూడదు. అంతకంటే తక్కువస్థాయివారు ఈ ధృవీకరణలు ఇవ్వకూడదు.
ఎఫ్. తెలంగాణ రాష్ట్రంలోని ఏ నగర పాలక సంస్థలోనైనా సదస్సు కన్సల్టెన్సీ సంస్థకు టి.పి.క్యూ.సి సేవలు అందించడంలో పది సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలి.సంబంధిత ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా మాకు సమర్పించాలి.
జి. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం నెం: 14436/E1/2012-1, తేదీ: 27.06.2012 ప్రకారం సదరు కన్సల్టెన్సీ సంస్థ ఐఎస్ఓ / బిఐఎస్ సర్టిఫికేషన్ కలిగి ఉండాలి. గడచిన పది సంవత్సరాలకు సంబంధించిన సర్టిఫికేషన్ ప్రతిని మాకు సమర్పించాలి.
హెచ్. సదరు సంస్థ ఎన్.ఎ.బి.ఎల్ (నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్)వారి గుర్తింపు పొంది ఉండాలి. ఈ గుర్తింపు గడచిన ఐదు సంవత్సరాలుగా ఉనికిలో ఉంటూ చెల్లుబాటైనదిగా ఉండాలి. (మరొక సంస్థతో ఉమ్మడిగా కలిసి కార్యక్రమాలు నిర్వహించినా,అనుసంధానంతో వ్యవహారాలు చేసినా సదరు గుర్తింపు అనుమతించబడదు)
ఐ. కన్సల్టెన్సీ సంస్థకు జి.ఎస్.టి. కోసం చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్ ఉండాలి.తాజా జి.ఎస్.టి రిజిస్ట్రేషన్ ప్రతిని మాకు సమర్పించాలి.
జె. సదరు కన్సల్టెన్సీ సంస్థకు వృత్తి పన్ను రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి.
కె. కన్సల్టెన్సీ సంస్థకు ప్రావిడెంట్ ఫండ్ పి.ఎఫ్&ఇ.ఎస్.ఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి.
ఎల్. టెండరుదారుడు తప్పనిసరిగా తన పాన్ కార్డును, సంస్థ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను మాకు సమర్పించాలి.
ఎం. టెండరుదారుడు తప్పనిసరిగా తన సొంత సంస్థకు సంబంధించిన అనుభవాన్ని కూడా తెలియజేసే పత్రాన్ని సమర్పించాలి.

సం/- కమిషనర్ చౌటుప్పల్ పురపాలక సంఘం

DIPR R.O. No. : 7172-PP/CL/ADVT/2026-27, Date: 01-08-2026

# వరద ముంపుపై అప్రమత్తంగా ఉండాలి



గోదావరి వరద శాంతించాలని ప్రత్యేక పూజలు

చీకుపల్లి, పెద్దగొల్లగూడెం డైవర్షన్ రోడ్డు పరిశీలించిన మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు/మంగపేట/వాజేడు: గోదావరి వరద ఉధృతి తగ్గి ప్రజలు క్షేమంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం వాజేడు మండలంలోని ముళ్లకట్ట..పూసూరు వంతెన వద్ద జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు, జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి వరద పరిస్థితులను పరిశీలించి గోదావరి తీరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చీకుపల్లి...పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుక వాగుపై భారీ వర్షాలకు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి వరద ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, బ్యాక్ వాటర్ ప్రభావంతో గ్రామాలు, కాలనీలు ముంపునకు గురయ్యే పరిస్థితి తలెత్తితే వెంటనే బాధిత కుటుంబాలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి మనన్ భట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్‌డిఓ కృష్ణవేణి, తహసీల్దారు, ఎంపిడిఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: సీతక్క** జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంగపేటలో గోదావరి వరద ప్రవాహాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వరద ముంపు ప్రాంతాల బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు.

**ఆపదలో అండగా మంత్రి సీతక్క**
**వరద బాధితులకు చేయూత**
**అగ్నిప్రమాద బాధితుడికి భరోసా**
**బొగత జలపాదంపై చెక్ డ్యామ్‌కు ప్రతిపాదన**

ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క, శనివారం ములుగు జిల్లా వాజేడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. గోదావరి వరద పరిస్థితులను స్వయంగా పరిశీలించి, ముంపు ప్రభావిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఫోటో గ్రాఫర్ చెన్నం రాజు కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ సహాయంపై భరోసా కల్పించారు. అలాగే ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ్ వర్మ (ప్రసాద్ బాబు రాజు) కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా మంత్రి సీతక్క ముళ్లకట్ట, పూసూరు వంతెన వద్ద జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి గోదావరి వరద పరిస్థితులను పరిశీలించారు. గోదావరి వరద ఉధృతి తగ్గి ప్రజలు క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చీకుపల్లి, పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇసుకవాగు డైవర్షన్ రోడ్డును పరిశీలించి, పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి బ్యాక్ వాటర్ ప్రభావంతో గ్రామాలు, కాలనీలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఏర్పడితే వెంటనే బాధితులను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. వరద పరిస్థితులపై నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తర్వాత దూలాపురం గ్రామంలో ముంపు ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ఏడు కుటుంబాలను పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. వాజేడు మండల కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన ఫోటోగ్రాఫర్ చెన్నం రాజు కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ తక్షణ సహాయంగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కృపాకర్, కాంగ్రెస్ నాయకులు మాజీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, జగన్ బాబు రాజు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి



ప్రజాపక్షం/తొర్రూరు: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తూరు గ్రామానికి చెందిన ఈదునూరి సమ్మయ్య(35) యువ రైతు రోజువారిగా తన వ్యవసాయ బోరు మోటర్ వద్దకు శుక్రవారం సాయంత్రం వెళ్లి మోటర్ పెట్టేందుకు ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి తొమ్మిది గంటలైనా తిరిగి రాకపోవడంతో పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు వ్యవసాయ పొలం దగ్గర వెళ్లి చూసే సరికి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెంది ఉన్నాడు. చిన్నవయస్సులోనే మృతి చెందడంతో భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

## బకాయిలు చెల్లించని మిల్లర్లపై ఆర్ఆర్ చట్టం ప్రకారం చర్యలు



ప్రజాపక్షం/హనుమకొండ : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు అప్పగించడంలో ఎలాంటి జాప్యం ఉండరాదని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి స్పష్టం చేశారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సీఎంఆర్ డెలివరీ మానిటరింగ్ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా 2025–26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీల పురోగతిని సమీక్షించారు.ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ, కేటాయించిన రైస్ మిల్లులను మానిటరింగ్ అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి, మిల్లులు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. మిల్లులు రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తున్నాయి, ఎంత పరిమాణంలో ధాన్యం మిల్లింగ్ చేస్తున్నాయి, ఇప్పటివరకు ఎంత మేర సీఎంఆర్ సిద్ధం చేసి ఎఫ్‌సీఐకి అందజేశాయనే వివరాలను ప్రతి రోజూ తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని మానిటరింగ్ అధికారులు, సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు.సీఎంఆర్ బకాయిలు అధికంగా ఉన్న రైస్ మిల్లర్లు ఎలాంటి జాప్యం లేకుండా పెండింగ్ డెలివరీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు ఒక్క ఏసీకే కూడా సమర్పించని రైస్ మిల్లర్లు వెంటనే మిల్లింగ్ కార్యకలాపాలు ప్రారంభించి, సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, ఎఫ్‌సీఐ ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ ప్రసన్న కుమార్, సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సీఎంఆర్ డెలివరీ మానిటరింగ్ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 314 మంది చిన్నారులకు విముక్తి: సిపి

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : ఆపరేషన్ ముస్కాన్ 12 ద్వారా 314 మంది చిన్నారులను పని నుండి విముక్తి కలిగించినట్లు వరంగల్ పోలీస్ కమీషనర్ ఎన్.శ్వేత,ఐపిఎస్ తెలిపారు. ఇందుకు సంబందించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ గత నెల జులై 1వ తారీకు నుండి నిన్నటి రోజు వరకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్12 కార్యక్రమం ద్వారా మొత్తం 314 మంది చిన్నారులను రక్షించబడ్డారని. ఇందులో 269 మంది బాలురు, 45 మంది బాలికలు ఉన్నారని. ఈ ఆపరేషన్ ముస్కాన్ 12 ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిబంధనల ప్రకారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ఇటుక బట్టిలలో, ప్రమాదకర ప్రాంతాల్లో వరంగల్ పోలీస్ కమిషనరెట్ పరిధి లోని (9) సబ్ డివిజన్ పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసి, ఆ టీమ్స్ కు ఇంచార్జిగా (9)ఎస్సై లను, (36) మంది సిబ్బందిని నియమించి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్ సిబ్బందితో పాటు వరంగల్ హనుమకొండ జనగాం జిల్లాలకు చెందిన బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, షేర్, స్కోప్,ఎఫ్ఎమ్ఎమ్,ఎస్ఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సహకారంతో బాల కార్మికులుగా మగ్గుతున్న 226 మందిని, బడి మానేసిన (డ్రాపౌట్స్) 85 మందిని, సురక్షితంగా ఆపరేషన్ ముస్కాన్ 12 టీం రక్షించి, వీరిని వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ముందు హాజరు పరిచి, పిల్లలకు, వారు తల్లి తండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించామని వీరిలో తెలంగాణేతర రాష్ట్రాలైన బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్ మరియు అస్సాం రాష్ట్రాలకు చెందిన 130 మంది చిన్నారులు కూడా ఉన్నారని కమీషనర్ వివరించారు. నిబంధనలను ఉల్లంఘించి చిన్నారులతో పని చేయిస్తున్న యజమానులపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 55 ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు చేసినట్లు, 92 ఐఆర్ (ఇన్స్ పెక్షన్)లు కార్మిక శాఖ అధికారులు చేత నమోదు చేపించామని, అలాగే వివిధ పోలీస్ స్టేషన్స్‌లోని జనరల్ డైరీస్‌లో 118 మంది పిల్లల వివరాలను నమోదు చేపించామని కమీషనర్ తెలిపినారు. పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లతో పాటు షేర్, స్కోప్, ఎఫ్ఎంఎం, ఎస్ఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థలు, చైల్డ్ లైన్ అధికారులు ఇట్టి కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది.

## రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



ప్రజాపక్షం/భూపాలపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా అరైవ్అలైవ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ తెలిపారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా పోలీసు శాఖ, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు,డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం,హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ఇతర ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చలాన్లు విధించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన 50 వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ప్రయాణాన్ని సురక్షితంగా మార్చడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్ ధరించాలని, సీటుబెల్ట్ వినియోగించాలని, నిర్ణీత వేగ పరిమితులను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిటిఓ శ్రీనివాస్, భూపాలపల్లి డిఎస్‌పి సంపత్ రావు, భూపాలపల్లి సిఐ నరేష్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పెద్ది స్వప్నను పరామర్శించిన వరంగల్ ఎంపి కావ్య



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మొన్న పరమపదించగా, శనివారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య నల్లబెల్లిలోని వారి స్వగృహానికి చేరుకుని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్నతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గడువులోపు పనులు పూర్తి చేయడమే మా లక్ష్యం

రూ.1.49 కోట్లతో 49వ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులకు

ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన



ప్రజాపక్షం/హనుమకొండటౌన్:వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 49వ డివిజన్ పరిధిలో సుమారు రూ.1.49 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, తాము కేవలం శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఏర్పాటు చేసే రాజకీయాలకు పరిమితం కాదని, ప్రతి పనిని నిర్దిష్ట గడువులో పూర్తి చేయించడమే తమ లక్ష్యమని అన్నారు. వారం, పది రోజులు లేదా నెల రోజులకు మించకుండా పనులను పూర్తి చేసేలా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే నాయిని,తాను ఎన్నికైన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నానని చెప్పారు. ప్రతి డివిజన్‌కు కోట్ల రూపాయల అభివృద్ధి నిధులను కేటాయించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు.ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి రుణపడి ఉన్నానని, ఆ రుణం తీర్చుకునేందుకు అంకితభావంతో పనిచేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సహకారం ఎంతో అవసరమని, సమస్యలు ఎదురైనప్పుడు రాజకీయాలకు అతీతంగా వాటి పరిష్కారానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు ఇచ్చే సలహాలు, సూచనలను స్వాగతిస్తూ వాటిని పరిగణనలోకి తీసుకుని మరింత మెరుగైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం: కలెక్టర్

ప్రజాపక్షం/భూపాలపల్లి : తల్లిపాలే పుట్టిన బిడ్డకు శ్రేష్టమైనదని, తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొదటి కానుక పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వడమేనని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా , శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహించనున్న ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం సుస్థిరమైన జీవితం ప్రారంభానికి తల్లిపాలు ఫలితాలను ఇచ్చే చర్యలను మరింత బలోపేతం చేయడం అనే థీమ్‌తో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతాయని, అలాగే వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పించి తల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖలసిబ్బంది పరస్పర సమన్వయంతో ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలు మరియు కుటుంబ సభ్యులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా॥ మధుసూదన్, శ్రీనివాస్, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ యోచన పాల్గొన్నారు.

## భయాందోళనలో సిగ్నల్ కాలనీవాసులు అయోమయంలో కొందరు ప్రైవేట్ పట్టాదారులు

అండగా నిలిచిన సిపిఐ, బిఆర్ఎస్, కాంగ్రెస్

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 26 25 వార్డు పరిధిలో ఆదివాకం సర్వేల వల్ల సిగ్నల్ కాలనీ వాసులకు ఇబ్బందులు కలుగుతాయని అలాగే కొంతమంది ప్రైవేట్ పట్టాదారులు తమ భూమి పోతుందని సిగ్నల్ కాలనీ వద్ద సర్వే చేస్తున్న అధికారుల దగ్గరికి సిగ్నల్ కాలనీ వాసులు వచ్చి మా భూమి పోకుండా మా ఇల్లు ధ్వంసం కాకుండా పారదర్శకంగా సర్వే చేసి న్యాయం చేసేయాలని కొంత భయాందోళన గురై అయోమయానికి గురయ్యారు. ఈ సందర్భంగా వారికి అండగా సిపిఐ, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నిలిచి వారికి మద్దతుగా వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న సిగ్నల్ కాలనీ వాసుల ఇండ్లు పోకుండా ,కొంతమంది ప్రైవేట్ పట్టాదారుల భూములు కూడా పోకుండా అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించి అందరికీ తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొంతమంది ఒక పార్టీకి సంబంధించిన వారు గూగుల్ మ్యాప్ తో ప్రభుత్వ భూమి ఉంటుందని జెండాలు పాతడం వల్ల ఈ సమస్య జటిలమైంది. ఒక వ్యక్తి తన స్థలం కోసం సర్వే పెట్టించడం ద్వారా అక్కడ ఉన్న పట్టాదారులందరూ మరియు ప్రజలు ఎవరి స్థలమైతే ఉన్నదో వారిదే సర్వే పారదర్శకంగా పెట్టి వారికి న్యాయం చేయాలని, ఎవరి ఇండ్లు, స్థలాలు పోకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా వారికి అండగా సిపిఐ కాంగ్రెస్, బిఆర్ఎస్ నిలిచాయి. ప్రభుత్వ సర్వే అధికారి ఏడిఏ శ్రీనివాసులు, శంకర్ లింగం, రాము, మహేష్ , సురేష్ పట్టాదారులు అచ్చ పాపయ్య, నీలం వెంకటేశ్వర్లు, చేపూరి నరేష్, గుండా నాగేశ్వర్ రావు, జెన్నాయికోడే శ్రీనివాస్, జైల్, పుష్ప, యాదమ్మ, సరిత, స్వరూప, రాము పాల్గొన్నారు

## పట్టుపరిశ్రమను లాభదాయకమైన అనుబంధ వ్యవసాయంగా చేపట్టాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/వరంగల్: రైతులు పట్టుపరిశ్రమను లాభదాయకమైన అనుబంధ వ్యవసాయ కార్యకలాపంగా చేపట్టి అధిక, స్థిరమైన ఆదాయాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పిలుపునిచ్చారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో మేరా రేషమ్ మేరా అభిమాన్2.0 కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ సమన్వయంతో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వాటాదారుల సంప్రదింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను విస్తృతంగా వినియోగించాలని, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఆయిల్ పామ్ తోటల్లో మల్బరీని అంతర పంటగా సాగు చేయడం, మల్బరీని సేంద్రీయ విధానంలో పండించడం, అంతర పంటలుగా పూల సాగు చేపట్టడం, భూగర్భ జలాల పరిరక్షణ కోసం వ్యవసాయ క్షేత్రాల్లో చెరువుల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పట్టు ఉత్పత్తులకు విలువ జోడింపు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలను మరింతగా వినియోగించుకోవడానికి వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ సౌకర్యాలు, జిల్లాలోని ఎగుమతి హబ్‌ను రైతులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు భువన (సైంటిస్ట్‌బి), డా. బి. తిరుపం రెడ్డి (సైంటిస్ట్‌సి) జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి బోర్డు అందిస్తున్న సాంకేతిక సహాయం, పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలపై వివరించారు. జాయింట్ డైరెక్టర్ అనుసూయ, అసిస్టెంట్ డైరెక్టర్ (సెరికల్చర్) తిరుపతి రెడ్డి, సెరికల్చర్ అధికారి మల్లయ్య రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ అవకాశాల గురించి వివరించారు. విజయవంతమైన పట్టురైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుని మరింత మందిని ఈ రంగం వైపు ఆకర్షించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తగ్గుముఖం పట్టిన గోదావరి

12.300మీ. నుండి 10.150మీ.

నీటిమట్టానికి తగ్గిన వరద ప్రవాహం

ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

ప్రజాపక్షం/కాళేశ్వరం: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద గోదావరి,ప్రాణహిత ఉభయనదులు తగ్గుముఖం పట్టి వరద ప్రవాహం కొనసాగుతోంది.కాళేశ్వరం పుష్కర ఘాట్ వద్ద శుక్రవారం ఉగ్ర రూపం దాల్చిన గోదావరి నీటి మట్టం 12.300మీటర్ల ఎత్తుకు చేరి మొదటి ప్రమాద హెచ్చరికను దాటి డేంజర్ స్థాయికి చేరువలో చేరుకున్నవరద నీరు ఆ తరువాత తిరిగి గోదావరి శాంతించి క్రమేపి తగ్గుముఖం పట్టింది.ప్రధాన పుష్కర ఘాట్ తీరం వద్ద గోదావరి శనివారం సాయంత్రానికల్లా 10.150 మీటర్ల నిటిమట్టానికి తగ్గి వరద ప్రవాహం కొనసాగుతుంది.త్రివేణి సంగమ తీరం వద్ద శుక్రవారం ఉధృత రూపం దాల్చిన ఉగ్ర గోదావరి కారణంగా అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం గోదావరి తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ... రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



ప్రజాపక్షం/వర్ధన్నపేట: వర్ధన్నపేట మండల కేంద్రంలోని కోనారెడ్డి చెరువును వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సందర్శించారు. చెరువు ఆయాకట్ట వరకు కట్టపై నడుచుకుంటూ పరిశీలించారు. కొనారెడ్డి చెరువులో ఉన్న జలాల వల్ల వర్ధన్నపేట పరిసరాల ప్రాంతాల్లోని రైతుల వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎల్ నీనో ప్రభావం ఉన్నప్పటికీ రైతులకు వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరలో ఈ చెరువు ద్వారా నీటిని విడుదల చేస్తామని అన్నారు. అధికారులు వెంటనే వ్యవసాయానికి సరిపడ సాగునీటిని విడుదల చేయాలని అదేశించారు.త్వరలో కాలువల ఇరువైల ఉన్న చెట్లను సంబంధిత శాఖ అధికారులతో సమన్వయంతో చేసుకొని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.చెరువును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని ఈ చెరువు పరిశీలనకు తీసుకువచ్చి మరింత అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు,ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థానం చైర్మెన్ ప్రభాకర్ గౌడ్,సొసైటీ చైర్మెన్ రాజేష్ ఖన్నా, మండల అధ్యక్షులు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, మాజీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, నియోజకవర్గ ముఖ్య నాయకులు,కౌన్సిలర్లు, సర్పంచులు, మండల, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్

ప్రజాపక్షం/జనగామ: ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడకల్ని ఘనంగా నిర్వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పిలుపునిచ్చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంలో పనిచేసి వేడుకల్ని విజయవంతం చేయాలన్నారు. శనివారం జిల్లా సమీకృత కార్యాలయ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డిసిపి రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్‌లో చేపట్టనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో నిర్వాహణకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల తరుపున స్టాల్స్‌న ఏర్పాటు చేయాలని, ప్రముకులు, పుర ప్రముఖులకు అతిధులకు స్వాతంత్ర దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలన్నారు.విద్యుత్ సరఫరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి నుండే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డిఓ గోపిరాం, కలెక్టరేట్ ఏఓ రవికిరణ్, సిపిఓ చిన్నకోట్యానాయక్, విద్యాశాఖ ఏడి శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేవరపల్లి హైవేకు గ్రీన్ సిగ్నల్

### నేడు లేదా రేపటి నుంచి వాహనాల ప్రయాణానికి అనుమతి
### వైరా, మధిర రోడ్డుకు తగ్గనున్న రద్దీ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం –దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేకు అధికార యంత్రాంగం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలోనే ఆగస్టు ఒకటి నుంచి వాహనాలకు అనుమతులు ఇవ్వనున్నట్లు అధికారులు ప్రకటించిన విషయం విధితమే. అరకొర పనులు మిగిలి ఉండడంతో ఈ నెల రెండు లేదా మూడవ తేదీ నుంచి వాహనాలకు పూర్తి స్థాయిలో అనుమతులు ఇవ్వనున్నట్లు నేషనల్ హైవే అథారిటీ అధికారులు తెలిపారు. గత మూడు నెలలుగా రాజమండ్రి నుంచి వైరా వరకు అధికారికంగానే హైవేపై ప్రయాణానికి అనుమతులు ఇచ్చారు. ఖమ్మంజిల్లా ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నుంచి చెన్నయ్, కోల్‌కత్తా జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ దేవరపల్లి వరకు 162 కిలో మీటర్ల రహదారిని నాలుగు వరుసల్లో నిర్మించారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.3,500 కోట్లు వెచ్చించి




నట్లు సమాచారం. దేవరపల్లి నుంచి వైరా వరకు నిర్మాణం ఐదారు నెలల కిందటే పూర్తయిన ఖమ్మం సమీపంలోని ధంసలాపురం వద్ద రైల్వే లైన్‌ను, మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో ఈ ఏడాది జనవరిలో ప్రారంభించాల్సిన రహదారి ఎనిమిది నెలల పాటు వాయిదా పడింది. ఇప్పుడు రైల్వే ప్లైఓవర్‌కు సంబంధించి ఒకవైపు పూర్తి కావడంతో వాహనాల ప్రయాణానికి అనుమతులు ఇచ్చారు. సూర్యాపేట, ఖమ్మం హైవే రోడ్డులో తల్లంపాడు వద్ద నుంచి నేరుగా దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ద్వారా రాజమండ్రి చేరుకోవచ్చు. కోదాడ రోడ్డు, బోనకల్ రోడ్డు, వైరా, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి వద్ద ఎగ్జిట్ పాయింట్లను ఏర్పాటు చేశారు. దీనితో పాటు నాగపూర్ అమరావతి రహదారి కలిసే కోదుమూరు ప్రాంతంలో కూడా ఎగ్జిట్ ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లే వారికి దూరం తగ్గడంతో పాటు త్వరితగతిన గమ్య స్థానం చేరుకునే అవకాశం ఉంది. గతంలో విజయవాడ మీదుగా విశాఖ, రాజమండ్రికి వెళ్లే వాహనాలు ఇప్పుడు దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ద్వారా ప్రయాణించే అవకాశం ఉంది. ఖమ్మం నగరానికి కూడా ట్రాఫిక్ బెడద తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా బైపాస్ రోడ్డులో వస్తున్న లారీలు, కార్లు, ఇతర వాహనాలు ఇప్పుడు నేరుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే ద్వారా ఖమ్మం నగరంలోకి రాకుండానే వెళ్లే అవకాశం ఉంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి కాంగ్రెస్, బిజెపిలు తమ ఘనత అంటే తమ ఘనత అని చెప్పుకుంటుండటం గమనార్హం.

## అర్హులైన ప్రతీ దివ్యాంగుడికి యుడిఐడి కార్డు

### కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం యుడిఐడి కార్డులు సకాలంలో అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం సెర్ప్ సిఇఒ దివ్య సదరం యుడిఐడి కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుండి కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. సదరం యుడిఐడి కార్డుల జారీ పురోగతి జిల్లాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌలిక వసతులపై సెర్ప్ సిఇఒ వీసి ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సదరం యుడిఐడి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం యుడిఐడి కార్డులు అందేలా క్షేత్ర స్థాయిలో చురుగ్గా పనిచేయాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన సదరం కేంద్రం వలన ప్రక్రియ మరింత క్రమబద్ధీకరించబడిందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్‌డిఒ శ్రీరామ్, సిపిఒ శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లాభాల ఆశ చూపి టోకరా

### కేరళంలో ఘరానా మోసగాడు అరెస్ట్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అధిక లాభాలు కాంట్రాక్టుల పేరుతో అమాయక పెట్టుబడి దారులను నమ్మించి సుమారు రూ.52 కోట్ల మేర మోసానికి పాల్పడిన భారీ పెట్టుబడి కుంభకోణాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నింధితుడైన దేవంపూడి భరత్ కుమార్‌ను కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో అరెస్టు చేసి అతని వద్ద నుండి నేరార్జిత ఆస్తులుగా గుర్తించిన 35 వాహనాలను, విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీ దేవిపల్లి మండలం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి ఆదినారాయణ నిందితున్ని ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం నిందితుడు తాను భద్రాచలం ఐటిసి పేపర్ మిల్లులో లేబర్ కాంట్రాక్టర్‌నని నమ్మబలికి, పెట్టుబడి దారులకు భారీ లాభాలు వస్తాయని ఆశ చూపుతూ పలువురి నుంచి సుమారు రూ.52కోట్లు సేకరించాడు. బాధితుల నుండి అందిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, ఇందులో భాగంగా నింధితున్ని కేరళా రాష్ట్రంలో అరెస్టు చేసినట్లు డిఎస్‌పి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని, బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 6న 'జాబ్‌మేళా'

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఐటిఐ, ఎటిసి విద్యార్థుల కోసం వంద శాతం అప్రెంటిస్‌షిప్, ప్లేస్‌మెంట్ జాబ్‌మేళాను ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ, ఎటిసి ప్రిన్సిపాల్ జి. సక్రు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటిఐ, ఎటిసి నందు ఈ జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశ్రమలు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్‌తో పా టు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఐటిఐ, ఎటిసిలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు సంబంధించి మరిన్ని వివరాల కోసం అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ జి. రవి సెల్ నెం. 9989637594ను సంప్రదించాలన్నారు.

## చిన్నారుల భద్రతే లక్ష్యం: సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** చిన్నారుల భద్రతే లక్ష్యంగా నెలరోజుల పాటు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతంగా ముగిసిందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో జులై 1నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 122 మంది చిన్నారులను రక్షించామన్నారు. వీరిలో 110 మంది బాలురు, 12మంది బాలికలు ఉన్నారన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా చేపట్టిన సోదాలలో మన రాష్ట్రానికి చెందిన 69 మంది చిన్నారులను రెస్క్యూ చేయగా ఇతర రాష్ట్రాలకు చెందిన 53 మంది చిన్నారులను గుర్తించామన్నారు. దీనిలో భాగంగా ఖమ్మం పోలీసు అధికారులతో పాటు కార్మికశాఖ, డిసిపియు, సిడబ్ల్యుసి, పలు స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పరిశ్రమలు, కంపెనీలు, హోటళ్లు, దుకాణాలు, నిర్మాణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో సోదాలు చేపట్టి కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులతో పాటు బిక్షటన చేస్తున్న, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న బాలలను గుర్తించి రక్షించామని పెర్కొన్నారు. వారి వివరాలను దర్పణ్ యాప్‌లో పొందపరిచినట్లు తెలిపారు. 53 కేసులు నమోదు చేసి 103 మందిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. ఎవరు లేని 19 మంది పిల్లలను బాలసంరక్షణ కేంద్రంలో ఉంచినట్లు తెలిపారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు సురక్షితంగా అప్పగించడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సిపి పేర్కొన్నారు. చిన్నారుల భద్రతే లక్ష్యంగా ఈనెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు.

## 'రెజొనెన్స్' స్కూల్‌లో మెహందీ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం విద్యావిభాగం:** శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ స్కూల్‌లో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మెహందీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సంప్రదాయ దుస్తుల్లో, కళాత్మకమైన గోరింటాకుతో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గోరింటాకు సాంస్కృతిక, ఔషధ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'స్మార్ట్‌కిడ్జ్'లో స్నేహితుల దినోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో స్నేహితుల దినోత్సవాన్ని ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తోటి మిత్రులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టి మిఠాయిలు తినిపించి స్నేహబంధాన్ని చాటిచెప్పారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ స్నేహబంధానికి సరిహద్దులు లేవని, వర్గ, ప్రాంతీయాలకు అతీతంగా స్నేహబంధం వెల్లివిరుస్తుందన్నారు. చిన్నప్పుడు ఏర్పడే స్నేహబంధం జీవితకాలం ఉంటుందన్నారు. పురాణాల కాలం నుంచి నేటి ఏఐ కాలం వరకు స్నేహబంధం విలువ పదిలంగా ఉందన్నారు. చిన్నారులకు స్నేహం యొక్క విలువను చాటిచెప్పేందుకు స్నేహితుల దినోత్సవ వేడుకను నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బురదమయమైన రోడ్లకు మరమ్మతులు

### చైర్‌పర్సన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని అంతర్గత రోడ్ల అభివృద్ధి, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో మరమ్మతులు జరుగుతున్న కూరగాయల మార్కెట్‌రోడ్డు, వాసవి కల్యాణ మండపం రోడ్డును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఇ శ్రీమాన్యకు పలు సూచనలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్లను ప్రాధాన్యత ఆధారంగా గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలోని అన్ని అంతర్గత రోడ్లను దశలవారీగా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రామచంద్రరావుకు సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో రోడ్లు బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి మరమ్మతు పనులు ప్రారంభించాలని ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### సెప్టెంబర్ ఒకటిన చలో ఢిల్లీ
### మహిళా సమాఖ్య జిల్లా కార్యదరి ఏపూరి లతాదేవి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ ఐడబ్ల్యూ అనుబంధం) జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి డిమాండ్ చేశారు. ఉచిత బస్సు తప్ప మహిళలకు ఇచ్చిన ఏ హామీని ప్రభుత్వం అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. తెలంగాణ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లతాదేవి మాట్లాడుతూ ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.2,500 జమ చేస్తామని, కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆడపిల్లలకు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని, ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. విద్యను అభ్యసిస్తున్న యువతులకు స్కూటీలు సైతం అందిస్తామని చెప్పారని కానీ హామీల అమలు దిశగా కాంగ్రెస్ పాలన సాగడం లేదని లతాదేవి తెలిపారు. మహిళలను లక్షాధికారులను చేస్తాం, కోటీశ్వరులను చేస్తామని చెబుతున్నారు తప్ప అది ఆచరణలో తద్ విరుద్ధ ఫలితాలు వస్తున్నాయని ఆమె తెలిపారు. వడ్డీ లేని రుణాలతో జరుగుతున్న అన్యాయాన్ని నిలువరించాలని ఆమె కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందని ముఖ్యంగా మహిళలను కించపరిచే రీతిలో బిజెపి అనుబంధ సంఘాల నాయ




కులు మాట్లాడుతున్నారని ఆమె తెలిపారు. అత్యాచార ఘటనకు సంబంధించి విశ్వ హిందూ పరిషత్ నాయకులపై కేసులు నమోదు చేయాలని మోహన్‌దాస్‌ను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సెప్టెంబర్ ఒకటిన జరిగే ప్రజా ఆందోళనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. మహిళా సమాఖ్య బలోపేతానికి కార్యాచరణ రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పోటు కళావతి, కార్యనిర్వహక అధ్యక్షురాలు సిహెచ్ సీతామహలక్ష్మి, సంఘ బాధ్యులు దండి శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లు కూల్చివేత రాజ్యాంగ విరుద్ధం

### డా॥ భీమ్‌రావ్ యశ్వంత్ అంబేద్కర్

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వెలుగుమట్ల ప్రాంతంలో ఇండ్లు కూల్చివేత రాజ్యాంగ విరుద్ధమని డా॥ బిఆర్ అంబేద్కర్ మనవడు డా॥ భీమ్‌రావ్ యశ్వంత్ అంబేద్కర్ తెలిపారు. శనివారం వెలుగుమట్ల భూ దాన్ భూముల్లో ఇండ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని జెఎసి ఆధ్వర్యంలో ఖమ్మంలో కె. కృష్ణారావు అధ్యక్షతన నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన అంబేద్కర్ మనవడు యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా భూదాన్ భూముల్లో నివాసం ఉంటున్న ప్రజల ఇండ్లను కూల్చడం అత్యంత అమానుషమని ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. స్థానిక ఎమ్మెల్యే దీనికి బాధ్యతవహించి రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే మిగిలిన బాధితులకు కూడా వెలుగుమట్లలోనే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. లేని ఎడల రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని తెలిపారు. రాష్ట్రపతిని కూడా కలిసి బాధితుల తరుపున న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు.



జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ వెలుగుమట్ల భూదాన్ విషయంలో నిజ నిర్ధారణ కమిటీ వేసి పరిశీలించగా కొందరు భూ బకాసురులు ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకే కుట్ర పన్ని కూల్చారన్నారు. సుప్రీంకోర్టుకు వెళ్లయినా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డా॥ విశారదన్ మహారాజ్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి రాష్ట్ర కార్యదర్శి పోడకంటి రాంబాబు, రాఘవేంద్ర, ప్రముఖ న్యాయవాది వంజాకుల లక్ష్మి నారాయణ, జెఎసి నాయకులు భూదాన్ బాధితులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 23, 24న ఎఐటియుసి ఖమ్మం 17వ మహాసభలు



**ప్రజాపక్షం/సత్తుపలి:** 23, 24 తేదీలలో సత్తుపల్లి పట్టణంలో నిర్వహించనున్న ఎఐటియుసి ఖమ్మం జిల్లా 17వ మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గంగారం, రామానగరం గ్రామాల్లో నిర్వహించిన తాపీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కార్మికులతో కలిసి మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు ఎఐటియుసి నిరంతరం పోరాడుతోందని అన్నారు. మహాసభల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించి కార్మికుల ఖాతాల్లో జమ చేసేలా కార్మిక శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే భవన నిర్మాణ రంగ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ జిల్లా నాయకులు తడికమళ్ల యోబు, కంచి శ్రీనివాసరావు, తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కనపర్తి మాల్యాద్రి, పలగాని శీను, రఘు, భవాని, గురవయ్య, జానయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వరావు, చిరంజీవి, పుల్లారావు పాల్గొన్నారు.

# నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన స్వామి గౌడ్

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/చింతకాని :** నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు దూసరి స్వామిగౌడ్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి నేరడ గ్రామంలో జరిగిన స్వామిగౌడ్ 24వ వర్ధంతి సభలో సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్ నుండి చింతకాని మండలం నేరడ గ్రామంలో స్వామిగౌడ్ అడుగు పెట్టిన రోజుల్లో అగ్రవర్ణాల చేతుల్లో నలిగిపోతున్న నిరుపేదలను చూసి చలించిపోయారన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆచరిస్తూ పెత్తందారులను ఎదిరించి వందల ఎకరాల బంజర భూములను పేదలకు పంచి పెట్టిన ఘనత స్వామిగౌడ్‌ది అన్నారు. నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు గ్రామంలో పాఠశాల నిర్మించి విద్యావకాశాలు కల్పించిన మహానుభావుడు స్వామిగౌడ్ అన్నారు. గ్రామసర్పంచ్‌గా ప్రజలకు ఎనలేని సేవలు అందిచారన్నారు. స్వామిగౌడ్ స్ఫూర్తితో నిరుపేదలకు అండగా వారి సమస్యల పరిష్కారం కోసం నేటికి వారి కుటుంబ సభ్యులు శ్రీరాములు, నేతాజీ, గోపాలరావులు పనిచేస్తున్నారన్నారు. నేడు సర్పంచ్‌గా నేతాజీ గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అనంతరం స్వామి గౌడ్ చిత్రపటానికి పూలమాల




వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పావులూరి మల్లిఖార్జునరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు దూసరి శ్రీరాములు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నేరడ గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ, ఉపసర్పంచ్ కోట బాలేష్, వ్యకాస మండల కార్యదర్శి గోగుల ఆది, శాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి, కాంగ్రెస్ నాయకులు మంకెన నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు మట్టా రవి, మహేష్, గూనుగుంట్ల వెంకన్న, వెంకటేష్, లింగరాజు, సతీష్, సైదా, గోగుల వెంకట్రావు, ప్రవీణ్, కోట వీరయ్య, ఆంతోని, నవీన్, బత్తుల కృష్ణ, పులిపాటి లక్ష్మి పతి, తదితరులు పాల్గొన్నారు.


## పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి ముప్పు: పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న గోదావరి వరద ఉధృతి సహజ పరిస్థితుల వల్ల మాత్రమే కాదని దిగువన ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావం కూడా ప్రధాన కారణమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా భద్రాచలం దాని పరిసర గ్రామాల్లో ముంపు సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని వరదలు వచ్చిన ప్రతిసారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యకు పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పోలవరం ముంపు సమస్యపై తాను మంత్రిగా బిఆర్ఎస్ పార్టీ తరుపున తొలి నుంచి పోరాటం చేశానన్నారు. భద్రాచలం ప్రాంత ప్రజల ప్రయోజనాల పరిరక్షణలో బిఆర్‌ఎస్ ఎప్పటికీ రాజీ పడదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వాలు దృష్టిసారించి పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై అధ్యయనం చేసి ముంపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

### డిఇఒ సదానందం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. సదానందం తెలిపారు. శనివారం మండల పరిధిలోని కోయచలక, రేగులచలక గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డిఇఒ సదానందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు బోధిస్తున్న ఇంగ్లీష్ పాఠ్యాంశాల తీరును, విద్యార్థుల ఇంగ్లీష్ అభ్యాసన నైపుణ్యాలను డిఇఒ పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో సమావేశమై పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి. రాములు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# సుషుప్తావస్థలో విద్యాశాఖ

### యథేచ్ఛగా అనుమతి లేని పాఠశాలల నిర్వహణ
### కండ్ల ముందే బస్సులు తిరుగుతున్నా స్పందించని అధికారులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** జిల్లా విద్యాశాఖ సూప్తావస్థలో ఉంది. ఈ జిల్లా విదాశాఖలో ఏమి జరుగుతుందో ఆ శాఖాధికారులకు పట్టడం లేదు. కనీసం వారు పట్టించుకోలేదు సరే చేసిన ఫిర్యాదుపై స్పందించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలే అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి అని అనుమతి లేని పాఠశాలలకు సంబంధించి ఫిర్యాదు చేసినా ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది. పలు మండల కేంద్రాల్లో విద్యాశాఖ నుంచి తీసుకోవాల్సిన కనీస అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇదేదో చాటుమాటుగా నిర్వహించే వ్యవహారం కాకపోయినా అధికారులకు తెలియడం లేదట. అనుమతి లేని పాఠశాల పేరుతోనూ, ఖమ్మం నగరంలో ఉన్న పాఠశాలల పేరుతోనూ బస్సులు నడుపుతున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు మండల, జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసి రెండు మాసాలు గడుస్తున్నా చర్యలు తీసుకోలేదు. ఖమ్మం నగరంతో పాటు పలు పట్టణాలలో ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలను నిర్వహిస్తున్నారు. పలుసార్లు జిల్లాలో జరిగిన సమీక్షా సమావేశంలో విద్యాశాఖకు సంబంధించి నియమ నిబంధనలు పాటించని పాఠశాలల అనుమతులు రద్దు చేయాలని మంత్రులు హెచ్చరించినా ఇంత వరకు ఒక్క పాఠశాల పైన చర్యలు




తీసుకోలేదు. కొన్ని పాఠశాలలు అనుమతులు లేకుండానే బ్రాంచీలను నిర్వహిస్తున్నారు. అయినా అధికారుల్లో ఉలుకు పలుకు లేదు. ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులకు సంబంధించిన తరగతులను కూడా బహుళ అంతస్తుల్లో ఎటువంటి రక్షణ చర్యలు లేకుండానే నిర్వహిస్తున్నారు. అయినా విద్యాశాఖాధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. బోధన సిబ్బందికి సంబంధించి కూడా అర్హత కలిగిన సిబ్బంది లేకుండానే తరగతులు నిర్వహిస్తూ అందిన మేర కొందరు పాఠశాలల యజమానులు దోచుకుంటున్నారు. ఇక ఫీజుపై నియంత్రణే లేదు. ఎల్‌కెజీకే వేల రూపాయలు వసూలు చేస్తున్నా పాఠశాలలు చాలా ఉన్నాయి. ప్రైవేటును పట్టించుకోలేదు. మామూళ్ల మత్తులో జోగుతున్నారనుకుంటే ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించిన దాఖలాలు లేవు. మరి విద్యాశాఖాధికారులు ఈ జిల్లాలో ఏమి చేస్తున్నారన్న ప్రజల ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి ఉంది. పరపతిని కోల్పోయి అబాసుపాలు అవుతున్న విద్యాశాఖను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వ విద్య బలోపేతంతో పాటు నియమ, నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## టౌన్ ప్లానింగ్ వ్యవహారంపై ఆర్‌డిడి విచారణ



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో వరంగల్ ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌డిడి) వందనం శనివారం మున్సిపల్ కార్యాలయంలో విస్తృత స్థాయిలో విచారణ చేపట్టారు. ఇంటి నిర్మాణ అనుమతుల పేరుతో డబ్బులు వసూలు చేశారంటూ పట్టణానికి చెందిన జంగుల లావణ్యతో పాటు పలువురు గృహ నిర్మాణదారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు చేసిన ఫిర్యాదులపై ఈ విచారణ జరిగినట్లు తెలిసింది.విచారణ సందర్భంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫైళ్లు, భవన నిర్మాణ అనుమతి దరఖాస్తులు, కార్యాలయ రికార్డులను ఆర్‌డిడి క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. సంబంధిత అధికారులు, సిబ్బందిని ప్రశ్నించి వివరణలు తీసుకోవడంతో పాటు ఫిర్యాదుదారుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు తెలిసింది.విచారణ అనంతరం సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు సమాచారం.

## రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలి :ప్యాక్స్‌చైర్మన్

**ప్రజాపక్షం / చొప్పదండి :** వర్షాకాల ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న ఎల్నినో ప్రభావాన్ని అధిగమించేందుకు రైతులు వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటలు చేపట్టి లబ్ధిపొందాలని చొప్పదండి ప్యాక్స్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ప్యాక్స్ కార్యాలయంలో రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురిసిన వర్షానికి రైతులు నాట్లు వేసుకుంటున్నారని కానీ ఈ వర్షపాతం పంటలకు సరిపోదని కావున రైతులు గమనించి వరి సాగు తక్కువగా చేసుకోవాలని తెలిపారు. వరి నాట్లు బదులుగా ఆరుతడి పంటులైన పప్పు దినుసుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారిని మమత, సిఇఒ తిరుపతి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్లు గుర్రం సుజిత్ రెడ్డి, గుర్రం రాజేందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మారు తిరుపతి రెడ్డి, కుర్ర రాజయ్య, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.1.70 కోట్ల నిధులు మంజూరుతో కాంగ్రెస్ సంబురాలు

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండల కేంద్రంలో అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.70 కోట్ల నిధులు మంజూరు చేయించినందుకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొడ్డు సునీల్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి రూ.1.70 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచుల ఫోరం అధ్యక్షులు కటకం తిరుపతి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించగా చిట్కూరి అనంతరెడ్డి, సర్పంచులు అరుకొంత గోపాల్ రెడ్డి, అంజిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు మాతంగి అనిల్, ఉదయ్ రెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, బుర్ర మల్లేశం గౌడ్, సంపత్, లింగంపల్లి శ్రీకాంత్, మంకాల అజయ్, వెదిరే విజేందర్, కవ్వంపల్లి మునీందర్, జీవన్, రేపాక బాబు, కూన చంద్రశేఖర్, నక్క దామోదర్, మల్లేశ్ గౌడ్, రమేశ్, వెదిరే చంద్రమౌళి, తిరుపతి, పాకాల పరశురాములు, ర్యాకం అనిల్, మామిడిపల్లి అంజయ్య, మంకాల రామ య్య, ఈగ రాజయ్య, శ్రీనివాస్, కుమ్మరి ఆనంద్, సాగర్, పాల్గొన్నారు.

## అభివృద్ధి,సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు



**ప్రజాపక్షం/సిద్దిపేట జిల్లా ప్రతినిధి:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి,సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలయ్యేలా చూడాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె హైమవతి అన్నారు. శనివారం ఐడిఒసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి,సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా కొన్ని పథకాలు,కొన్ని పథకాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయని,క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పారదర్శకంగా అమలుకు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యు లక్ష్మి కిరణ్,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ సర్టిఫికేట్లతో ప్రభుత్వ ఉద్యోగం పొందిన వ్యక్తి అరెస్ట్




**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు నకిలీ విద్యార్హత ధ్రువపత్రాన్ని ఉపయోగించి పైస్థాయి ప్రభుత్వ ఉద్యోగం పొందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. కొత్తపల్లి సిఐ కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల్ మండలం తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన నలిగేటి తిరుపతి విఆర్‌ఎగా పని చేశాడు. జగిత్యాల జిల్లా పెగడపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయానికి అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వహిస్తున్నాడు. నిందితుడు డిగ్రీ పూర్తి చేయకపోయినప్పటికీ భవిష్యత్‌లో ఉన్నత ప్రభుత్వ ఉద్యోగం పొందాలనే ఉద్దేశంతో తన భార్యకు చెందిన డిగ్రీ మెమోను ఆధారంగా చేసుకొని అందులో తన పేరు తండ్రి పేరు రోల్ నంబర్ తదితర వివరాలను మార్చి నకిలీ కలర్ జిరాక్స్ డిగ్రీ మెమో తయారు చేసుకున్నాడు. తదనంతరం ప్రభుత్వ విఆర్‌ఓ, విఆర్‌ఎ వ్యవస్థను రద్దు చేసి విద్యార్హతల ఆధారంగా ఉద్యోగాల కేటాయింపు చేపట్టిన సమయంలో అప్పటికే విఆర్‌ఎగా పని చేస్తున్న నిందితుడు నకిలీ డిగ్రీ మెమోను సమర్పించి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని పొందినట్లు విచారణలో తెలిసిందన్నారు. నిందితుడి వద్ద నుంచి నకిలీ డిగ్రీ కలర్ జిరాక్స్ మెమోతో పాటు నకిలీ ధృవపత్రం తయారీకి ఆధారంగా ఉపయోగించిన అతని భార్యకు చెందిన డిగ్రీ మెమో జిరాక్స్ ప్రతులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు లేదా ఇతర ప్రయోజనాల కోసం నకిలీ విద్యార్హత ధృవపత్రాలు, నకిలీ సర్టిఫికెట్లు లేదా తప్పుడు పత్రాలను ఉపయోగించేవారిపై చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తప్పవని సిఐ కోటేశ్వర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రజల భద్రతకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్





**ప్రజాపక్షం/ధర్మపురి/ ఎండపెల్లి :** ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ధర్మపురి మండలంలో దెబ్బ తిన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులను శనివారం రాష్ట్ర సా ంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అ ధికారులతో కలిసి పరిశీలించారు. రహదారి దెబ్బతిని తుమ్మెనాల నర్సయ్య పల్లె,ఆకుసాయి పల్లెనా గారం గ్రా మాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడిన విషయాన్ని తెలుసుకున్న మంత్రి ఆయా రహదారులను సం దర్శించారు.సంబందిత శాఖ అధికారులతో పరిస్థితిని స మీక్షించిన మంత్రి అడ్లూరి ప్రజలకు ఎలాంటి ఇబ్బందు లు కలగకుండా తక్షణమే తాత్కాలిక రాకపోకలకు ఏ ర్పాట్లు చేయాలని తెలిపారు. శాశ్వత మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ప్రజల భ ద్రతకుప్రభుత్వంతొలిప్రాధాన్యతనిస్తుందనిపేర్కొన్నారు.

### కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ధర్మపురి మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ శనివారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 10 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి అడ్లూరి పే ర్కొన్నారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్, నా యకులు చిలుముల లక్ష్మ ణ్, వేముల రాజేష్,రాందేని మొగిలి,సుముఖ్, లక్ష్మ ణ్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ రవీందర్ పాల్గొన్నారు.

### పెండింగ్ లో ఉన్న సాగునీటి పనులు పూర్తి

ధర్మపురి నియోజకవర్గ గోదావరి పక్కనే ఉన్నప్పటికీ గత ప్రభుత్వ కాలంలో రైతులకు అవసరమైన సాగునీటి పనులను పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆరోపించారు. శనివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభం పల్లి గ్రామంలోని చెరువును మంత్రి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ధర్మపురి నియోజకవర్గంలోని రైతుల అవసరాలకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని అన్నారు. నియోజకవర్గంలో కీలకమైన రోళ్ళ వాగు ప్రాజెక్టు అంచనాలు పెంచి ప్రాజెక్టు పూర్తి చేయకుండా వదిలేశారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గం లో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా రోళ్ళ వాగు ప్రాజెక్టు ని ర్మాణం పూర్తి చేస్తున్నామని అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేసి 2027 జనవరి 27 వరకు నీటిని ఎత్తిపోస్తామని మ ంత్రి హామీ ఇచ్చారు.స్తంభంపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేయడంతో పాటు స్థంభంపల్లి చెరువు మత్తడి మరమ్మత్తు, తుముల వెడల్పు మరమ్మతుకు రూ. 5 లక్షల కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.గొల్లపల్లి మండలంలోని యశ్వంతరావుపేట చెరువు పూడికతీత పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. మేడారం రిజర్వాయర్ నుండి ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాలకు సాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అన్నారు. బొమ్మరెడ్డిపల్లి కొత్తపల్లి వరకు కాల్వ పనులు పూర్తి చేస్తామని నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,అధికారులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య : కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం /రాయికల్ :** పాఠశాలలోని విద్యార్థులు ఉన్నత స్థాయి అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని, విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఉపాధ్యాయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం రాయికల్ మండలం ఉప్పుమడుగ గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థితిగతులను,వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాల తీరును పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.పాఠశాలలోని ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించాలని,సర్కారు బడుల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని,భావి తరాలకు అవసరమైన విద్యా బోధన చేయడం జరుగుతున్నదని తెలిపారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ జరిపి వారి బోధన స్థితిగతులను ప్రత్యేకంగా పరిశీలించారు. తరగతుల నిర్వహణ, పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అనే విషయాన్ని పిల్లలను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, భోజన తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించి ఆగష్టు 31 లోగా నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో డిఇఒకె. రాము, తహసీల్దార్ నాగార్జున,ఎంపిడిఒ చిరంజీవి,ప్రిన్సిపాల్,సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

## వైద్య సదుపాయాల విస్తరణకు కృషి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల నియోజకవర్గంలో వైద్య సదుపాయాల విస్తరణకు మరింత కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల పట్టణ మోతే రోడ్డు పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 80 మంది లబ్ధిదారులకు సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ 80.60 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూరాష్ట్రంలో అత్యధిక సిఎం సహాయ నిధి చెక్కులు జగిత్యాలకు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో జిల్లా నడిబొడ్డున ఉన్న ఏకైక మెడికల్ కళాశాల జగిత్యాల కళాశాల అని వివరించారు.జగిత్యాలలో డిప్లమా ఇన్ ఇసిజి, డయాలసిస్ ట్రైనింగ్ పారామెడికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.నర్సింగ్ కళాశాలతో స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉన్నారని వివరించారు. మాతా శిశు ఆసుపత్రి ప్రారంభం నాడు మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని, రాష్ట్రంలో ఏకైక ట్రామా సెంటర్ జగిత్యాలకు మొదటిది రానుందన్నారు.పాత బస్టాండ్ ఆసుపత్రిలో త్వరలో ట్రామా ,వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ బెడ్స్ పెంచామన్నారు.ట్రామా సెంటర్ ఏర్పాటుతో రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర చికిత్స అంది ప్రాణాపాయం తప్పుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజంగి నందయ్య, మార్కెట్‌కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి ఉన్నారు.

## భవన నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

### 'బిల్డ్ ఎక్స్‌పో' ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** భవన నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డిలు అన్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా కరీంనగర్ సెంటర్ ఆధ్వర్యంలో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన బిల్డ్ ఎక్స్‌పో 6వ ఎడిషన్‌ను శనివారం వారు ప్రారంభించారు. అనంతరం సేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లోని బిల్డింగ్ మెటీరియల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు నాణ్యమైన ఇంటి నిర్మాణ సామాగ్రి అందుబాటులో ఉండేలా ఎక్స్‌పోను రూపొందించారని తెలిపారు. విదేశాల్లో సివిల్ ఇంజనీర్ల లభ్యత కష్టంగా మారుతోందని హైదరాబాద్‌కు ధీ టుగా కరీంనగర్ అభివృద్ధి చెందుతుందని నగరాల సర్వతోముఖాభివృద్ధిలో నిర్మాణ రంగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపా రు. బిల్డర్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేసిన ఇంజనీర్లకు వారు శుభాకాంక్షలు తెలిపారు. వ ంద రూపాయల నుంచి కోటి రూపాయల విలువైన సామాగ్రి గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. వంద గజాల స్థలంలోనూ ఐదంతస్తుల భవనం ఎలా నిర్మాణం చే యాలో ఇంజనీర్లు మాత్రమే సూచనలు ఇ స్తారని అన్నారు. మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బిఆర్ఎస్ పార్టీ నగర అ ధ్యక్షుడు చల్ల హరిశంకర్ అసోసియేషన్ చైర్మన్ నల్ల లక్ష్మ య్య, సెక్రటరీ సబ్బని శ్రీ నివాస్, ట్రెజరర్ వేణుమాధవ్, కోఆర్డినేట్ ఇన్‌చార్జీ పాత పవనక్రిష్ణ, కోఆర్డినేటర్ జి. వెంకట కిషన్, అనిల్, ప్రశాంత్, పెద్ది ప్ర మోద్ ఫణి, అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అసోసి యేషన్ సభ్యులు, బిల్డర్స్ పాల్గొన్నారు.

## బట్టకాల్చి మీద వేస్తానంటే ఊరుకునే ప్రసక్తే లేదు

### మేయర్, డిప్యూటీ మేయర్లకు బండి సంజయ్ ఆదేశం

**ప్రజాపక్షం/కరీంనగర్/కొత్తపల్లి:** ''గత పదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, అరాచకాలతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను భ్రష్టు పట్టించిన నాయకులే మనకు అవినీతి మరకలు అంటించాలని చూస్తున్నారు. మనకు సంబంధం లేని విషయంలోనూ బట్ట కాల్చి మీదేస్తున్నారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన పనిలేదు. అట్లాంటి వాళ్లను ఉపేక్షించాల్సిన అవసరమే లేదు. వెంటనే లీగల్ నోటీసులు పంపండి. క్షమాపణ చెప్పకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకోండి'' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంగనర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులను ఆదేశించారు. యుఐడిఎఫ్ నిధులకు సంబంధించిన టెండర్ల వ్యవహారంలో తమకు ఏ మాత్రం సంబంధం లేదని, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని చెప్పారు. అయినప్పటికీ కొందరు బిఆర్ఎస్ నేతలు కావాలనే తమపై అవినీతి బురద చల్లాలని చూస్తున్నారని చెప్పారు. అట్లాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా శనివారం కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పందిస్తూ ''యుఐడిఎఫ్ నిధుల టెండర్ల వ్యవహారం మనకు ఏమాత్రం సంబంధం లేదు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది. ఆ టెండర్లో మనకు సంబంధమేంటి? కావాలనే బట్ట కాల్చి మీదేయాలనుకుంటున్నారు. ఇతరుల మీద కూడా అట్లాంటి బురద చల్లాలనుకుంటున్నారు. వాళ్లను ఉపేక్షించొద్దు. వెంటనే లీగల్ నోటీసులివ్వండి. క్షమాపణ చెప్పకపోతే న్యాయపరమైన చర్యలకు సిద్ధం కండి''అని సూచించారు.



### గ్రామాల అభివృద్ధికి కేంద్రం అధిక నిధులు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్దుంపూర్ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ రూ.10 నిధులతో నిర్మించిన మహిళా శక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని స్థానిక సర్పంచ్ మా దాసు సీతమ్మ, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అందుకోసం అధిక నిధులు కేటాయిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, ఉప సర్పంచ్ కూకట్ల రమేశ్, బిజెపి నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ ,సిసిలు అశోక్, రాజేశ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలల విద్యార్థులందరికీ తొలి జత యూనిఫాంలు

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తొలి జత పాఠశాల యూనిఫాంలను ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల యూనిఫాంల కుట్టింపు, పంపిణీ, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలపై సెర్ప్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తొలి జత యూనిఫాంలను ఈ నెల 15వ తేదీలోగా అందించేలా అన్ని చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని గురుకుల,రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు ఇప్పటికే యూనిఫాంల పంపిణీ పూర్తయిందని, నిర్ణీత గడువులో నాణ్యమైన యూనిఫాంలను అందించిన స్వయం సహాయక సంఘాల మహిళలను అభినందించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా ఎలాంటి జాప్యం లేకుండా యూనిఫాంలు అందించాలని సూచించారు. ఏ సంఘం కూడా నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ)గా మారకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి స్వయం సహాయక సంఘానికి రూ.15 లక్షలకు పైగా బ్యాంక్ లింకేజ్ రుణం లభించేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ సంఘం (వి.ఓ) పరిధిలో కనీసం రెండు ఫామ్‌పాండ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని, ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలి ఇంటిలో ఒక ఇంకుడు గుంత ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.భూగర్భ జలాల పెంపుకు ఇంకుడు గుంతలు, ఫామ్‌పాండ్ల నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళలకు వివరించాలని ఆదేశించారు .ఈ సమావేశంలో అదనపు డీఆర్‌డీఏ రవీందర్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్‌దుర్గాప్రసాద్,ఏపిఎంలు,సెర్ప్‌అధికారులు,పాల్గొన్నా రు.

## వరుస చోరీ కేసులను చేదించిన రామడుగు పోలీసులు

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని రామడుగు పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల వరుసగా రెండు దేవాలయాలలో జరిగిన చోరీ కేసులను రామడుగు పోలీసులు చేదించినట్లు రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా పోలస గ్రామానికి చెందిన ఎం.ఏ.అర్షద్ ఖాన్ ప్రస్తుతం కరీంనగర్ నగరంలోని సహెత్‌నగర్‌లో కూలీగా పని చేస్తూ నివాసం ఉంటున్నాడు. మూడు నెలల క్రితం వివాహం జరిగగా ఆర్థిక ఇబ్బందులతో దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుని వద్ద నుంచి మూడు వెండి కిరిటాలు, నాలుగు వెండి జంజీరాలు, సుమారు 1.5 గ్రాముల బంగారు పుస్తెలు, రూ.9500 నగదు, టిఎస్ 08ఈబి7037 వాహనం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గతంలో మల్లిఖార్జున జువెల్లరీ షాప్ నుంచి వెండి కిరీటం, 1 వెండి చంద్రవంక, 1 జత బంగారు పుస్తెలు 2.5 గ్రాములు దొంగతనం కేసులో నిందితుడు ఏం.ఏ అర్షద్ ఖాన్ సులభంగా డబ్బులు సంపాదించుటకు రాత్రి సమయంలో దేవాలయాల తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి విలువైన ఆభరణాలు, హుండీలలో ఉన్న నగదు దొంగిలించుటకు అలవాటు పడ్డాడు. అదే విధంగా గత నెల 27న రాత్రి వెదిర గ్రామంలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి నిందితుడు సుమారు 1 గ్రాము బంగారు పుస్తెలు, 14 గ్రాముల వెండి వస్తువులు హుండీలోని సుమార్ రూ.4500 నగదును అపహరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ విజయ్ కుమార్ పేర్కొన్నారు. కేసును తక్కువ సమయంలో చేధించిన రామడుగు ఎస్సై రాజు, సిబ్బందిని అభినందించారు.

## 'తహఫుజ్ ఖత్మే నబువ్వత్'ను బలోపేతం చేయండి

### ముస్లిం సమాజానికి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రస్తుత పరిస్థితుల్లో ఖాధియాని, షకిలియత్ వర్గాల నుంచి ముస్లిం సమాజాన్ని మేలుకొలుపి, వారి బారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఉమ్మతే మహమ్మదీయా (మహమ్మద్ ప్రవక్త సల్లం అనుచరులపై) ఉందని మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని మస్జిదే పర్వీన్ సుల్తాన నిర్వహించిన ఇస్ దౌర్ మే బాతిల్ ఫిత్నోంసే అప్నే ఈమాన్ కో కైసే బచాయే అనే అంశంపై నిర్వహించిన జల్సా ఆధ్యాత్మిక సదస్సు పెద్దఎత్తున విజయవంతం అయింది. ఈసందర్భంగా మౌలానా అర్షద్ అలీ ఖాస్మి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తను చిట్ట చివరి ప్రవక్తగా అంగీకరించ కుంటే ముస్లిం కాలేడని, విశ్వాసం ఈమాన్ నుండి బహిష్కృతులు అవుతారని చెప్పారు. ఇజ్రాయిల్, ఆంగ్లేయుల కనుసన్నల్లో భారత దేశంలో ఖాధియాని వర్గం పేరిట, షకిల్ వర్గం పేరిట కార్యకలాపాలను కొనసాగిస్తూ, ముస్లింల ముసుగులో, వేషధారణలతో అమాయక ముస్లింలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అలుపెరుగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింల, ఈమాన్, విశ్వాసాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని అభినందించారు. ఈసదస్సుకు ఉమ్మడి జిల్లా నుండి, నగర ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో మౌలాన వజీహొద్దీన్ లడ్డు, మౌలాన అబ్దుల్ మొయిజ్ షాంజి, మౌలాన ఇక్రామ్, మౌలాన ఇంతియాజ్ అసాధి,, ఖత్మే నబువ్వత్ కరీంనగర్ సేవకులు , జిల్లా కు చెందిన ఇస్లామీయ ధార్మిక పండితులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబ గద్వాల జిల్లా.

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహారము హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

ఫారం-6

ప్రాథమిక ప్రకటన

జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల ప్రొసీడింగ్ నెం. G/466/2026, తేదీ: 10.7.2026
ప్రత్యేక ఉపకలెక్టర్ (భూ.సే) జే.ఎల్.ఐ.పి, లేఖ నెం. E/46/2023 తేదీ: 08.7.2026
జిల్లా రాజపత్రం నెం.27/2026 తేదీ: 10.7.2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జోగులాంబగద్వాల జిల్లా, గట్టు మండలము, మాచర్ల గ్రామము పరిధి నందు ఈ క్రింది షెడ్యూలలో ఉదహరించిన ఎ.23.448 సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా ఎడమ ప్రధాన కాలువ నిమిత్తము జవహార్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా సేకరించవలసిన అవసరము ఉన్నదని జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టం 2016 (యాక్ట్ నెం.21/2017) సెక్షన్ 10ఎ క్రింద మినహాయింపు ఇచ్చియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్ట్‌కు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధములో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

షెడ్యూలు

| క్ర. సం. | సర్వే నెం. / ఎస్.డి. నెం. | పట్టా / ఇనాం etc., | భూవర్గీకరణ మెట్ట / తరి / బీడు | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు / చ.మీ. | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులుగల యితర వ్యక్తులు | సరిహద్దులు | | | | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉ | ద | తూ | ప | | | | |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 448 | పట్టా | మెట్ట | 1.616 | 1)బోయ అంజనమ్మ W/o ఓరుగు చిన్న తిమ్మప్ప<br>2)వరుగు నర్సప్ప S/o నాగ<br>3) వరుగు సరోజ W/o వర్గు కర్రెప్ప<br>4)బోయ జములమ్మ W/o రాముడు<br>5)M. కృష్ణ S/o M.హనుమంతప్ప<br>6) వరుగు చంద్రయ్య S/o వరుగు కిష్టప్ప<br>7)వరుగు నాగప్ప S/o వరుగు బజారి<br>8)ఈడ్డి నాగరాజు గౌడ్ S/O నర్సింహులు గౌడ్<br>9)M.కృష్ణ S/o M.హనుమంతప్ప<br>10) ఓరుగు అంజనమ్మ W/o ఓరుగు నాగప్ప<br>11)బూరుగు ఈరమ్మ W/o బోరుగు రాగప్ప<br>12) ఓరుగు సరస్వతమ్మ W/o ఓరుగు చంద్రయ్య<br>13)జంగియాటి మీనాక్షి W/o J. భీమేష్<br>14) వరుగు నర్సింహులు S/o వరుగు చంద్రయ్య<br>15) చాకలి రామకృష్ణ S/o తాయప్ప | - | - | - | - | | - | | |
| 2 | 449 | పట్టా | మెట్ట | 2.169 | 1) రాజేంద్రరావు S/o శ్రీనివాసరావు<br>2)కె. రాఘవేంద్రరావు S/o కె.శ్రీనివాసరావు<br>3)పల్నాడు పౌల్ట్రీ ఫామ్ లిమిటెడ్. చైర్మన్ మందపాటి విజయభాస్కర్ రెడ్డి | - | - | - | - | | - | | |
| 3 | 450 | పట్టా ఇనామ్ | మెట్ట | 0.405 | 1)బోయ జంగాటి శంకరమ్మ W/o శీలప్ప<br>2) కుర్వ పెద్ద ఈరన్న S/o చిన్న తాయప్ప<br>3) కుర్వ చిన్న ఈరన్న S/o తాయప్ప<br>4) కుర్వ బట్టలయ్య S/o మల్లయ్య | - | - | - | - | | - | | |
| 4 | 460 | పట్టా | మెట్ట | 4.364 | 1) Md.అలావుద్దీన్ S/o మోదీన్ స<br>2) నర్సన్న S/o బజరన్న<br>3)అలీ S/o హుసేని<br>4)ఖాజా S/o హుసేని<br>5) చిన్న రామన్న S/o హనుమంతు<br>6) శంషాద్ బేగం W/o Md. అలావుద్దీన్ | - | - | - | - | | - | | |
| 5 | 461 | పట్టా | మెట్ట | 1.654 | 1)Md.అలావుద్దీన్ S/o మోదీన్ స<br>2)అలీ S/O హుసేని<br>3)MD. వసీం పాషా S/o Md. అలావుద్దీన్<br>4) ఖాజా S/o హుసేని | - | - | - | - | | - | | |
| 6 | 462 | పట్టా | మెట్ట | 0.072 | 1) కొద్దెడ్డి తిప్పయ్య S/o కొడ్డెడ్డి నర్సప్ప<br>2)కె.సరస్వతి W/o జమ్మన్న<br>3)కొద్దెడ్డి బడేన్న S/o కొడ్డెడ్డి నర్సప్ప<br>4) వి.మధుసూధన్ గౌడ్ S/o నారాయణ గౌడ్<br>5)హరిజన్ ఆనంద్ S/o నాగప్ప<br>6)బుడ్డనరాయల సరోజ W/o బుడ్డనరాయల మల్లేష్<br>7) అంజనమ్మ W/o అర్జునప్ప<br>8)తిమ్మప్ప S/o శ్రీరాములు<br>9) నాగప్ప S/o ముకెన్న<br>10) మల్లేష్ S/o ముకెన్న<br>11)ఈడిగి నాగరాజు గౌడ్ S/o నర్సింహులు గౌడ్<br>12)పెద్ద హనుమంతు S/o ముకెన్న<br>13)H.నరేష్ S/o H.గోపాల్<br>14)కొద్దెడ్డి సుజాత W/o కొడ్డెడ్డి తిమ్మప్ప<br>15)కొద్దెడ్డి సోమయ్య S/o కొడ్డెడ్డి నర్సప్ప<br>16)ఈడ్డి నాగలక్ష్మి W/o వెంకటన్న గౌడ్ | - | - | - | - | | - | | |
| 7 | 463 | పట్టా | మెట్ట | 1.692 | 1) కుర్వ పెద్ద ఈరన్న S/o చిన్న తాయప్ప<br>2) కుర్వ చిన్న ఈరన్న S/o తాయప్ప | - | - | - | - | | - | | |
| 8 | 464 | పట్టా | మెట్ట | 0.082 | 1) నర్సన్న S/O లక్ష్మ య్య<br>2) కుర్వ వేములమ్మ W/o పెద్ద ఈరన్న<br>3) తిమ్మప్ప S/o లక్ష్మ య్య | - | - | - | - | | - | | |
| 9 | 468 | పట్టా | మెట్ట | 0.724 | 1)P.G.పెద్ద భీమన్న S/o గంగన్న<br>2)కుర్వ హేమలత W/o పెద్ద వీరన్న<br>3) హనుమంతు S/o హనుమయ్య<br>4) కుర్వే వేములమ్మ W/o పెద్ద ఈరన్న | - | - | - | - | | - | | |
| 10 | 469 | పట్టా | మెట్ట | 0.709 | 1)P. G. రవిబాబు S/o నేష చిన్న గంగప్ప<br>2)P.G.నాగరాజు S/O చిన్న గంగప్ప<br>3)P.G.చిన్న భీమన్న S/O నేష చిన్న గంగప్ప | - | - | - | - | | - | | |
| 11 | 470 | పట్టా | మెట్ట | 1.025 | 1) వర్గు తిమ్మప్ప S/o సవరన్న<br>2) వర్గు తాయప్ప S/o వర్గు సవరప్ప<br>3)సుజాత ఎదిగి W/o లేట్ ఎల్లా గౌడ్<br>4) నర్సింహులు S/o హుసేనప్ప | - | - | - | - | | - | | |
| 12 | 475 | పట్టా | మెట్ట | 0.627 | 1)బోయ సావిత్రమ్మ W/o బోయ తిమ్మప్ప<br>2)పింజరి చిన్న ఖాజాన్నా S/o రాజసాబ్<br>3) పెద్ద తిమ్మప్ప S/o తిమ్మయ్య<br>4)భీమేశ్వరి @పద్మ W/o బోయ నాగరాజు<br>5)కిస్తప్ప S/o తలారి కర్రెన్న<br>6)బోయ సంధ్య W/O బోయ రాముడు<br>7)బోయ తిమ్మప్ప S/o కిస్తప్ప<br>8) బి.తిమ్మప్ప S/o నర్సింహులు<br>9)కుర్వ లక్ష్మి W/o కుర్వ రాముడు<br>10)మైబు W/o పెద్ద ఖాజా<br>11)పింజరి రంజు బీ W/o పింజరి రాజాసాబ్<br>12)బోయ ఈదమ్మ W/o బోయ తిమ్మప్ప<br>13)పింజరి ఖాసిం S/o పెద్ద ఖాజా సబ్<br>14)పింజరి ఖాజమ్మ W/o పింజరి పెద్ద మౌలా | - | - | - | - | | - | | |
| 13 | 476 | పట్టా | మెట్ట | 2.135 | 1) కుర్వ గోకరమ్మ W/o పెద్ద రాముడు<br>2) కుర్వ శంకరమ్మ W/O కుర్వ కర్రెన్న<br>3) సుజాత W/o ప్రతాప్<br>4) కుర్వ రేవతమ్మ W/o కుర్వ కర్రెప్ప | - | - | - | - | | - | | |
| 14 | 477 | పట్టా | మెట్ట | 3.011 | 1) బి. రాధమ్మ W/o తిమ్మప్ప<br>2) బి. తిమ్మప్ప S/o నర్సింహులు<br>3)శ్రీ రాముడు S/o నర్సప్ప<br>4) రామలింగడు S/o నారప్ప<br>5) నర్సింహులు S/o బి. నర్సప్ప<br>6)చెన్నప్ప S/o నర్సప్ప | - | - | - | - | | - | | |
| 15 | 483 | పట్టా | మెట్ట | 1.479 | 1) ఎం. జ్యోతి, భార్య: ఎం. రామ్ ప్రసాద్ | - | - | - | - | | - | | |
| 16 | 484 | పట్టా | మెట్ట | 0.048 | 1) ప్రభుత్వ భూమి | - | - | - | - | | - | | |
| 17 | 487 | పట్టా | మెట్ట | 1.636 | 1)పరిగి రామి రెడ్డి S/o మునెప్ప<br>2)బి.భాగ్యమ్మ W/o పి.అంజి రెడ్డి<br>3)కుమ్మరి పద్మావతి W/o కుమ్మరి వెంకటస్వామి | - | - | - | - | | - | | |
| విస్తీర్ణము : 23.448 | | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా గారు, ప్రత్యేక ఉపకలెక్టర్, జె.ఎల్.ఐ.పి, గద్వాల మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికార మివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలో సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్ గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైనా లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టర్,జె.ఎల్.సి.పి, గద్వాల, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, గద్వాల

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జోగులాంబగద్వాల జిల్లా

సం/- కలెక్టర్ జోగులాంబగద్వాల జిల్లా

DIPR RO NO. 571/LA/PP/Advt/Pub/2026-27


# వాణిజ్య సిలిండర్ ధర రూ. 192 తగ్గింపు

## ఎటిఎఫ్ ధర లీటర్‌కు రూ. 5 పెంపు



**న్యూఢిల్లీ :** హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య సంస్థలు ఉపయోగించే వంట గ్యాస్ ధర తగ్గింది. 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్‌పై రూ. 192 తగ్గిస్తున్నట్లు శనివారం చమురు సంస్థలు ప్రకటించాయి. అయితే అంతర్జాతీయ ధరల పోకడలకు అనుగుణంగా ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (ఎటిఎఫ్) ధరను లీటరుకు రూ. 5 పెంచారు. ఫిబ్రవరిలో పశ్చిమాసియా ఘర్షణలు ప్రారంభం కావడంతో సరఫరా అంతరాయాల వల్ల ఇంధన ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వం ధరలను కాస్త తగ్గిస్తూ వస్తుంది. జులైలో 19 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధరలను రూ. 183 తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి తగ్గింది. అయితే ఎటిఎఫ్ ధర మాత్రం తాజాగా పెరిగింది. పభుత్వ రంగ చమురు సంస్థల సమాచారం ప్రకారం తాజాగా వాణిజ్య సిలండర్ ధర తగ్గడంతో ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ ధర గతంలో రూ. 2,930 ఉండగా, ఇప్పుడు రూ. 2,738కి తగ్గింది. అదే సమయంలో, ఎటిఎఫ్ ధర లీటరుకు రూ. 110 నుండి రూ. 115కి పెరిగింది. కోల్‌కతా 19 కిలోల గ్యాస్ బండ రూ. 2,872.50 ఉండగా, హైదరాబాద్‌లో రూ. 2,985కి దిగొచ్చింది. జూన్ నెలలో పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ధరలు రికార్డు స్థాయికి చేరిన తర్వాత, జులై 1, ఆగస్టు 1 తేదీలలో కమర్షియల్ ఎల్‌పిజి ధరలలో ఈ రెండు తగ్గింపులు జరిగాయి. ఫిబ్రవరి చివరలో సంఘర్షణ మొదలైన తర్వాత, కమర్షియల్ ఎల్‌పిజి ధరలు 19 కిలోల సిలిండర్‌పై భారీగా రూ. 1,373 పెరిగాయి (ఫిబ్రవరిలో రూ. 1,740.50 నుండి జూన్‌లో రూ. 3,113.50కి). దీనితో పాటు, మార్కెట్ ధర కలిగిన 5 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ. 808.50 నుండి రూ. 762కి తగ్గించారు. అంతర్జాతీయ ధరలు, విదేశీ మారకం రేట్ల ఆధారంగా ప్రతి నెలా మొదటి తేదీన సవరించబడే ఈ ధరలు, వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా రాష్ట్రాల వారీగా మారుతూ ఉంటాయి. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ ఎల్‌పిజి (14.2 కిలోల సిలిండర్) ధర రూ. 942 వద్ద యథాతథంగా ఉంది. డొమెస్టిక్ ఎల్‌పిజి ధరలను చివరిసారిగా జూన్ 7న 14.2 కిలోల సిలిండర్‌పై రూ. 29 మేర పెంచారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల సరఫరాలో అంతరాయాలు, అంతర్జాతీయ ఇంధన ధరల పెరుగుదల కారణంగా మార్చిలో ధరలు రూ. 60 మేర పెరిగాయి. దేశంలోనే అతిపెద్ద చమురు సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ ఎ.ఎస్. సాహ్నీ శుక్రవారం మాట్లాడుతూ, డొమెస్టిక్ ఎల్‌పిజి (14.2 కిలోల సిలిండర్) ధరలు వాస్తవ వ్యయం కంటే చాలా తక్కువగా ఉండటం వల్ల సిలిండర్‌కు రూ. 503 చొప్పున నష్టం వాటిల్లుతోందని తెలిపారు. మే నెలలో లీటరుకు సుమారు రూ. 7.50 చొప్పున పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలలో కూడా ఎటువంటి మార్పు లేదు.

# రూ. 2 లక్షల కోట్లు దాటిన జిఎస్‌టి వసూళ్లు

## జులైలో 15.4 శాతం పెరుగుదల




**న్యూఢిల్లీ :** దేశీయ లావాదేవీలు సహా దిగుమతుల ద్వారా పన్ను వసూళ్లు పెరగడంతో జులైలో స్థూల జిఎస్‌టి వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది జులైతో పోలిస్తే ఈ వసూళ్లు 15.4శాతం ఎక్కువని కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. సిజిఎస్‌టి రూ.39,835 కోట్లు, ఎస్‌జిఎస్‌టి రూ.47,881 కోట్లు, ఐజిఎస్‌టి వసూళ్లు రూ.1,23,000 కోట్లుగా ఉన్నాయి. గతనెలలో రిఫండ్లు 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లకు చేరుకున్నాయి. రిఫండ్లను మినహాయించిన అనంతరం నికర జిఎస్‌టి ఆదాయం 1.81 లక్షల కోట్లుగా ఉంది. జులై నెలలో జిఎస్‌టి కింద నమోదైన ఆదాయం సిజిఎస్‌టి రూ.39,835 కోట్లు ఉండగా, రాష్ట్ర వస్తు, సేవల పన్ను ఎస్‌జిఎస్‌టి రూ.47,881 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజిఎస్‌టి వసూళ్లు రూ.1.23 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. అయితే, ఈ గణాంకాలు దేశవ్యాప్తంగా వ్యాపార కార్యకలాపాలు, అంతర్రాష్ట్ర వాణిజ్యం, దిగుమతుల ద్వారా పన్ను వసూళ్లు మెరుగుపడుతున్నాయని నిపుణలు అభిప్రాయపడుతున్నారు. అయితే, జులై నెలలో పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం మొత్తం రూ.29,968 కోట్ల రిఫండ్‌లు జారీ చేసింది. ఇది గత ఏడాది జులైతో పోలిస్తే 13.1 శాతం అధికం. అలాగే, రిఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత ప్రభుత్వానికి లభించిన నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లకు పైగా ఉంది. అసెస్‌మెంట్ ఇయర్ 2026–27కు సంబంధించి ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు కూడా భారీ స్థాయిలో నమోదయ్యాయి. జులై 31 నాటికి 5.9 కోట్లకు పైగా ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది.

## విద్యార్థుల నిరసనలపై క్రూరత్వానికి

# మోదీ క్షమాపణ చెప్పాలి

- బాధితుడి పాత్ర పోషిస్తూ ఆనందం పొందుతున్నారు
- రాజకీయ ప్రత్యర్థులపై ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారు
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మండిపాటు



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. తనను దూషించిన యువకులను క్షమించానని చెబుతూ నరేంద్ర మోదీ బాధితుడికి పాత్ర పోషించడంలో ఆనందం పొందుతున్నారని పేర్కొంది. విద్యార్థి నిరసనకారుల పట్ల క్రూరంగా వ్యవహరించడం, పేపర్ లీక్‌ల కారణంగా వారు అనుభవించిన మానసిక క్షోభకు ప్రధానమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ప్రధాన మంత్రి ఇన్‌స్టాగ్రామ్ సభలు తీవ్రమైన ఆత్మవ్యామోహానికి నిదర్శనమని, అవి ఎవరినీ మోసం చేయలేవని కూడా ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. 'శుక్రవారం అర్ధరాత్రి తన స్వార్థాన్ని ప్రదర్శిస్తూ, ప్రధానమంత్రి మన యువతను క్షమించానని అన్నారు. ఇది దేశానికి, ఆయన ప్రభుత్వ హయాంలో బాధపడి, ఆయన నుండి క్షమాపణను న్యాయబద్ధంగా డిమాండ్ చేస్తున్న మన యువతకు అవమానం. ప్రధాన మంత్రి ఇన్‌స్టాగ్రామ్ సభలు ఎవరినీ మోసం చేయలేవు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేమ్ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో, జంతర్ మంతర్ వద్ద తన దివంగత తల్లి కూడా అసభ్యకరమైన దూషణలకు గురయ్యారని తెలిసి తనకు బాధ కలిగిందని మోదీ అన్నారు. మన కుమార్తెలు అలాంటి భాషను ఉపయోగించారని విచారం వ్యక్తం చేస్తూనే, దారితప్పిన పిల్లలను క్షమించాలని ఆయన పిలుపునిచ్చారు. దానిపై జైరామ్ రమేశ్ స్పందిస్తూ తాను జీవసంబంధం లేని ప్రధానమంత్రి అని చెప్పుకునే ఆయన, బాధితుడి పాత్రను పోషించడంలో ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. మోదీ తన పూర్వ ప్రధానులు, రాజకీయ ప్రత్యర్థులపై నీచమైన ద్వేషాన్ని ప్రయోగిస్తారని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'వారిని అప్రతిష్టపాలు చేయడానికి ఆయన తన బహిరంగ ప్రసంగాలలోనే కాకుండా పార్లమెంటులోనే తరచుగా అబద్ధాలను ప్రచారం చేస్తారు. పార్లమెంటులోనూ, బయట కూడా ఆయన దుర్భాషలాడే దూషకుల సైన్యాన్ని రంగంలోకి దించి, వారికి పూర్తి రక్షణ కల్పిస్తారు. పేపర్ లీక్‌లతో నిండిన ఎన్‌టిఎ ద్వారా, విద్యార్థి నిరసనకారులపై హోం మంత్రిత్వ శాఖ ఆమోదంతో ఆయన చూపిన క్రూరత్వం ద్వారా లక్షలాది మంది యువతకు కలిగించిన మానసిక క్షోభకు ప్రధాని క్షమాపణ చెప్పాలని యావత్ దేశం కోరుకుంటోంది. 2020 ఫిబ్రవరి 5న లోక్‌సభలో ప్రధాని అట్టహాసంగా ప్రకటించిన రామ మందిర్ ట్రస్ట్ చేసిన 'చందా చోరీ అస్తా ధోకా'కు ఆయన క్షమాపణ చెప్పాలని యావత్ దేశం ఎదురుచూస్తోంది. కోట్లాది మంది జీవనోపాధులను నాశనం చేసి, లక్షలాది ఎంఎస్‌ఎంఇలను మూతపరిచిన 2016 నవంబర్ 8 నాటి ఆయన తుగ్లక్ తరహా నోట్ల రద్దుకు కూడా దేశం ఆయన క్షమాపణను ఇప్పటికీ ఆశిస్తోంది. ఈ జాబితాకు అంతులేదు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

# ఇ–20, శుద్ధ పెట్రోల్ ఎంచుకునే అవకాశమివ్వాలి

## ఈనెల 4న ప్రధాని నివాసం వద్దకు పాదయాత్ర

## ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** పెట్రోల్ బంకుల వద్ద శుద్ధ పెట్రోల్, ఇ–20లలో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రాలు సమర్పించేందుకు ఆగస్టు 4న ప్రధానమంత్రి నివాసం వరకు పాదయాత్ర చేయనున్నట్లు శనివారం ఆయన ప్రకటించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఇ–20 ఇంధనంపై జరిగిన టౌన్ హాల్ తరహా సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, సోమవారం మధ్యాహ్నం వినతిపత్రాలు సేకరించి, సుమారు 100 మందితో కలిసి లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని నరేంద్ర మోదీ నివాసం వరకు పాదయాత్రకు నాయకత్వం వహిస్తానని తెలిపారు. పెట్రోల్ స్టేషన్లలో ఇ–20, సాధారణ పెట్రోల్‌లలో ఒకదాన్ని ఎంచుకునే అవకాశాన్ని వినియోగదారులకు కల్పించాలని, ఇ–20 మిశ్రమ పెట్రోల్ ధరలను తగ్గించాలని, పెట్రోల్ ధరలను కూడా తగ్గించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇ–20 వాహనాలకు నష్టం కలిగించదని చెప్పడానికి ప్రభుత్వం ఉదహరించిన నివేదికను బహిరంగపరచాలని కూడా మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రభుత్వాన్ని కోరారు. అధ్యయనాలు జరిగాయని, ఇ–20 వాహనాలకు హాని కలిగించదని కేంద్రం చెబుతోందని, మరి ఆ నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. వివిధ రాష్ట్రాల నుండి ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై, ఇ–20 వినియోగంపై తమ అనుభవాలను, ఆందోళనలను, తమ వాహనాలతో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పంచుకున్నారు.

# కేరళలో భారీ వర్షాలు, వరదలు

- ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో విరిగిపడిన కొండచరియలు
- నలురుగు మృతి, శిథిలాల నుంచి మరికొంత మందిని రక్షించిన దళాలు



**ఇడుక్కి/కొట్టాయం :** కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదలు పోటెత్తాయి. మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. శనివారం ఇడుక్కి, కొట్టాయంలో కొండచరియలు విరిగిపడడంతో నలుగురు మృత్యువాత పడ్డారు. శిథిలాల్లో చిక్కుకున్న అనేక మందిని రక్షించినట్లు అధికారులు చెప్పారు. మరణించిన వారిలో ఇడుక్కి జిల్లాలోని కుడయత్తూర్ సమీపంలోని అదూర్మల ప్రాంతానికి చెందిన సుమతి (65) ఒకరుగా గుర్తించారు. శనివారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో శిథిలాలు ఆమె ఇంటిని ఢీకొట్టాయని జిల్లా యంత్రాంగం పేర్కొంది. స్థానికులు ఆమె భర్త రవిని, వారి కుమారుడు రతీష్‌ను రక్షించగలిగారు. వారిద్దరికీ గాయాలు కావడంతో తోడుపుజలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో ఆ కుటుంబం ఇల్లు ధ్వంసమైందని అధికారులు తెలిపారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్), అగ్నిమాపక, రక్షణ దళం, పోలీసులు, రెవెన్యూ అధికారుల బృందం చేపట్టిన గాలింపు చర్యల అనంతరం సుమతి మృతదేహాన్ని వెలికితీశారు.

కొట్టాయం జిల్లా పూంజార్‌లోని పయ్యనితోటంలో జరిగిన కొండచరియల విరిగిపడే ఘటనలో ఒక యువకుడు మరణించగా, అతని తల్లి శిథిలాల కింద చిక్కుకుపోయారు. మరణించిన వారిని జానీ కుమారుడు జోసెఫిన్ (24), అతని తల్లి రెజీనా జానీ (46)గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. జోసెఫిన్‌ను రక్షించినప్పటికీ, ఆసుపత్రికి తరలిస్తుండగా అతను గాయాల కారణంగా మరణించాడు. ఉదయం 10:30 గంటల ప్రాంతంలో రెజీనా మృతదేహాన్ని వెలికితీశారు. మరొక ఘటనలో, ఇడుక్కి జిల్లాలోని వాగమన్ ప్రాంతంలో ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ప్రభాకరన్ నాయర్ (77) అనే వ్యక్తి మరణించారు. కొట్టాయం జిల్లా వైకోమ్‌కు చెందిన నాయర్, కొండచరియలు విరిగిపడిన సమయంలో తన బంధువుల ఇంటిలోని ఒక పడకగదిలో నిద్రిస్తున్నారని అధికారులు తెలిపారు. గంటల తరబడి సాగిన గాలింపు చర్యల తర్వాత ఆయన మృతదేహాన్ని వెలికితీశారు. ఇడుక్కి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, వరదలు సంభవించినట్లు సమాచారం అందింది.

పుల్లకాయర్ నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో కొక్కయార్ లోలెవల్ క్రాసింగ్ (చప్పత్) నీట మునిగింది. చుట్టుపక్కల ప్రాంతంలో సుమారు ఆరు ఇళ్లు నీట మునిగిపోగా, ప్రభావిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది. కొట్టప్పన, వజవార మధ్య రోడ్డుపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే వండిపెరియార్‌లోని చోట్టుపర వాగులో నీటి మట్టం పెరగడంతో జాతీయ రహదారి 183పై నీరు నిలిచిపోయింది. మధ్య కేరళతో పాటు, కొల్లం జిల్లాలోని కొండ ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిసినట్లు సమాచారం. అలాగే, కోజికోడ్, మలప్పురం, కన్నూర్, పాలక్కాడ జిల్లాల్లో వరదలు, చిన్నపాటి కొండచరియలు విరిగిపడిన ఘటనలు నమోదయ్యాయి. భారీ వర్షాల కారణంగా నదీ జలాలు పొంగిపొర్లి రావడంతో కోజికోడ్‌లోని ఎంగాపుజ పట్టణం పూర్తిగా నీట మునిగింది. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున వయనాడ్ ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్‌ను నియంత్రించారు. మలప్పురంలో నీటి గుంటలో పడి నాలుగేళ్ల చిన్నారి మరణించింది. కేరళలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### కిశ్త్‌వాడ్‌లో క్లౌడ్‌బరస్ట్..

జమ్ముకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్‌లో శనివారం తెల్లవారుజామున మేఘ విస్ఫోటం సంభవించింది. ఆకస్మిక వరదలతో రోడ్లు బురదమయమయ్యాయి. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడడంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కిశ్త్‌వాడ్, దోడా, రాంబన్ జిల్లాల్లో నదులు పొంగుతుండడంతో పలు వాహనాలు కొట్టుకుపోయాయి. ఈ మూడు జిల్లాలలోని పాఠశాలలను మూసివేసి.. ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నష్టపరిహారం అందిస్తామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రకటించారు. వారం రోజుల పాటు పూంఛ్, కిశ్త్‌వాడ్, జమ్ము, రాంబాన్, ఉధంపుర్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొండచరియల ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. కిశ్త్‌వాడ్, మచైల్ ప్రాంతాల్లో కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు.

## భారత విదేశాంగ విధానం బలోపేతంలో

# దోవల్ కీలకపాత్ర

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా జాతీయ భద్రత సలహాదారుకు లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం ప్రదానం




**న్యూఢిల్లీ :** భారత విదేశాంగ విధానాన్ని బలోపేతం చేయడంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్ కీలక పాత్ర పోషించారని, జాతీయ భద్రత కోసం ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయం వెనుక ఆయన పాత్ర, సలహాలు ఉన్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం అన్నారు. ఢిల్లీలో ఎన్ఎస్ఎ దోవల్‌కు 'లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం2026'ను ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని తిలక్ స్మారక్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది. పురస్కారం అనంతరం జరిగిన కార్యక్రమంలో షా ప్రసంగించారు. తిలక్ ఆశించిన సాంస్కృతిక జాతీయవాద మార్గంలో భారత్ పయనిస్తోందని, ఆ మార్గం నుండి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని షా స్పష్టం చేశారు. 2014లో బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ తీసుకున్న మొదటి నిర్ణయం అజిత్ దోవల్‌ను ఎన్ఎస్ఎగా నియమించడమేనని షా పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరోలో దోవల్ సుదీర్ఘ సేవా కాలాన్ని ఆయన కొనియాడారు. ఇంటెలిజెన్స్ కార్యకలాపాల స్వభావం దృష్ట్యా దోవల్ చేసిన పనులలో చాలా వరకు ఎప్పటికీ పూర్తిగా బయటపెట్టలేమని షా చెప్పారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం భారత సాయుధ దళాల రక్షణ, దాడి సామర్థ్యాలను సమూలంగా మార్చివేసిందని, ఇందులో దోవల్ గణనీయమైన కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. తిలక్ అందించిన అసమానమైన సేవలను ఆయన కొనియాడారు. **దేశ ప్రయోజనాలకోసం యువత అంకితమవ్వాలి : దోవల్** వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా నిలిచి, దేశ ప్రయోజనాల కోసం తమను తాము పూర్తిగా అంకితం చేసుకోవాలని అజిత్ దోవల్ దేశ యువతకు పిలుపునిచ్చారు. అలాగే బలమైన దేశాన్ని నిర్మించడానికి భారత్ ముందున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్వేచ్ఛ అంటే తమకు నచ్చినట్లుగా ప్రవర్తించడమేనని నేటి యువత భావించవచ్చుని, కానీ వాస్తవం అది కాదని దోవల్ అన్నారు. 'నేటి యువత తమను తాము పూర్తిగా అంకితం చేసుకోవాలి. కేవలం దేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తామని భావించాలి. వారు చిన్నపాటి వ్యక్తిగత ప్రయోజనాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలి, ఒకవేళ అటువంటి ఆలోచనలు తలెత్తినా వాటిని విస్మరించాలి' అని ఆయన అన్నారు. భారత దేశం తన చరిత్రలో ఒక కీలక దశలో ఉందని, ప్రస్తుత అవకాశాన్ని చేజారనివ్వకూడదని దోవల్ పేర్కొన్నారు. భారత దేశ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, దేశం తన లక్ష్యంలో విజయం సాధిస్తుందని, చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందన్నారు.

# అభిజీత్ దీప్కేకు అస్వస్థత

**ఛత్రపతి సంభాజీనగర్ :** 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అస్వస్థతకు గురయ్యాడు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో ఉన్న ఆయన నివాసంలో శనివారం వైద్యులు ఆయనను పరీక్షించి, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దీప్కే రక్తపోటు (బిపి) కొంచెం తక్కువగా ఉందని, ఆయన వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. ఉదయం పూట తన నివాసంలోని పార్కింగ్ ప్రాంతంలో ప్రజలను కలుస్తున్నప్పుడు దీప్కే అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం 11:45 గంటలకు పార్కింగ్ ప్రాంతంలో తన కోసం వేచి ఉన్న కొందరిని కలిసేందుకు ఆయన కిందకు వచ్చారు. కానీ అశాంతిగా అనిపించడంతో ఇంటి వెనుక భాగానికి వెళ్లారు, అక్కడ ఆయన వాంతి చేసుకున్నారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడకుండానే, ఆయన వెళ్లిపోయారు. ఆ తర్వాత, ఆయనను పరీక్షించడానికి వైద్యులను పిలిపించినట్లు ఆయన తండ్రి భగవాన్ దీప్కే తెలిపారు. డాక్టర్ విశాల్ లహనే వారి నివాసానికి వచ్చి దీప్కేను పరీక్షించారు.

## ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక చట్ట సవరణ బిల్లుకు


# రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ :** నిందితుల విచారణను వేగవంతం చేయడానికి ప్రతి రాష్ట్రంలోనూ 'ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల'ను ఏర్పాటు చేయడం, ప్రభుత్వ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల్లో శిక్షలను కఠినతరం చేయడం లక్ష్యంగా రూపొందించిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఈ వారం ప్రారంభంలో పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026'కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇకపై, ప్రశ్నపత్రాల లీకేజీ కేసులకు సంబంధించిన దర్యాప్తు ప్రక్రియను రెండు నెలల్లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ లేదా అక్రమ పద్ధతులకు పాల్పడే వ్యక్తులకు కనీసం 5 ఏళ్లు, గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 50 లక్షల జరిమానా విధించబడుతుంది. నేరాల విషయంలో, సవరించిన చట్టం కనీసం ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకు జరిమానా విధించాలని ప్రతిపాదిస్తోంది.


BIETE NARSAMPET
Balaji Institute of Elementary Teacher Education
Approved by NCTE & Affiliated to SCERT, Hyd
Laknepally, NARSAMPET, Dist: Warangal - 506 331 (TG)
CONTACT: 9866078590, 7702076967
ADMISSION NOTIFICATION - 2026-27
D.Ed - "B" CATEGORY SEATS PHASE-II
Application forms can be obtained from the College Office or download from the college website www.mcedn.org & email: balajiinstituteofeducation@gmail.com filled in applications along with relevant certificates shall be submitted in the college office on or before 03-08-2026 & 04-08-2026 by 3.00 pm. Registration Fee is Rs. 1000/-, Eligibility and Qualification 50% in Inter / Equivalent Exam & DEECET-.2026 Qualified candidates.
CHAIRMAN

### పాకిస్థాన్ బ్రాడ్ పీక్ హిమపాతంలో

# ప్రసిద్ధ పర్వతారోహకుడు పుర్జా మృతి



**కాఠ్మండు:**పాకిస్థాన్ కారంకోరంపర్వతాలలోని బ్రాడ్ పీక్ వద్ద సంభవించిన భారీ హిమపాతంలో నేపాల్‌కు చెందిన ప్రసిద్ధ పర్వతారోహకుడు నిర్మల్ పుర్జా (నిర్మల్ నిమ్స్‌డై పుర్జా) సహా పదిమంది పర్వతారోహకులు మరణించారు. "ఎలైట్ ఎక్స్‌పెడిషన్" తన సోషల్ మీడియా ఖాతా ద్వారా శనివారం ఈ విషయం ధృవీకరించింది. సాధారణ నడకతో ప్రారంభించి శిఖరాగ్రాలను అందుకున్న పుర్జా ఆ శిఖర కొనల దగ్గరే మరణించారు. ఈ హిమపాతం (అవలాంచీ)లో మరణించిన నలుగురు పర్వతారోహకుల మృతదేహాలను పాకిస్థానీ సహాయ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. కానీ పుర్జా సహా మిగిలిన ఆరుగురు పర్వతారోహకులకోసం గాలింపు చేస్తున్నామని వారు చెబుతున్న నేపథ్యంలో ఎలైట్ ఎక్స్‌పెడిషన్ ఈ విషయం పేర్కొంది. జులై 30వ తేదీన పుర్జాసహా ఆయన బృందం బ్రాడ్ పీక్‌పై ఉన్న సమయంలో హిమపాతం వారిపై విరుచుకుపడింది. ట్రాకింగ్‌లో గమనించినప్పుడు వారున్న ప్రదేశం మారిపోయింది. వారంతా కొండ కిందిభాగానికి కొట్టుకుపోయినట్లు ట్రాకింగ్ డేటా చూపించిందని ఆయన వ్యాపార భాగస్వామి మింగ్మా గ్యాబూ షెర్పా చెప్పారు.సిగ్నల్ ఒకచోట ఆగిపోయిందని, ఆ తర్వాత మళ్ళీ కదలడం ప్రారంభించినట్లు చూపించిందని చెప్పారు.పర్వతారోహణ ప్రపంచంలో నిమ్స్ దాయిగా ఖ్యాతి గాంచిన పుర్జా ప్రాజెక్ట్ పాజిబుల్‌ను పూర్తిచేసి గొప్ప గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రపంచంలో 8000 మీటర్ల కంటే ఎత్తైన పర్వతాలను ఏడు నెలల్లో అధిరోహించాలని 2019లో నిర్దేశించుకుని ఆరునెలల ఆరు రోజుల్లోనే లక్ష్యం పూర్తిచేశారు. అవలీలగా 189 రోజుల్లో 14 పర్వతాలను అధిరోహించి పర్వతారోహణకు, సాహసకృత్యాలకు ఒక సరికొత్త నిర్వచనం చెప్పిన నిర్మల్ నిమ్స్ పుర్జా వయసు 43 సంవత్సరాలు.ఒక మనిషి ఏదైనా సాధించాలని నిర్ణయించుకుంటే చేసి తీరుతాడని పుర్జా ప్రపంచానికి చాటి చెప్పారు. గతంలో ఆయన బ్రిటీష్ ప్రత్యేక దళాలలో పనిచేశారు. పర్వతారోహణలో సరికొత్త అంచులను చూసిన పుర్జా తన శక్తిసామర్థ్యాలు,మనోధైర్యం,నైపుణ్యంతో ప్రపంచదేశాలను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తారు. నేపాల్‌లోని మ్యాగ్డి జిల్లా దానా గ్రామంలో 1985 జులై 25న ఆయన జన్మించారు. బ్రాడ్‌పీక్ సమీపంలో ఉన్నప్పుడే తన జన్మదినం చేసుకున్నారు. తర్వాత ఐదు రోజులకే మరణించారు. ఆయన కుటుంబానికి సుదీర్ఘమైన సైనికసేవా చరిత్ర ఉంది. నేపాల్ గూర్ఖా రెజిమెంట్‌లో ఆయన పనిచేశారు.గూర్ఖా గా ఉండటమే తన కల అని డైరీలో రాసుకున్నారు. 16 సంవత్సరాలు ఆయన సైన్యంలో పనిచేశారు.తీవ్ర శీతలవాతావరణాన్ని జీర్ణించుకుని ఆ వాతావరణంలో పోరాడగల సైనికుడుగా నైపుణ్యం సాధించారు.2012లో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ నుండి ఆయన పర్వతారోహణ చరిత్ర ప్రారంభమైంది.

# హమాస్ నిరాయుధీకరణను గేలి చేసిన ఇజ్రాయెల్

**జెరూసలెం:**గాజాలో హమాస్ నిరాయుధీకరణ ప్రణాళికను ఇజ్రాయెల్ గేలిచేసింది. హమాస్ ఆమోదించిన నిరాయుధీకరణ ప్రణాళికను తాము సమ్మతించబోమని నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది. హమాస్ పూర్తిగా ఆయుధాలు వదులుకోవాలని అప్పటివరకూ గాజా నుండి వైదొలగేది లేదని ఇజ్రాయెల్ చెబుతుండగా,గాజా నుండి పూర్తిగా ఖాళీచేసి వెళ్ళిపోవాలని, దాడులు చేయబోమని హామీ ఇవ్వాలని, అప్పుడే ఆయుధాలు వదిలిపెడతామని హమాస్ చెబుతున్నది. తాము నిరాయుధీకరణకు ఒప్పుకున్నామని, ఇక భారం, బాధ్యత అంతా ఇజ్రాయెల్‌దేననీ హమాస్ పేర్కొంది. ఈ పరస్పర అవిశ్వాసాలమధ్య ట్రంప్ గురువారం ఎంతో గర్వంగా గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌కు చెందిన హమాస్ నిరాయుధీకరణ ప్రణాళిక పూర్తి పాఠాన్ని విడుదల చేశారు. హమాస్ అంగీకారంతో ఇజ్రాయెల్ చాలా...చాలా సంతోషంగా ఉందని పత్రికాగోష్ఠిలో ట్రంప్ ప్రకటించగానే నవ్వులు వినిపించాయి. హమాస్ నిరాయుధీకరణ ప్రణాళికకు ఒప్పుకున్నట్టు విజయగర్వంతో ఆడంబరంగా ప్రకటించారని,అమలు అవకాశాలు తక్కువేనని విశ్లేషకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రణాళిక అమలు జరిగితే గాజాకు సరిహద్దు ముప్పు తగ్గిపోతుంది. కొత్త భూభాగం కలుస్తుంది. ఐతే గాజా పునర్నిర్మాణానికి ప్రకటించిన




20 సూత్రాల ప్రణాళికను ఇజ్రాయెల్ ఆమోదించకపోతే ట్రంప్ చాలా నిరాశకు గురవుతారని సీనియర్ అమెరికా అధికారి చెప్పారు. గాజా శాంతి మండలి నిరాయుధీకరణ ప్రణాళికను హమాస్ అంగీకరించిందని ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే అమెరికా అధికారి ఈ విషయం చెప్పారు.హమాస్ అంగీకారాన్ని ట్రంప్ చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించారు.కానీ సంబంధిత భాగస్వాములలో ఏ ఒక్కరికీ విశ్వాసం కనిపించడంలేదన్నదే విశ్లేషకుల ప్రధాన ప్రశ్న. ఇది గాజాలో హమాస్‌తో పాటు అన్ని గ్రూపుల నిరాయుధీకరణకు దారితీస్తుందని, తద్వారా శాశ్వత శాంతి,భద్రతల దిశగా ఒక ముందడుగు అని ట్రంప్ చేసిన ప్రకటనపై నెతన్యాహూ స్వయంగా స్పందించలేదు.హమాస్ ఏదో ఒకరూపంలో దాడులు కొనసాగిస్తుందని ఇజ్రాయెల్, తమ జాతి నిర్మూలనకు ఇజ్రాయెల్ ఊచకోతలు కొనసాగిస్తుందని పాలస్తీనియన్లు అపనమ్మకంతో ఉన్నారు.ఇక్కడ సమస్య మూలాలు పరిష్కారం కాలేదని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.ఐక్యరాజ్య సమితి 2803 వ తీర్మానం (2025)ద్వారా ట్రంప్ ప్రతిపాదించిన సమగ్ర శాంతి ప్రణాళిక మార్గనిర్దేశానికి ఒక నిబంధనల చట్రాటన్ని ఏర్పరచింది. ఈ ప్రణాళిక ప్రకారం గాజాలో పౌర పరిపాలన,భద్రతా విధులన్నింటినీ గాజా జాతీయ పరిపాలనా కమిటీ (ఎన్‌సిఎజి)కి స్వాధీనం చెయ్యాలి. దీనిని హమాస్ సహా అన్ని వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఎన్‌సిఎజి స్వతంత్రంగా వ్యవహరించాలని, ఎవ్వరూ జోక్యం చేసుకోకూడదని హమాస్ కోరుతున్నది. ఈ ఎన్‌సిఎజి పరివర్తనకాలంలో తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తుంది. పాలస్తినా చట్టాలు,అంతర్జాతీయ ప్రమాణాలు,సుపరిపాలనా సూత్రాలకు అనుగుణంగా ఈ కమిటీ పనిచేయాలి. గాజా నుండి ఇజ్రాయెల్ సైన్యాలను ఎక్కడా ఉనికి జాడ లేకుండా సురక్షితంగా బయటకు సాగనంపాలి.అమెరికా మధ్యవర్తిత్వంలో ఇజ్రాయెల్–గాజా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తొమ్మిది నెలల తర్వాత ట్రంప్ గాజాలో హమాస్ నిరాయుధీకరణ ప్రణాళిక విడుదల చేశారు.

### ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పదవి రేసులో

# కోస్టారికా మహిళ రెబెకా ముందంజ



**సాన్‌జోస్:**ఐక్యరాజ్యసమితి తదపరి ప్రధాన కార్యదర్శి పదవికోసం జరుగుతున్న పోటీలో లాటిన్ అమెరికా దేశం కోస్టారికా మాజీ ఉపాధ్యక్షురాలు రెబెకా గ్రిన్‌స్పాన్ ముందంజలో ఉన్నారు. గయానాకు చెందిన మాజీ విదేశాంగమంత్రి కరోలిన్ రోడ్రిగ్స్ బిర్కెట్ రెండోస్థానంలో ఉన్నారు. దౌత్యవేత్తలు రాయిటర్స్‌కు చెప్పిన సమాచారం ప్రకారం ఈ పదవికోసం ఏడుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. భద్రతామండలిలో అనిధికారికంగా జరిగిన మొదటి పోలింగ్‌లో విచిత్రంగా ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షణ సంస్థ అధిపతిగా ఉన్న రఫేల్ గ్రోస్సీ ఈ రేసులో మూడోస్థానంలోకి వెళ్ళిపోయారు.ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న ఆంటోనీ గుటెర్రెస్ 2026 డిసెంబరు 31వ తేదీన పదవీ విరమణ చేస్తారు.ఈ నేపథ్యంలో కొత్త ప్రధాన కార్యదర్శి కోసం వేట ప్రారంభమైంది. భద్రతా మండలిలో ఉన్న 15 సభ్యదేశాల ప్రతినిధులు రహస్యంగా నిర్వహించిన స్ట్రా పోల్‌లో రెబెకా గ్రిన్‌స్పాన్‌కు పది ప్రోత్సాహక ఓట్లు లభించాయి. సాధారణంగా భద్రతామండలి సిఫార్సు మేరకు జనరల్ అసెంబ్లీ తీర్మానం ద్వారా సమితి ప్రధాన కార్యదర్శిని ఎన్నుకుంటారు. భద్రతామండలిలో వీటో అధికారం ఉన్న ఐదు శాశ్వత సభ్య దేశాలలో ఏ ఒక్క దేశం నుండీ ప్రధాన కార్యదర్శి ఎన్నిక కాకూడదు. ఎందుకంటే ఆ పదవికి అభ్యర్థిని సిఫార్సు చేయడంలో ముఖ్యభూమిక ఈ దేశాలకే ఉంటుంది. పైగా అభ్యర్థిని వీటో చేసే అధికారం కూడా ఈ దేశాలకు ఉంది.ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా ఉన్న పోర్చుగీసుకు చెందిన ఆంటోనియో గుటెర్రెస్ ఆ దేశంలోని సోషలిస్టు పార్టీ తరపున ప్రతిపక్ష నాయకుడుగా,సోషలిస్టు ఇంటర్నేషనల్‌కు చెందిన 25 మంది ఉపాధ్యక్షులలో ఒకరుగా ఎన్నికయ్యారు.కోఫీ అన్నన్ పదవీ విరమణ చేసిన తర్వాత 2017 జనవరి 1వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టారు. వరుసగా రెండుసార్లు పదవిలో కొనసాగిన గుటెర్రెస్ మరో ఐదునెలల్లో వైదొలగుతారు.

# వలసల నివారణకు గోడ నిర్మాణం:స్పెయిన్

- మాడ్రిడ్‌లో నిరసన ప్రదర్శనలు
- దాదాపు అంతా వెళ్ళిపోయారు:67కు పెరిగిన మృతుల సంఖ్య




**సియూటా:**మొరాకో నుండి వేలాదిమంది వలస ప్రజలు ఉప్పెనలాగా స్పెయిన్‌పై విరుచుకుపడటంతో స్పెయిన్ నగరం మాడ్రిడ్‌లో ప్రజలు భారీ సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. సముద్రమార్గంలో ఐదు కిలో మీటర్ల దూరం ఈదుకుంటూ దాదాపు 60,000 మంది వలస ప్రజలు స్పెయిన్ సముద్ర తీరానికి చేరుకుని నగరాల్లోకి ప్రవేశించడాన్ని అంతర్జాతీయ నేరముఠాల దుర్మార్గపూరిత చర్యగా ఆ దేశ ప్రధానమంత్రి సాంఛెజ్ విమర్శించారు. కొన్ని యూరప్ దేశాలు తమకు ప్రతికూలంగా, స్వార్థపూరితంగా స్పందించాయని, విభజనను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడాయని విమర్శించారు. ఈ మేరకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్‌కు ఒక లేఖ రాశారు. ఐతే 48 గంటల్లోనే సరిహద్దుల్లో పరిస్థితులను తాము అదుపులోకి తెచ్చామని పేర్కొన్నారు. 84000 మంది భద్రతా సిబ్బందిని ప్రజల భద్రత కోసం వీధుల్లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జర్మన్ ఛాన్సలర్ మెర్జ్ మాత్రం స్పెయిన్‌కు అనుకూలంగా స్పందించారు. ఇదిలా ఉండగా, వలస ప్రజలను మొరాకో ప్రభుత్వం తిరిగి తీసుకువెళ్ళాలని, దీనిపై స్పందించాలని పలు యూరప్ దేశాలు డిమాండ్ చేశాయి. మరోవైపు ఈ విధంగా అక్రమంగా వచ్చిన వారిలో దాదాపు అందరూ వెనక్కు తిరిగి వెళ్ళిపోయారని అధికారులు చెప్పినట్లు మీడియా వార్తలు వెల్లడించాయి. అదేవిధంగా మొరాకో నుండి ప్రజలు తరలి వచ్చినప్పుడు అనేకమంది సముద్రం మధ్యలోనే మరణించారు. ఈ మృతులసంఖ్య శనివారం నాటికి 67కు చేరుకుంది. కాగా సముద్రమార్గంలో అక్రమంగా ప్రజలు ఈ విధంగా వలసలు రాకుండా అడ్డుకోవడానికి ప్రస్తుతం సముద్రతీరంలో ఉన్న కంచెకు అదనంగా మరో గోడను కూడా నిర్మించాలని స్పెయిన్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. అలలను అడ్డుకోవడానికి ఇప్పటికే కంచెలు నిర్మించారు. అదనంగా గోడలు కడతారు. టీవీలలో ఆ దృశ్యాలను తాను చూశానని, ఆశ్చర్యపోయానని, ఇది ఒక రకంగా మరో పొరుగుదేశంపై దాడితో సమానమైనదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటలీ ప్రధానమంత్రి జార్జియో మెలోనీ స్పందిస్తూ అదంతా చాలా దిగ్భ్రాంతికరంగా ఉందన్నారు.

# అమెరికాకు సహకరిస్తే బూడిదైపోతారు

### ఇరాన్ సైన్యాధిపతి హెచ్చరిక



**టెహ్రాన్:**పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను అమెరికా పతాకస్థాయికి తీసుకుపోతోందని ఇరాన్ మండిపడింది. అమెరికాకు ఏ దేశం మద్దతు ఇచ్చినాగానీ యుద్ధజ్వాలల్లో దగ్ధమైపోతారని ఇరాన్ సైనిక కేంద్రం కమాండ్ అధిపతి అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు. అమెరికా–ఇజ్రాయెల్ తమపై దాడులు చేస్తే పశ్చిమాసియాలో ఉన్న అమెరికా ఇంధన మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్‌పై చాలా తీవ్రస్థాయిలో దాడి చేస్తామని, పౌర ప్రాంతాలపై కూడా దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరికకు ప్రతిగా అబ్దుల్లాహీ ఈ ప్రకటన చేశారు. ఆయన ప్రకటనను ఇరాన్ మీడియా చదివి వినిపించింది. ఈ సంఘర్షణ సమయంలో అమెరికాకు ఎవరూ సహకరించవద్దని కోరారు. నేరాలు చేస్తూ, దురాక్రమణలకు పాల్పడే అమెరికాకు రక్షణ కవచంగా పనిచేసే ఏ దేశమైనాగానీ యుద్ధ జ్వాలల్లో బూడిదైపోతుందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచి లాభపడాలని అమెరికా ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. హౌతీ తిరుగుబాటు ఉగ్రవాదులనుండి తప్పించుకోవడానికి ఒక కొత్త అంతర్జాతీయ కూటమి ఏర్పాటు చేసేందుకు సౌదీ అరేబియా ఒక కొత్త అంతర్జాతీయ కూటమిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అల్–మానిటర్ చెప్పిన సమాచారం ప్రకారం, ఎర్ర సముద్రంలో నౌకా రవాణా భద్రత,యెమెన్‌కు చెందిన అన్సార్ అల్లాహ్ తిరుగుబాటు ఉద్యమానికి చెందిన హౌతీలను అదుపు చేయడానికి అంతర్జాతీయ కూటమి ఏర్పాటు చేయాలని సౌదీ అరేబియా భావిస్తోంది. ఈజిప్టు, సూడాన్, జిబూటీ, సోమాలియా దేశాలు ఇప్పటికే ఈ కూటమిలో చేరడానికి అంగీకారం తెలియజేశాయి.

# పోటెత్తి శాంతిస్తున్న గోదావరి

- కొనసాగుతున్న మూడో ప్రమాద హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- మూసుకుపోయిన రహదారులు
- స్తంభించిన రవాణా
- పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/భద్రాచలం:**భద్రాచలం వద్ద గోదారి పోటెత్తి శాంతిస్తోంది. శనివారం సాయంత్రం నుండి అతిస్వల్పంగా తగ్గుముఖం పడుతోంది. శనివారం తెల్లవారు ఝామున 2 గం. సమయంలో గోదావరి 53 అడుగులకు చేరుకోవడం అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. శనివారం మధ్యాహ్న 12 గం.లకు 56.10 అడుగుల వరకు చేరుకుని నాలుగు గంటల పాటు నిలకడగా మారింది. సాయంత్రం 5గం. నుండి క్రమంగా తగ్గుతూ 54.6 అడుగులకు చేరుకుంది. కడపటి వార్తలు అందే సమయానికి 53 అడుగుల పై బడి వరద ఉండటంతో తుది ప్రమాదహెచ్చరిక కొనసాగుతోంది. ఇది ఆదివారం నాటికి క్రమేపీ తగ్గి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 48 అడుగుల దిగువకు ప్రవహించే అవకాశం ఉన్నట్లు సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు. ఎగువ భారీ వర్షాలు కురవడంచో ఇంద్రావతి, ప్రాణహిత ఉప నదులు పొంగటంతో పాటు తాలిపేరు నుండి నీటిని భారీగా గోదావరిలోకి విడుదల చేయడంతో వరద పోటెత్తింది. దీంతో గడిచిన మూడు రోజులుగా భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నెమ్మదిగా శాంతిస్తోంది. రాగల రోజుల్లో వర్ష సూచన ఉండటంతో వర్షాలు పడే అవకాశం ఉంది. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో కలెక్టర్ అంకిత్ భద్రాచలంలో మకాం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అధికారులను స్వయంగా అప్రమత్తం చేస్తూ లోతట్టు ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ కరకట్ట వద్దకు చేరుకుని వరద ప్రవాహాన్ని గనిస్తున్నారు. మరో ప్రక్క విస్తా కాంప్లెక్స్ స్లూయిస్‌ల వద్ద మురుగునీటిని మోటార్ల సహాయంతో గోదావరిలోకి ఎత్తిపోస్తున్నారు.


**లోతట్టు ప్రాంతాలు జలమయం :** గోదావరి పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చర్ల మండలంలోని తేగడ వద్ద గోదావరి రోడ్డుపైన తిష్టవేసింది. భద్రాచలం సిఆర్‌పిఎఫ్ క్యాంపు సమీపంలోకి వరద నీరు చేరుకుంది. శివారులో కరకట్ట అసంపూర్తిగా ఉండటంతో అటుగా ప్రధాన రహదారిపైకి వరదనీరు ప్రవేశించింది. దుమ్ముగూడెం మండలంలో సున్నంబట్టి గంగోలు తూరుబాక ఏపి ఎటపాక గండాల బూర్గంపాడు మండలంలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం అశ్వాపురం మండలం పరిధిలోని చింతిర్యాల నెల్లిపాక బంజర్ గ్రామాల్లో రోడ్లుపైకి గోదావరి చేరింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు రవాణా వ్యవస్థ స్తంభించింది. దుమ్ముగూడెం మండల పరిధిలోని గంగోలు డబుల్ బెడ్రూమ్ కాలనీ ప్రగళ్లపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరద శరణార్ధులకు మంచినీరు భోజన అందించాలని, విద్యుత్ సదుపాయం నిరంతరాయంగా ఉండేలా చూడాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారితో కలెక్టర్ మాట్లాడుతూ వరదలు పూర్తి స్థాయిలో సాధారణ స్థితికి వచ్చేంత వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. అనారోగ్య పరిస్థితులు తలెత్తితే వెంటనే వైద్య సిబ్బంది ద్వారా వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని గోదావరి నీరు ప్రవహించే ప్రదేశాలు కాలువలు, కుంటల వైపు వెళ్లవద్దని చిన్నపిల్లల పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఉత్తరాంధ్రకు గేట్‌వే

(మొదటి పేజీ తరువాయి)

థింసా నత్యంతో గిన్నిస్ రికార్డు సష్టించడం అమోఘమని, ఇది తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. థింసా నృత్యంలో పాల్గొన్న 13 వేల మందికి పైగా గిరిజన మహిళలకు మోదీ అభినందనలు తెలిపారు. అల్లూరి సీతారామరాజు నడయాడిన నేల ఇది. గిరిజనుల హక్కుల కోసం అల్లూరి తన ప్రాణాలను అర్పించారని, అల్లూరి పేరుతో భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఉత్తరాంధ్ర యువత అభివద్ధికి ఈ విమానాశ్రయం ఒక రన్‌వేలా, ఓ లాంచ్ ప్యాడ్ లా పని చేస్తుందన్నారు. గతంలో విమానాశ్రయాలకు ఒక కుటుంబం పేర్లు మాత్రమే ఉండేవని, కానీ తాము ఆ పద్ధతిని మార్చామని కాంగ్రెస్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శించారు. 2014 వరకు దేశం మొత్తం మీద 74 విమానాశ్రయాలుంటే... ఇప్పుడు 166 విమానాశ్రయాలు ఉన్నాయన్నారుపట్టణాల నుంచి కూడా విమానయాన సేవలు అందుతున్నాయన్నారు. ఉడాన్ పథకం ద్వారా తొలిసారి విమానం ఎక్కే అవకాశం చాలా మందికి లభించిందన్నారు. స్మోక్ ఎయిర్ పోర్టు మోడల్ కాశీ నుంచి అమత్‌సర్ వరకు విస్తరించిందన్నారు. కోస్టల్ ఎకానమిక్ కారిడార్ అభివద్ధి చేస్తూ బ్లూ ఎకానమీని బలోపేతం చేస్తున్నామన్నారు. విశాఖ నుంచి కష్ణపట్నం వరకు ఉన్న పాత పోర్టులను ఆధునీకరిస్తున్నామని, వలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులను అభివద్ధి చేస్తున్నామన్నారు. విశాఖరాయపూర్ ఎక్స్ ప్రెస్ వే అభివృద్ధితో పాటు, దాదాపు రూ. 1 లక్ష కోట్ల ఖర్చుతో రైల్వే కనెక్టివిటీ పనులు జరుగుతున్నాయనీ ,వివిధ పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానం చేస్తున్నామని ప్రధాని వివరించారు. పెట్టుబడులు, ఉపాధి, అభివృద్ధి అనే లక్ష్యంతోనే ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పెట్టుబడులు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందని, ఉత్పత్తి పెరిగితే ఎగుమతులు పెరుగుతాయని, ఎగుమతులు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తారిస్తాయని, తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ప్రధాని విశ్లేషించారు. ఇదే అభివృద్ధి నమూనాను ఏపీలో అమలు చేస్తున్నామని పేర్కొంటూ, చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని ప్రధాని మోదీ ప్రశంసించారు.

అంతకుముందు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్టుకు భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం అని, ఎర్ర బస్సు రాదన్నారు, కానీ ఎయిర్ బస్ వచ్చిందన్నారు. అవహేళన చేసిన వారు అడ్రస్ లేకుండా పోయారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రకే గర్వకారణం అన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం, రాజధాని అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని,
2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేస్తామని , ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తాం అన్నారు. 2028 నాటికి అమరావతి మొదటి దశ పనులను పూర్తి చేసి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మిస్తున్నామని, శంషాబాద్ ఎయిర్ పోర్టుతో తెలంగాణ దశ దిశ మారిందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర దశ దిశ మారుతుందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు నాడు కొబ్బరికాయ కొట్టింది, ఇప్పుడు గుమ్మడి కాయ కట్టిందీ తామేనన్నారు. రెండేళ్లలో ప్రధాని మోదీ సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు రూ.6.13 లక్షల పెట్టుబడులు వచ్చాయని, ఇవి పూర్తి అయితే 5.57 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్లు అబ్దుల్ నజీర్ పి. అశోక్ గజపతిరాజు , కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్ నాయుడు , భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ అప్పల నాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



కడెం ప్రాజెక్ట్ వద్ద



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద

## నీటి నిల్వలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి), ఎన్‌డిఎస్‌ఎ అధికారులు కూడా నిపుణుల కమిటీ సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారన్నారు. డిపిఆర్ ప్రకారం షీట్‌పైల్ ఫౌండేషన్ నిర్మించాల్సి ఉండగా స్కాంట్ పైల్ ఫౌండేషన్ నిర్మించారని, మూడు బ్యారేజీల పునాదుల నాణ్యతపై నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్ఠంగా సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రు శంకుస్థాపన చేశారని, 1959లో కడెం ప్రాజెక్టుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన జరిగిందన్నారు. 2004 జులై 28న దివంగత సిఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా రైతులకు సాగునీరు అందిస్తుండగా, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని విమర్శించారు. వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు గంట గంటకు నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నీటి పారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికి దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదని విమర్శించారు. ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి గత 34 నెలలుగా కాళేశ్వరం మూడు బ్యారేజీల నుంచి ఒక్క చుక్క నీటిని కూడ ఎత్తిపోకపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు అందించి 340 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించామని, 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.80 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు.

**అనవసర రాజకీయాలు సరికాదు! : శ్రీధర్‌బాబు**
మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులను సందర్శించి ప్రస్తుత జలస్థితిని పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి ఎన్‌డిఎస్‌ఎ అనుమతించలేదని, దీనిపై అనవసర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు నీటి తరలింపు పనులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగమేనని, మిడ్ మానేరు, ఫ్లడ్ ఫ్లో కాలువ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించబడినవేనని తెలిపారు.

**నాసిరకంగా నిర్మించడంతోనే దెబ్బతిన్నాయి! : వివేక్**
మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నాసిరకంగా నిర్మించడంతోనే దెబ్బతిన్నాయన్నారు. గురుత్వాకర్షణ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉన్నప్పటికి భారీ ఎత్తిపోతల ద్వారా వేల కోట్ల రూపాయల విద్యుత్తు వ్యయం జరిగేలా ప్రాజెక్టు రూపొందించారని విమర్శించారు. నీటిపారుదల రంగంలో తుగ్లక్ నిర్ణయాలతో లక్షల కోట్ల రూపాయలు వృథా అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, గడ్డం వినోద్‌కుమార్, వెడ్మ బొజ్జు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**భవిష్యత్ అవసరాలకు నీటిని నిల్వ చేయాలి**
భవిష్యత్తు తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుల్లో నీటిని ప్రణాళికాబద్ధంగా నిల్వ చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఇ టీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిని సమీక్షించేందుకు మంత్రుల బృందం శనివారం కడెం ప్రాజెక్టును సందర్శించింది. ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఇడి తెరపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్ ఆర్ఎల్), ప్రస్తుత ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం, ప్రస్తుత పరిస్థితులను మంత్రులకు వివరించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలపై కూడా సమగ్ర సమాచారం అందించారు. నిర్మల్ కలెక్టర్ భవేష్ మిశ్రా కడెం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటిమట్టం, నీటి నిల్వ సామర్థ్యం, సిల్టేషన్ సమస్యలు, నీటి పారుదల నిర్వహణపై మంత్రులకు వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగాన్ని శాస్త్రీయంగా నిర్వహిస్తూ సాగునీటి అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రాజెక్టులో సిల్టేషన్ ప్రధాన సమస్యగా మారిందని, సుమారు 7.5 టిఎంసిల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో దాదాపు 50 శాతం వరకు పూడిక పేరుకుపోయినట్లు వివరించారు. దీనివల్ల నిల్వ సామర్థ్యం తగ్గుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. నీటిమట్టం 674–675 మీటర్లకు చేరినప్పుడు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ రోజుల్లో నీటి విడుదల చేపట్టే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. పూడిక సమస్యను దశలవారీగా తగ్గించి ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

**పంటలకు అవసరమైన రీతిలో నీరు విడుదల**
నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టును మంత్రులు మంత్రులు మంత్రుల బృందం ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిలతో సందర్శించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టు అధికారులతో సమీక్ష నిర్వహించి నీటి నిల్వ భవిష్యత్తులో నీటి లభ్యత చేయాల్సిన మరమ్మతులపై చర్చించారు. పంటలకు అవసరమైన రీతిలో నీటి విడుదలకు అవసరమైన ప్రణాళికను త్వరలోనే అందిస్తామని తెలిపారు.

## మారిన మహానగర రూపు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోంది హైడ్రా అని సిఎం పేర్కొన్నారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులకు, సిబ్బందికి సిఎం హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా సిఎం ఒక ట్విట్ చేశారు. చెరువులను పరిరక్షించడమంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదని, భావి తరాల భవిష్యత్తును భద్రపరచడమని సిఎం పేర్కొన్నారు. ప్రతి చెరువును కాపాడుతూ ప్రతి అంగుళం ప్రజా ఆస్థిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని సిఎం తెలిపారు.

# బాక్సింగ్‌లో భారత్‌కు ‘డబుల్’ ధమాకా

**కామన్వెల్త్ క్రీడల్లో బాక్సింగ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా**

**గ్లాస్గో :** కామన్వెల్త్ గేమ్స్‌లో శనివారం జరిగిన మహిళల బాక్సింగ్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాలను ముద్దాడారు. మహిళల 54 కిలోల విభాగంలో ప్రపంచ మూడో ర్యాంకర్ ప్రీతి పవార్ కెనడాకు చెందిన స్కార్లెట్ డెల్గాడోపై 5–0 తేడాతో ఏకపక్ష విజయం సాధించి, భారత్‌కు పసిడి పతకాన్ని అందించింది. అనంతరం జరిగిన 57 కిలోల విభాగంలో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జైస్మిన్ లాంబోరియా 5–0 తేడాతో ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన డిఫెండింగ్ ఛాంపియన్ మైఖేలా వాల్ష్‌ను చిత్తు చేసి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. తొలి రౌండ్‌లో పోటాపోటీగా సాగినప్పటికీ, రెండో రౌండ్‌లో జైస్మిన్ పవర్ ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడి విజయాన్ని సాధించింది.



## పారా షాట్‌పుట్‌లో సోనమ్‌కు స్వర్ణం

*రజతంతో మురిసిన శుభమ్!*

పారా షాట్‌పుట్‌లో సోనమ్ రానా, శుభమ్ జుయల్‌లు తొలి రెండు స్థానాల్లో నిలిచి పసిడి, రజత పతకాలు సాధించారు. శనివారం జరిగిన పురుషుల ఎఫ్ 57 ఫైనల్లో సోనమ్ ఇనుప గుండును ఏకంగా 13.40 మీటర్ల దూరం విసిరి స్వ ర్ణం గెలుపొందాడు. అతడిని అనుసరించిన శుభ మ్ 13.28 మీటర్లతో సిల్వర్ మెడల్ సొంతం చే సుకున్నాడు. గ్లాస్గో ఆతిథ్యమిస్తున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. పదోరోజును బాక్సర్లు ప్రీతి పవార్ , జా స్మినెలు స్వర్ణం ప్రారంభించగా.. ట్రిపుల్ జంప్ లో ప్రవీణ్ చిత్రవేల్, సెల్వ ప్రభు తిరుమరన్‌లు రజతం, కాంస్యం సాధించారు. డెకథ్లాన్‌లో దే శానికి మొట్ట మొదటి పతకం అందించాడు తేజస్విన్ శంకర్. బాక్సర్ జై డిక్సన్ 55 కిలోల విభాగంలో రజతంతో సరిపెట్టుకున్నాడు. వీరి స్ఫూర్తి తో పారా అథ్లెట్లు సైతం పతకాలు కొల్లగొట్టారు. హోరాహోరీగా సాగిన పారా షాట్‌పుట్ ఫైనల్లో అదరగొట్టిన సోనమ్ రానా, శుభమ్ జుయల్‌లు స్వర్ణ, రజత పతకాలను ఒడిసిపట్టారు. సోనమ్ 13.40 మీటర్లు, శుభమ్ 13.28 మీటర్ల దూరం ఇనుపగుండును విసిరి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరి కంటే ముందే.. పారా షాట్‌పుట్ మహిళల విభాగంలో 40 ఏళ్ల షర్మిలా ధన్కర్ దేశానికి మొట్టమొదటి పసిడి అందించిన విషయం తెలిసిందే. కామన్వెల్త్ పారా షాట్ పుట్‌లో.. 20 ఏళ్లుగా పతకం కోసం నిరీక్షిస్తున్న భారత అథ్లెట్ల కలను సాకారం చేసింది షర్మిల.

## జావెలిన్ త్రోలో నీరజ్ సిల్వర్.. యశ్వీర్‌కు కాంస్యం




**గ్లాస్గో:** భారత జావెలిన్ స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడల్లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన చివరి త్రోతో యశ్వీర్ అనూహ్య రీతిలో మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన 28 ఏళ్ల నీరజ్ చోప్రా .. కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండో అటెంప్ట్‌లో 85.83 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావించారు. కానీ పాక్ అథ్లెట్ అనుకోని రీతిలో నిష్క్రమించాడు. ఇటీవల వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరగే సత్తా చాటాడు. అతను జావెలిన్‌ను 89.75 మీటర్ల దూరం విసిరి బంగారం పతకాన్ని కైవసం చేసుకున్నాడు. గ్లాస్గోలో ప్రస్తుతం చల్లని వాతావరణం ఉన్నది. బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో జావెలిన్‌ను సుమారు 90 మీటర్ల దూరం వరకు విసరడం అంత సులువైన అంశం కాదు. ఈ సీజన్‌లో జావెలిన్‌ను 90 మీటర్ల మార్క్ దాటించిన ఏకైక క్రీడాకారుడి జాబితాలో రుమేశ్ తరంగ ఉన్నాడు. ఇక ఈవెంట్‌లో 24 ఏళ్ల యశ్వీర్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. తొలిసారి కామన్‌వెల్త్ గేమ్స్ ఆడుతున్న అతను.. అందర్నీ స్టన్ చేస్తూ తన జావెలిన్‌ను 85.41 మీటర్ల దూరం విసిరాడు. తన చివరి ఆరో ప్రయత్నంలో అతను ఆ దూరానికి జావెలిన్‌ను విసిరి ఇండియాకు పతకాల సంఖ్యను పెంచేశాడు.

## డెకథ్లాన్‌లో తొలి పతకం

ట్రిపుల్ జంప్ క్వాలిఫయింగ్‌లో మెరిసిన ప్రవీణ్ చిత్రవేల్ , సెల్వ ప్రభు తిరుమరన్‌లు ఫైనల్లోనూ సత్తా చాటి పతకాలు సాధించారు. శనివారం జరిగిన ఫైనల్లో ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరం దూకి వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. డెకథ్లాన్‌లో దేశానికి మొట్ట మొదటి పతకం అందించాడు తేజస్విన్ శంకర్. పోడియం మీద ఈ ముగ్గురూ సగర్వంగా పతకాలు స్వీకరించి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు పదో రోజు కూడా పతకాల వేట కొనసాగించారు. బాక్సర్లు ప్రీతి పవర్, జాస్మినె లంబోరియాలు స్వర్ణాలు అందించగా.. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ రజతం, సెల్వ ప్రభు కాంస్యంతో మెరిశారు. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరంతో వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మొదట 16.05 మీటర్లు దూకిన ప్రవీణ్.. నాలుగో ప్రయత్నంలో 16.58 మీటర్ల మార్క్ అందుకున్నాడు. సెల్వ సైతం 15.87 మీటర్ల నుంచి.. నాలుగో ప్రయత్నంలో 16.52 మీటర్ల దూరంతో కాంస్యం గెలిచాడు.




### 7,976 పాయింట్లు

ఇక పది క్రీడల డెకథ్లాన్ పోటీల్లో తేజస్విన్ శంకర్ దేశానికి మొట్టమొదటి పతకం అందించాడు. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, 400 మీటర్లు, జావెలిన్ త్రో, పోల్ వాల్ట్, 1500 మీటర్ల పరుగులో సత్తా చాటిన తేజస్విన్ 7,976 పాయింట్లు సాధించి, కాంస్యంతో యావత్ దేశం గర్వపడేలా చేశాడు. గాయం బాధించినా సరే దేశం కోసం పతకం గెలవాలనే కసితో పోటీపడిన తేజస్వీపై ప్రశంసలు కురుస్తున్నాయి.




## భారత స్టాక్ మార్కెట్లకు
# అంతర్జాతీయ పరిణామాలే కీలకం



ఈ నెల 27 నుంచి 31, 2026 వరకు జరిగిన వారపు ట్రేడింగ్‌లోభారత స్టాక్ మార్కెట్లు గణనీయమైన పుంజుకోవడాన్ని నమోదు చేశాయి. ‘బుల్‌రన్’ కొనసాగడంతో, అంతకుముందు వారం భారీ నష్టాలను ఎదుర్కొన్న మార్కెట్లు ఈ వారం తిరిగి బలాన్ని ప్రదర్శించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ)లో వరుసగా, సెన్సెక్స్ 1,258.86 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 387.65 పాయింట్లు పెరిగింది. దీనికి భిన్నంగా ఈనెల 20 నుంచి 24 వరకు సాగిన గత వారంలో ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2,091.77 పాయింట్లు, నిఫ్టీ 566.85 పాయింట్లు నష్టపోయాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా మధ్యప్రాచ్య పరిణామాల కారణంగా ఏర్పడిన అనిశ్చితి నుంచి కొంత ఉపశమనం లభించడంతో ఈ వారం మార్కెట్లలో కొనుగోళ్లకు ఊతం లభించింది. విదేశీ పెట్టుబడిదారుల వైఖరి, ముడి చమురు ధరల కదలిక, అమెరికా మార్కెట్ల పనితీరు వంటి అంశాలు వచ్చే వారం భారత ఈక్విటీ మార్కెట్లకు కీలకంగా మారనున్నాయి. కాగా, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు సంబంధించి హమాస్ తన ఆయుధాలను వదులుకునే ప్రక్రియకు అంగీకరించినట్లు వచ్చిన వార్త అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో సానుకూల భావనను పెంచే అవకాశం ఉంది. గాజా యుద్ధానికి ముగింపు దిశగా అడుగులు పడితే, భౌగోళిక రాజకీయ ప్రమాదాలు తగ్గి పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరగవచ్చు. ముఖ్యంగా యుద్ధ భయాలతో పెరిగిన చమురు ధరలు తగ్గే అవకాశం ఉంటే, చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు అది అనుకూల పరిణామంగా మారుతుంది. అయితే ఈ ఒప్పందం అమలు విషయంలో ఇంకా అనేక అనిశ్చితులు ఉన్నాయి. హమాస్ పూర్తిగా నిరాయుధీకరణకు అంగీకరిస్తుందా, ఇజ్రాయెల్ సైనిక ఉపసంహరణ ఎలా జరుగుతుంది, అంతర్జాతీయ పర్యవేక్షణ ఎంతవరకు విజయవంతమవుతుంది వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపవచ్చు. ఒకవేళ చర్చలు విఫలమైతే, మళ్లీ భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగి మార్కెట్లలో అస్థిరతకు దారితీసే అవకాశం ఉంది. వచ్చే వారంలో భారత మార్కెట్ల దృష్టి ప్రధానంగా కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై సంకేతాలు, రూపాయి మారకం విలువ, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ప్రవాహంపై ఉండనుంది. ఇటీవల భారీ పతనం తర్వాత వచ్చిన ఈ వారం రికవరీ మార్కెట్లో కొనుగోలుదారుల విశ్వాసం కొంత తిరిగి వచ్చిందనే సంకేతాన్ని ఇస్తోంది. మొత్తం మీద, అంతర్జాతీయ పరిణామాలు ఇంకా అనిశ్చితిలోనే ఉండటంతో, వచ్చే వారం మార్కెట్లు పూర్తిగా ఏకపక్షంగా కదిలే అవకాశం తక్కువ. చమురు ధరలు అదుపులో ఉంటే, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు తగ్గితే, విదేశీ పెట్టుబడులు తిరిగి పెరిగితే సెన్సెక్స్, నిఫ్టీ మరింత లాభాలను నమోదు చేసే అవకాశం ఉంది. మరోవైపు ప్రతికూల అంతర్జాతీయ వార్తలు వెలువడితే, ఇటీవల వచ్చిన లాభాలపై మదుపరులు లాభాల స్వీకరణకు దిగే అవకాశం కూడా ఉంటుంది. మొత్తంగా చూస్తే వచ్చే వారం భారత స్టాక్ మార్కెట్లకు అప్రమత్తతతో కూడిన ఆశావహ పరిస్థితులు ఉండవచ్చని అంటున్నారు.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 76,835.78 పాయింట్లు. ముగింపు 78,094.64 పాయింట్లు. లాభం 1,258.86 పాయింట్లు.
**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ) లో నిఫ్టీ:** ప్రారంభం 23,995.95 పాయింట్లు. ముగింపు 24,383.60 పాయింట్లు. లాభం 387.65 పాయింట్లు.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,44,340
22 క్యారెట్లు: రూ. 1,32,340
18 క్యారెట్లు: రూ. 1,08,260
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

## తగ్గిన మారుతి సుజుకి నికర లాభం
### త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన కంపెనీ




దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థల్లో ఒకటైన మారుతి సుజుకి 2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మిశ్రమ ఫలితాలను ప్రకటించింది. కంపెనీ నికర లాభం గత ఏడాదితో పోలిస్తే 11 శాతం తగ్గి రూ.3,352 కోట్లకు చేరింది. ముడి సరుకుల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయాలు అధికమై లాభాలపై ఒత్తిడి ఏర్పడింది. అయితే కంపెనీ ఆదాయం మాత్రం బలమైన వృద్ధిని నమోదు చేసింది. త్రైమాసిక ఆదాయం 36 శాతం పెరిగింది. వాహన విక్రయాలు, మార్కెట్ డిమాండ్ మెరుగుపడటం కంపెనీ ఆదాయ వృద్ధికి సహకరించాయి. కానీ ఉక్కు, ఇతర ఆటో భాగాలు వంటి కీలక ముడి పదార్థాల ధరల పెరుగుదల కారణంగా ఆ లాభం పూర్తిగా ప్రతిఫలించలేదు. మారుతి సుజుకి ఫలితాలు ఆటో రంగంలో పెరుగుతున్న పోటీ, ఉత్పత్తి వ్యయాల ఒత్తిడి, వినియోగదారుల డిమాండ్ వంటి అంశాలను ప్రతిబింబిస్తున్నాయి. పెట్టుబడిదారులు లాభాల తగ్గుదలను ప్రతికూలంగా చూసినా, ఆదాయ వృద్ధి కంపెనీ వ్యాపార బలాన్ని సూచిస్తోందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

## ‘మెటా’ను ప్రశ్నించనున్న కేంద్రం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టును కొంత కాలం పరిమితం చేసిన ఘటన నేపథ్యంలో, సోషల్ మీడియా దిగ్గజం ‘మెటా’ను ప్రశ్నించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మెటా అల్గారిథమ్‌లలో పక్షపాతవైఖరి చూపిస్తున్నదని కేంద్రం భావిస్తుంది. దీనితోపాటు కంటెంట్ నియంత్రణ విధానం, ప్రజా శాంతిభద్రతలపై సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలపైన కూడా మెటా బృందం నుంచి వివరణ కోరనుంది. వచ్చే వారం మెటా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో పాటు పార్లమెంటరీ కమిటీ ముందు కూడా హాజరుకానున్నారు. ఈ ఘటనను మెటా సాంకేతిక లోపంగా పేర్కొని క్షమాపణలు చెప్పినా, ప్రభుత్వం ఆ వివరణను తగినదిగా భావించలేదు. భవిష్యత్తులో ప్రధానమంత్రి, ఇతర ప్రముఖుల ఖాతాల పోస్టులపై అదనపు పర్యవేక్షణ, బహుస్థాయి తనిఖీలు చేపడతామని మెటా తెలిపింది. సోషల్ మీడియా దుర్వినియోగం, తప్పుడు సమాచారం వ్యాప్తి, డిజిటల్ భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## మోదీ కార్మిక వ్యతిరేక విధానాలపై
# ఎదురొడ్డి పోరాడుదాం

**ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్**




**ప్రజాపక్షం/సూర్యాపేట:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ విమర్శించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎఐటియుసి జిల్లా మూడవ మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఐటియుసి జిల్లాలో 31 సంఘాలు, 10 రాష్ట్ర సంఘాలతో ఐదు వేల సభ్యత్వాలతో బలమైన యూనియన్‌గా జిల్లాలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. గతంలో పోరాడి సాధించుకున్న అనేక హక్కులను నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని, 8 గంటల పని విధానం రద్దు చేసి పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం చివరి అస్త్రంగా సమ్మెలు చేస్తున్నామన్నారు. అయితే సమ్మె చేయడం కూడా చట్టవిరుద్ధంగా ప్రకటించి సమ్మె చేసిన వారిని జైల్లో పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని కార్మిక వర్గాలంతా ఏకం కావాలని నియంతృత్వ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో అందరం పోరాడితేనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారని, దానివల్ల అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని అదేవిధంగా హమాలీ సంక్షేమ బోర్డు, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో కార్మికుల సమస్యలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. పిఎఫ్ మీద ఇఎస్ఐ మీద సీలింగ్ ఎత్తివేయాలని సూచించా రు. ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం కూడా సిఎం రేవంత్ రెడ్డి కార్మికుల స మస్యల మీద ఎటువంటి నిర్ణయాలు తీసుకోవట్లేదన్నారు. వేతనాలు పెంచడం లేదని, గత ప్రభుత్వాలు చేసిన అప్పుల మూలంగా తమ వద్ద నిధులు లేవని చెప్తున్నారన్నారు. అయితే ఉద్యోగ వేతనాల పెంపు, కాంట్రాక్ట్ కార్మికు లు, అంగన్‌వాడీలకు, ఆశా వర్కర్లకు కనీస వే తనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి ముందు ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాస్, దూళిపాల ధనుంజయ నాయుడు, దేవరం మల్లేశ్వరి, జడ శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, దంతాల రాంబాబు, బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారామ్, త్రిపురం సుధాకర్ రెడ్డి, నిమ్మల ప్రభాకర్, స్వప్న, కవిత, గోపమ్మ, రాము, ఎడవెల్లి శ్రీకాంత్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల యజమానులపై
# కఠినచర్యలు తీసుకోవాలి

**సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్**




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** హనుమకొండ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి రైతుల దగ్గర నుంచి కనీస మద్దతు ధరకు సేకరించిన వరి ధాన్యాన్ని కొంతమంది రైస్ మిల్లుల యజమానులు వారికి ఉన్న పలుకుబడిని ఆసరా చేసుకుని నొక్కేస్తున్నారని, తక్షణమే జిల్లాలో ఉన్న అన్ని మిల్లులపై విజిలెన్స్ అధికారుల చేత రైడింగ్స్ జరిపించి వరి ధాన్యం నిలువలను, మిల్లు యాజమాన్యం నొక్కేసిన ధాన్యం వివరాలను ప్రజల ముందు ఉంచాలని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సమితి కార్యదర్శి కర్రె భిక్షపతి జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. శనివారం పార్టీ జిల్లా నాయకుల బృందంతో వెళ్లి అడిషనల్ కలెక్టర్ రవిని కలిసి సమస్య తీవ్రతను విన్నవించారు. జిల్లాలో 2025–26 ఖరీఫ్ సీజన్‌లో 60 రైస్ మిల్లులు 46వేల 50 మెట్రిక్ టన్నుల విలువైన వరి ధాన్యం సిఎంఆర్ బకాయి ఉన్నారని, రబీ సీజన్‌లో 45 మిల్లులు 10,6336 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పెండింగ్‌లో ఉందని, ఖరీఫ్లో 31 శాతం, రబీలో 62 శాతం సిఎంఆర్ బకాయి మిల్లుల్లో ఉందని, ఈ పెండింగ్ బకాయిగా ఉన్న సిఎంఆర్ విలువ సుమారు 360 కోట్లు చేస్తుందని, ఇంత పెద్ద మొత్తంలో జిల్లాలో మిల్లులు ప్రభుత్వానికి అన్యాయం చేస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్టు అని ఈ సందర్భంగా కర్రె బిక్షపతి జిల్లా అధికారులను ప్రశ్నించారు. తక్షణమే బకాయి ఉన్న మిల్లులన్నింటిని తనిఖీ చేసి రికవరీ చేయాలని, వరి ధాన్యాన్ని అమ్ముకున్న నెల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అమ్ముకున్న ధాన్యానికి ఖరీదు కట్టి వసూలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతాంగం వచ్చీ రాని కాలంతో అవస్థలు పడుతూ తక్కువ దిగుబడితో అప్పుల పాలవుతుండగా తరుగు పేరుతోకొంత, సమయానికి డబ్బులు రాకపోవడం వల్ల మరికొంత ఇలా రకరకాలుగా మోసపోతూనే ఉన్నారని, ప్రభుత్వం కూడా ఈ ప్రజల సొమ్మును మిల్లర్లు తింటుంటే చూస్తూ ఎలా ఊరుకుంటుందని విమర్శించారు. రాబోయే వారం రోజుల్లో జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు బకాయిపడ్డ మొత్తం ధాన్యాన్ని సంబంధించిన వివరాలను ప్రజల ముందు ఉంచాలని లేనియెడల సిపిఐ ఆధ్వర్యంలో ప్రజల్ని రైతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ సొమ్మును కాపాడడంలో విఫలమవుతున్న సివిల్ సప్లై అధికారుల పైన, మిల్లు యాజమాన్యానికి సహకరిస్తున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ వాస్తవంగా జిల్లాలో నీ మిల్లుల అవకతవకలు జరుగుతున్నాయని, శీఘ్రగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంట పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకటరాజం, జిల్లా సమితి సభ్యులు వేల్పుల సారంగపాణి, నాయకులు ఆలకుంట మల్లయ్య, నోముల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**

**ప్రజాపక్షం/మోత్కూర్ :** చట్ట సభలలో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి హక్కుల సాధన సమితి మండల మహాసభ శనివారం మోత్కూర్ కెఆర్ భవన్‌లో, దొండ రాములు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభ సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిసిలు అన్ని రంగాలలో ముందు ఉండాలని, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని బిసిలంతా ఐక్యంగా ఉండాలని, బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టాలని, స్థానిక సంస్థలలో ఇచ్చినట్టుగానే బిసి రిజర్వేషన్ చట్టసభలలో కల్పించాలని వారు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా పోచం కన్నయ్య, ఉపాధ్యక్షులుగా దొండ రాములు, ప్రధాన కార్యదర్శిగా, పెండెం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి, అంబటి సోమయ్య, కోశాధికారి తాడూరు లక్ష్మి నరసయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు అనెపు వెంకట్, చాపల అంజయ్య, దొండ ఎల్లయ్య బి.నర్సయ్య, భువనగిరి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



## ‘బద్లావ్ జరూరీ హై’ నినాదంతో ఊరూరా నిరసన గళం

**ఈనెల 6 నుండి జిల్లాలో ప్రజాచైతన్య యాత్రలు**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావ్యతిరేక విధానాలపై ఊరూరా నిరసన గళం వినిపిస్తూ ప్రజలను చైతన్య వంతం చేసేందుకు ఈ నెల 6 నుండి వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో యాత్రకు సంబంధించి గోడప్రతులు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వాల్ జరూరీ హై (మార్పు కావాలి) కావాలి నినాదంతో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పాలకులు నిత్యవసరాల ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని, దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు నాణ్యమైన విద్యా, వైద్యం ఉచితంగా అందడం లేదని, పంటలకు కనీస మద్దతు ధర చట్ట బద్దత లేక రైతాంగం తీవ్రంగా నష్టపోతోందన్నారు. ఇవిఎంల నిర్వహణపై అనుమనాలు ఉన్నందున భవిష్యత్ ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ అమలుపై కాలయాపన చేయడం, కార్మిక హక్కులను హరించడం దళితులు గిరిజనులపై దాడులు పెరిగిపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. జిల్లాలో ప్రధాన సమస్యలైన పోడుభూములకు పట్టాలు అందక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం సీతారామ జలాలు రైతాంగానికి అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను నిరశిస్తూ నిర్వహించే యాత్రలను జయప్రథం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ ప్రచార యాత్ర

**సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**



**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామ గ్రామాన తెలియజేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా జరుగు ప్రచార యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ కరీంనగర్ నగర కౌన్సిల్ సమావేశం న్యాలపట్ల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు పర్యాయాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందన్నారు. ఎన్నికలకు ముందు దేశ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ప్రజా సంక్షేమం, సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసి అందులో ఏ ఒక్కటీ అమలు చేయడంలేదని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల భారాన్ని ప్రజలపై వేస్తుందన్నారు.బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి రైతులు పండించిన పంటలకు కనీసం మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే ప్రధాన డిమాండ్‌లతో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రచార యాత్ర నిర్వహిస్తుందని వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్ర జరగనుందని ఈ యాత్రను విజయవంతం చేయడానికి సిపిఐ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున కదలి రావాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశములో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,బీర్ల పద్మ, కొట్టె అంజలి,కసిబోజుల సంతోష్ చారి,సాయవేణి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు .



## సమన్వయంతో వందశాతం పూర్తి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజాప్రతినిధులు, బిఎల్ఓలు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేసి 100 శాతం ఓటర్ల సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని మాజీ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 36వ వార్డులో జిల్లా కాంగ్రెస్ నాయకులు పారుఖ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటుపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం ఒక మతానికి చెందిన ఓట్లను తీసివేయాలని కుట్రతో సర్ ప్రక్రియను ప్రారంభించిందని ఆరోపించారు. తెలంగాణలో బిజెపి ఆటలను సిఎం రేవంత్ రెడ్డి సాగనివ్వ లేదన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సర్ 100 శాతం పూర్తయిందని పట్టణాల్లో కూడా సంపూర్ణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు వల్దాస్ దేవేందర్, నాయకులు పిల్లల రమేష్ నాయుడు, బిఎల్ఓలు, బిఎల్ఏలు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో చిరస్థాయిగా నిలిచిన మల్లమ్మ



**ప్రజాపక్షం/చండూరు:** సిపిఐ మాజీ నాయకులు, బిఆర్ఎస్ చండూరు మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న తల్లి,మాజీ మహిళా నాయకురాలు బొమ్మరబోయిన మల్లమ్మ దశదిన కార్యక్రమం శనివారం కాస్తాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్,సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆది రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్యలు కలిసి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వెంకన్నను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బొమ్మరబోయిన మల్లమ్మ ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం అంకితభావంతో పనిచేసిన ఆదర్శ మహిళా నాయకురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నారాయణరావు, పాల్వాయి స్రవంతి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్రం వెంకటరెడ్డి,మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కొరిమిద్దె శ్రీనివాస్, మున్సిపల్ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, జిల్లా యాదయ్య పాల్గొన్నారు.

## అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగామ్‌కు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ నెలలో జిల్లా నుండి 6గురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు / ప్రధానాచార్యులు సత్ సమాన హోదా కలిగిన వారు, స్కూల్ అసిస్టెంట్ / పిజిటి సత్ సమాన హోదా కలిగిన వారు, సెకండరీ ఉపాధ్యాయులు / టిజిటి సత్ సమాన హోదా కలిగిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని 5 రోజుల పాటు ఫిన్లాండ్, సింగపూర్, జపాన్, వియెట్నాం, చైనా దేశాలకు పంపుతూ ఆ దేశ విద్యా విధానంపై అవగాహన పెంపొందించుటకు నిబంధన మేరకు అర్హత గల ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నామన్నారు. కావున జిల్లాలోని అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు సూర్యాపేట జిల్లా విద్యాశాఖ కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కోఆర్డినేటర్ హరికృష్ణను సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఆంగ్లం, గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : డిఇఓ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించడమే విద్యాశాఖ ప్రధాన లక్ష్యమని నల్గొండ జిల్లా విద్యాశాఖ అధికారి పి. సుశీందర్ రావు తెలిపారు. ముఖ్యంగా ఆంగ్లం, గణితంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణతో బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం పట్టణంలోని బాకాల్‌వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆహార నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆరు, ఏడు తరగతులకు సంబంధించిన ప్రాథమిక అంశాలపై కూడా పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఆంగ్లం, గణితంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారి నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. మండల విద్యాధికారి ధర్మానాయక్, బాకాల్‌వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కారు-లారీ ఢీ: ఒకరు దుర్మరణం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండల పరిధిలో గల ఎల్లారెడ్డిగూడెం గ్రామ శివారులోని భారత్ పెట్రోల్ బంకు సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా,మరొకరు స్వల్పంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణానికి చెందిన గాదే కళ్యాణ్ రెడ్డి (డ్రైవర్),మారం నరేష్ స్కోడా కారు (టిఎస్ 05 ఎఫ్ఏ4959)లో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు.ఉదయం సుమారు 5:30 గంటల సమయంలో ఎల్లారెడ్డి గూడెం సమీపంలో ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో కారు అదుపుతప్పి లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు కారు రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గాదే కళ్యాణ్ రెడ్డి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు.కారులో ఉన్న మారం నరేష్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న వెంటనే నార్కట్‌పల్లి ఎస్ఐ పి. విష్ణుమూర్తి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# మహిళా సంఘాలకు భారీ ప్రోత్సాహం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### గ్రామాభివృద్ధికి ప్రజలంతా ఐక్యంగా కృషి చేయాలి

### 15న రూ.7 కోట్ల రుణాలు పంపిణీ

### రైస్ మిల్లులు,గోదాముల ఏర్పాటుకు చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ :** గ్రామాల అభివృద్ధికి గ్రామస్తులందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. రెండు రోజుల నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నల్లగొండ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలం చిన్నసూరారం గ్రామ హ్యామ్లెట్ అయిన పావురాలగూడెంలో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన పీడబ్ల్యూడీ రహదారిని మంత్రి ప్రారంభించారు. అనంతరం చిన్నసూరారం,పెద్దసూరారం,చందనపల్లి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగించారు.మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని, చిన్న వ్యాపారాలతో పాటు పారిశ్రామిక రంగంలోనూ మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15న చిన్నసూరారం మహిళా సంఘాలకు రూ.3 కోట్ల, పెద్దసూరారం మహిళా సంఘాలకు రూ.2.50 కోట్ల, చందనపల్లి మహిళా సంఘాలకు రూ.1.50 కోట్ల రుణాల చెక్కులను అందజేయనున్నట్లు ప్రకటించారు. చిన్నసూరారంపెద్దసూరారం గ్రామాల మధ్య రైస్ మిల్ లేదా వేర్‌హౌసింగ్ గోదాం ఏర్పాటు కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పావురాలగూడెంలో చౌకధర దుకాణాన్ని మంజూరు చేయడంతో పాటు వెంటనే డీలర్‌ను నియమించాలని సూచించారు.చందనపల్లి గ్రామ డంపింగ్ యార్డ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నామని చెప్పారు. జనావాసాల కు దూరంగా కొత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మోహన్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఎస్ఎల్‌బిసి సొరంగం పూర్తి చేసి నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం: మంత్రి కోమటిరెడ్డి**

**ప్రజాపక్షం/తిప్పర్తి :** 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగ మార్గ నిర్మాణాన్ని పూర్తి చేసి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు రోజుల నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం తిప్పర్తి మండలాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. పజ్జూరు గ్రామంలో గ్రామస్తులతో సమావేశమైన ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పజ్జూరుఎర్రగండ్లగూడెం మధ్య రూ.30 కోట్ల వ్యయంతో 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పజ్జూరు గ్రామానికి 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పజ్జూరు గ్రామంలో ఇంకా ఇళ్లు రాని అర్హుల కోసం స్థలాన్ని గుర్తించి అందరికీ ఇళ్ల ను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,నల్గొండ ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్,ఆర్అండ్‌బి ఎస్ఈ మోహన్,ఈఈ శ్రీధర్ రెడ్డి, తిప్పర్తి మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వాలు విఫలం

### ఉపాధి కల్పన పరిశ్రమలు నెలకొల్పాలి : ఏఐవైఎఫ్



**ప్రజాపక్షం/దేవరకొండ:** నిరుద్యోగ యువత జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని, దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఖాళీల భర్తీ, ఉద్యోగ హక్కు కోసం యువత సంఘటితం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు అన్నారు. ఏఐవైఎఫ్ దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము మండల మహాసభ స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు జూలూరు మహేష్ అధ్యక్షతన శనివారం జరిగింది. మహాసభల సూచికంగా ఏఐవైఎఫ్ జెండాను నల్గొండ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఎగువేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత ఉద్యోగాల భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికి నియామకాలు సకాలంలో పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత సంఘటితమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆగస్టు 13న మునుగోడు మండల కేంద్రంలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సెప్టెంబర్ 8, 9, 10తేదిలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రభుత్వ ఖాళీల భర్తీ, యువత హక్కులు తదితర అంశాలపై తీర్మానాలు చేసి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు దేవీలాల్, సిపిఐ మండల కార్యదర్శులు వెంకటయ్య, రామాంజనేయులు, నాయకులు వెంగలయ్య, భారీములు, డివిజన్ కార్యదర్శి శివకుమార్, నాయకులు రామకృష్ణ, జంగయ్య, రాజు, శివ, అనిల్, సురేష్, బాబు, కొండల్, వెంకట్ పాల్గొన్నారు.

## ఆరు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

### వన మహోత్సవంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 5 నుంచి 6 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. భువనగిరి పట్టణంలో 60 వేల మొక్కలు నాటే లక్ష్యంతో వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ల పల్లి శ్రీవాణిరవికుమార్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు



**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామ జెడ్పీహెచ్ఎస్ నందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శిరీష ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమై,వారికి న్యాయ అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగ విలువలు,ప్రాథమిక విధులు,బాలల హక్కులు,బాలల రక్షణ చట్టాలు,బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన,బాలలపై లైంగిక వేధింపుల నివారణకు సంబంధించిన పోస్కో చట్టం, మంచి స్పర్శ చెడు స్పర్శ మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ,ఉచిత న్యాయ సహాయం,న్యాయాన్ని పొందే హక్కు,సైబర్ భద్రతవంటి అంశాలపై విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. సరైన సమాధానాలు చెప్పిన వారికి ప్రోత్సాహకంగా పెన్నులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సభ్యులు శ్రీశైలం,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాలో పకడ్బందీగా ముస్కాన్ : ఎస్పి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్‌ను పకడ్బందిగా నిర్వహించామని జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ పూర్తయిన సందర్భంగా బాగా పనిచేసి ఎక్కువ పిల్లలను సంరక్షించడంలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరికి, నిరాదరణకు గురైన బాలబాలికలకు, తప్పిపోయి వచ్చిన బాలలను గుర్తించి సంరక్షించడంలో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. జిల్లాలో జూలై నెలలో నెలరోజుల పాటు జిల్లా పోలీసు, జిల్లా యంత్రాంగం, జిల్లా సంక్షేమం, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ మొదలగు డిపార్టుమెంట్‌ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా 127 మంది నిరాదరణకు, వెట్టిచాకిరికి గురవుతున్న బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సంరక్షకులకు క్షేమంగా అప్పగించామన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 56 మందిలో బాలురు 52, బాలికలు 4 ఉన్నట్లు చెప్పారు. వీరితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 71 మంది బాలలు ఉండగా వీరిలో 65 మంది బాలురు, 6 గురు బాలికలు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, డిసిఆర్‌బి డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దుంఅలీ, మహిళా ఎస్ఐలు మౌనిక, నీలిమ, చైల్డ్ సంరక్షణ అధికారులు శ్రీలక్ష్మి, ఉమామహేశ్వరి, నాగుల మీరా, నాగరాజు, వంశీ, విద్యాసాగర్, ముస్కాన్ బృందం పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో జరిగే రాష్ట్ర 3వ మహా సభలను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐవై ఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని యువతరంలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను దేశభక్తిని లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను నైతిక విలువలను పాదుకొల్పడానికి అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం విద్యా, వైద్య వ్యాపారాన్ని అరికట్టాలని అవినీతికి వ్యతిరేకంగా యువత పోరాటం చేయాలన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాటి ఛార్జ్ ప్రజాస్వామ్యంపై దాడి అని ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి యువకులపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి అంజద్, అల్లంశెట్టి వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి నయీమ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, పట్టణ కార్యదర్శి మజ్జిగ నరసయ్య, ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షులు భాషబోయిన నరేందర్, సహాయ కార్యదర్శులు శ్రీరామోజు నవీన్, తాళ్లపల్లి రాజేష్, కాలె మల్లేష్, మారుపాక జ్ఞానేశ్వర్‌పాల్గొన్నారు.



## కట్న వేధింపులు: వివాహిత ఆత్మహత్య

### భర్తతో పాటు ముగ్గురిపై కేసు : ఎస్ఐ విష్ణుమూర్తి



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** కట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఔరవాణి గ్రామానికి చెందిన గుర్రం రాజేశ్వరి (26) శనివారం ఉదయం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.2019లో మునుగోడు మండలానికి చెందిన రాజశేఖర్‌తో ఆమె వివాహం జరిగింది.వివాహ సమయంలో నగదు, బంగారం, మోటార్‌సైకిల్‌ను కట్నంగా ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం కోసం భర్త రాజశేఖర్,అత్త చంద్రమ్మ,మామ లింగయ్య, నాదిని అరుణ కలిసి ఆమెను వేధించేవారని మృతురాలి తల్లి శివరాత్రి ధనమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్తకు మరో మహిళతో సంబంధం ఉందని ప్రశ్నించినందుకు రాజేశ్వరిని కొట్టి పుట్టింటికి పంపించారని,అలాగే విడాకులు తీసుకుని రెండో పెళ్లి చేసుకుంటా అడ్డొస్తే చంపేస్తా అంటూ ఫోన్‌లో బెదిరించేవాడని ఫిర్యాదులో ఆరోపించారు.శనివారం ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రాజేశ్వరి ఉరివేసుకోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న ఎస్ఐ పి. విష్ణుమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎరువుల దుకాణాల లైసెన్స్‌లు రద్దు

**ప్రజాపక్షం/మోతె:** శనివారం అధిక ధరలకు ఎరువులు, డిఎపి అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి యం. అరుణ చెప్పారు. మండల పరిధిలోని అన్నారిగూడెం గ్రామానికి చెందిన ఫర్టిలైజర్ షాపు యాజమాని పోటు వెంకటేశ్వరరావుకు చెందిన చేను సెలక ఫర్టిలైజర్ షాపు మండల కేంద్రానికి చెందిన శ్రీవెంకటసాయి ఫర్టిలైజర్ ఏజెన్సీ యాజమాని కృష్ణ కాంత్ షాపులతో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ధరలకు ఎరువులు, డిఎపిలు అమ్మకాలు జరిపినట్లు అకస్మిక తనిఖీలో వెల్లడికావడంతో ఇద్దరి డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## సంతకం ఫోర్జరీ : భూకబ్జాకు యత్నం

### నిందితుడిపై కేసు నమోదు..దర్యాప్తు ప్రారంభం

**ప్రజాపక్షం/మర్రిగూడ :** పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించడం ద్వారా భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన ఘటన మండలంలోని ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో వెలుగుచూసింది.ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే ఖుదాబక్ష్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు సంతకాన్ని గుర్తుతెలియని విధంగా ఫోర్జరీ చేసి,ఇంటి పన్ను రసీదులు,పంచాయతీ ధ్రువీకరణ పత్రాలతో పాటు మరికొన్ని నకిలీ పత్రాలను తయారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈనకిలీ పత్రాల ఆధారంగా గ్రామంలోని 188 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు బొంత మల్లేష్ ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విషయాన్ని గుర్తించిన పంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు శనివారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో తన సంతకాన్ని దుర్వినియోగం చేసి ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసేలా నకిలీ పత్రాలు సృష్టించారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఫిర్యాదు మేరకు మర్రిగూడ ఎస్ఐ బి. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫోర్జరీకి ఉపయోగించిన పత్రాలు, సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని వాటి ప్రామాణికతను పరిశీలిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.ప్రభుత్వ పత్రాలు, అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## 'రేపు' సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం ఈ నెల 3వ తేదీ (సోమవారం) ఉదయం 11 గంటలకు నల్లగొండ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణతో పాటు పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

## 'ఆరోగ్య పాఠశాల' లక్ష్యాలను సాధించాలి



ప్రజాపక్షం/మావల: మావల మండలంలోని కెఆర్‌కె కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో 'ఆరోగ్య పాఠశాల' నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ప్రారంభించారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసికట్టుగా కృషి చేసి ఆరోగ్య పాఠశాల లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థులు ప్రతి ఏటా కనీసం 200 రోజులు బడికి హాజరయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ గణితంలో ప్రాథమిక సామర్థ్యాలు పెంచాలని ఆదేశించారు. హరేరామ హరేక్రిష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం సీసీ కెమెరాలు విరాళంగా ఇచ్చిన దాతలను సత్కరించారు. డిఇఓ, హెచ్‌ఎం నవీన్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

ఎక్సైజ్ ఎస్ఐ అరుణ



మన తెలంగాణ/నర్సాపూర్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎక్సైజ్ ఎస్సై అరుణ అన్నారు. శనివారం నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలోని చెరువు గట్టుపై వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అగ్రి ఫౌండేషన్ సంస్థ సహకారంతో వెయ్యి ఈత మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి సంపదను కాపాడేందుకు మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు.గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది షాహిద్, రవి, మహేష్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## 'ఊర పండగ' ఏర్పాట్లు పరిశీలించిన నగర మేయర్



ప్రజాపక్షం/నిజామాబాద్ : నగరంలో నిర్వహించనున్న సాంప్రదాయ ఊరపండగ ఏర్పాట్లకు సంబంధించి సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు కన్వీనర్ రామర్తి గంగాధర్, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నగర డిసిసి అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కోకన్వీనర్ ఆదే ప్రవీణ్ సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.వేడుకలు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశమున్నందున ఊరేగింపు మార్గాల్లో ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా ఉండాలని,వేడుకల సందర్భంగా ప్రధాన మార్గాలు, ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని, ఊరేగింపు సాగే దారుల్లో వీధి దీపాలు (ఎల్ఈడి) అన్ని సక్రమంగా పని చేసేలా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పండగ నిర్వహణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. నగర శాంతిభద్రతలకు, సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ ఊర పండగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకోవాలని కార్పొరేషన్ యంత్రాంగం ప్రజాప్రతినిధులు పండగ ముగిసే వరకు పూర్తి సహకారాన్నందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్, సానిటరీ సిబ్బంది, సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదే ప్రవీన్, కోఆప్షన్ మెంబర్ నరేందర్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు కరాటే రమేష్, బంటు బలరాం, రాజు, ప్రమోద్, సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్‌గంగ ఉధృతి నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్‌పి నితికా పంత్



ప్రజాపక్షం/సిర్పూర్ (టి) : భారీ వర్షాల కారణంగా పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి నితికా పంత్ సూచించారు. శనివారం సిర్పూర్ (టి) పోలీస్ స్టేషన్ పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన వెంకట్రావుపేట వంతెన, పారిగాం ప్రాంతాల్లో వరద పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రోపులు, లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వరద ప్రవాహం పూర్తిగా తగ్గిన తర్వాత మాత్రమే వాహనాలు, ప్రజల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వరద నీటిని దాటేందుకు ప్రయత్నించవద్దని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిఎస్‌పి వాహీదుద్దీన్, సిర్పూర్ (టి) ఎస్ఐ సాగర్, పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ రక్షణ

కార్పొరేటర్ బొట్ల అనిత సత్యం

ప్రజాపక్షం/మంచిర్యాల : తల్లిపాలే శిశువుకు సంపూర్ణ రక్షణ అని గోసేవ మండల్ డివిజన్ కార్పొరేటర్ బొట్ల అనిత అన్నారు. శనివారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని గో సేవ మండల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఐకెపి, ఆర్‌పి నస్రీన్, వార్డు అధికారి సౌమ్య లతో కలిసి హాజరై అర్హులైన లబ్ధిదారులకు బాలామృతం, బాలామతం ప్లస్, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు జననం జరిగిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, మొదటి 6 నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి తల్లి తన బిడ్డకు అందించాలని, ఆ తర్వాత రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగిస్తూనే వయస్సుకు తగిన అదనపు పోషకాహారం అందించాలని సూచించారు.అంగన్‌వాడీ కార్యకర్త మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న మాతాశిశు సంక్షేమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం, పరిశుభ్రత, శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వ పథకాలకు గండి పడే ప్రమాదం!




ఫార్మర్ రిజిస్ట్రీ మిగిలిన 18 శాతంపై నిర్లక్ష్యం ఎందుకు?

ప్రజాపక్షం/నిర్మల్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఫార్మర్ రిజిస్ట్రీ' (రైతు డిజిటల్ ఐడీ) నమోదు ప్రక్రియ నిర్మల్ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా గమ్యస్థానానికి చేరుకోలేకపోతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 81.53 శాతం మేర నమోదు ప్రక్రియ పూర్తయిందని అధికారులు గణాంకాలు చూపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం దానికి భిన్నంగా ఉంది. ఇప్పటికీ వేలాది మంది రైతులు ఈ డిజిటల్ గుర్తింపు పొందేందుకు తిప్పలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు నమోదు ప్రక్రియ పూర్తి అయిపోయినట్లే భావించి చేతులు దులుపుకుంటుండటంతో, ఇప్పటివరకు నమోదు కాని మిగిలిన 18.47 శాతం రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.జిల్లా పరిధిలోని 19 మండలాల వ్యాప్తంగా ఉన్న మొత్తం 1,98,988 మంది పట్టాదారు రైతులలో ఇప్పటివరకు 1,62,236 మంది మాత్రమే ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని 'డిజిటల్ ఐడీ' పొందగలిగారు. అంటే ఇంకా 36,752 మంది రైతుల సమాచారం పెండింగ్‌లోనే మూలుగుతోంది. మండలాల వారీగా పరిశీలిస్తే అధికారుల పనితీరులోని వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. లోకేశ్వరం మండలంలో 91.48 శాతం, సోన్ మండలంలో 88.13 శాతం నమోదు పూర్తయి ముందంజలో ఉండగా.. కడెం పెద్దూర్ (75.09%), మామడ (75.97%), కుబీర్ (76.48%) వంటి మండలాల్లో నమోదు శాతం దారుణంగా పడిపోయింది. ఆయా మండలాల్లో యంత్రాంగం కనీస స్పందన కనబరచకపోవడంపై స్థానిక రైతాంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.ఈ పరిస్థితికి క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. గ్రామాల్లో ఏవోలు (ఏఈఓ), ఏఈఓలు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాముఖ్యతపై సరిగ్గా అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు.భూముల సర్వే నంబర్ల మ్యాపింగ్, పాస్‌పుస్తకాల్లో తప్పులు,ఆధార్ లింకింగ్ సమస్యలు ఉన్న రైతులకు సహాయం అందించాల్సిన వ్యవసాయ శాఖ సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ సరిహద్దు గ్రామాలు మరియు భూ వివాదాలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయకపోవడం వల్ల వేలాది మంది పేద రైతులు ఈ ప్రక్రియకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది.రైతు ఆధార్, సెల్ ఫోన్ నంబర్, పట్టాదారు పాస్‌పుస్తకం, సాగు వివరాలను అనుసంధానించి కేటాయించే 11 అంకెల 'యూనిక్ డిజిటల్ ఐడీ' కేవలం ఒక కార్డు మాత్రమే కాదు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్ నిధులు, పంట రుణాలు,విత్తన మరియు ఎరువుల సబ్సిడీలు, ఇన్సూరెన్స్ పరిహారం నేరుగా పొందాలంటే ఈ రిజిస్ట్రేషన్ అత్యంత తప్పనిసరి. సాంకేతిక లోపాలు,అధికారుల ఉదాసీనత వల్ల రిజిస్ట్రేషన్ కాకపోతే రాబోయే రోజుల్లో పథకాలన్నీ నిలిచిపోయి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తింటామని రైతులు ఆవేదన చెందుతున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. నమోదు శాతంలో వెనుకబడిన కడెం, మామడ, కుబీర్ వంటి మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామ స్థాయిలో డిజిటల్ క్యాంపులు నిర్వహించాలి.పెండింగ్‌లో ఉన్న 36 వేల మందికి పైగా రైతులకు డిజిటల్ ఐడీలు అందేలా చర్యలు తీసుకుంటేనే,నిర్మల్ జిల్లాను 100 శాతం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తయిన జిల్లాగా నిలబెట్టాలని రైతాంగం గట్టిగా డిమాండ్ చేస్తోంది.

## అందరి సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ప్రజాపక్షం /కుంటాల : అందరి సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కొరకు సర్పంచులు,అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మండలంలో రైతు భరోసా నిధులు రాని రైతులకు అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. గ్రామాల్లో జల సంరక్షణకు చర్యలు చేపట్టేలా విరివిగా ఫాం పాండ్ ల నిర్మాణాలు చేపట్టాలన్నారు.ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీవో వనజను అధికారులు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.డీపీఓ శ్రీనివాస్,తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీ ఓ శోభన,ఇతర శాఖల అధికారులు,సర్పంచులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ స్కూల్ బస్సుకు తప్పిన పెనుప్రమాదం

● డ్రైవర్ అప్రమత్తతతో 32 మంది విద్యార్థులు సురక్షితం ● శాశ్వత పరిష్కారం లేక అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ప్రజాపక్షం/మెదక్ : మెదక్ పట్టణ సమీపంలోని పుష్పాల వాగు వద్ద శనివారం సాయంత్రం సెంట్ డాన్ బాస్కో ప్రైవేట్ పాఠశాల బస్సుల పెను ప్రమాదం తృటిలో తప్పింది. గతేడాది వరదలకు దెబ్బతిన్న వంతెన వద్ద అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టకుండా మట్టిపోసి తాత్కాలికంగా రాకపోకలను పునరుద్దరించడంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు బురదమయంగా మారి ఓకవైపు కుంగిపోయింది. ఈ మార్గంలో వెళ్తున్న స్కూల్ బస్సు బురదలో కూరుకుపోయి ఒక వైపు ప్రమాదకరంగా ఒరిగింది. బస్సులో ఉన్న 32 మంది విద్యార్థులు భయాందోళనలకు గురికాగా, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్ల పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం తీవ్ర ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంతో పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు బయటకు వచ్చే వరకు విద్యార్థులు రోడ్డుపైనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో వరదలతో దెబ్బతిన్న వంతెనకు శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టిన అధికారుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. శాశ్వతంగా వంతేన, రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు డి మాండ్ చేస్తున్నారు.




# 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు అవకాశం

కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజాపక్షం/సంగారెడ్డి : ప్రత్యేక సమగ్ర జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును భారత ఎన్నికల సంఘం ఆగస్టు 10,2026 వరకు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అదికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్నికల సంఘం సవరించిన షెడ్యుల్‌ను విడుదల చేసిందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ పారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 78 శాతం పూర్తియిందని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ పారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆగస్టు 10 లోపు తమ ఫారాలను సంబందిత బిఎల్‌ఓల కు తప్పని సరిగా సమర్పించాలని కోరారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబధీకరణ ,పునర్వ్యస్థీకరణ ప్రక్రియను కూడా ఆగస్టు 10 నాటికి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17,2026 న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు ఓటర్లు క్లైయిమ్స్ ,అభ్యంతరాలను సమర్పించవచ్చని తెలిపారు. స్వీకరించిన క్లైయిమ్స్ ,అభ్యంతరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు పరిష్కార ప్రక్రియ చేపట్టనున్నట్లు అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని వెల్లడించారు. జిల్లాలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు తప్పని సరిగా ఓటరు జాబితాలో ఉండాలన్నారు. బిఎల్‌ఓలు ,ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు పరస్పర సమన్వయంతో పనిచేసే ఏలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

## తాటిపల్లి గంగ ఉధృతి

ప్రజాపక్షం/కౌటాల : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కౌటాల మండలంలోని తాటిపల్లి గంగ ఉప్పొంగి ప్రవహిస్తోంది. నదిలోకి వరద నీరు భారీగా చేరడంతో నీటి మట్టం పెరిగి తీర ప్రాంతాలు జలమయమయ్యాయి. నదీ ప్రవాహాన్ని చూసేందుకు స్థానికులు తరలివస్తుండగా, ప్రమాదాలు జరగకుండా ఎవరూ నది వద్దకు వెళ్లవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



## దళితుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాపక్షం/మంచిర్యాల : రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా నిర్మాణ బాధ్యుడు దాగం మల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులు, బడుగు వర్గాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభయాస్ కింద దళితులకు రూ. 12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి లేని పేదలకు సాగుభూమి, అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పించాలన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఎస్సీ సబ్ ప్లాన్ పునరుద్ధరించాలని, ఎస్‌సి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, బెల్ట్ షాపులను ఎత్తివేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి వారి పిఎఫ్ నిధులు ఖాతాల్లో జమ చేయాలని స్పష్టం చేశారు. డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి గోపి, జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం తిలక్ అంబేద్కర్, నాయకులు దాసరి శ్రీధర్, దుర్గం దేవదాస్, బొంతల లక్ష్మీ నారాయణ, రత్న రాజం, నక్క వెంకటస్వామి, కోడి వెంకటేశం పాల్గొన్నారు.




# భవిష్యత్తును కాపాడేది క్రమశిక్షణే

● ర్యాగింగ్, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి ఆర్ .కె. వెంకటరమణ సుహాస్



ప్రజాపక్షం/బైంసా : భైంసాలోని గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) మండల న్యాయ సేవల కమిటీ (ఎల్ఎస్‌సి) సంయుక్త ఆధ్వర్యంలో క్యాలెండర్ కార్యకలాపాల సందర్భంగా యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల దుర్వినియోగం ఎన్‌డీపీఎస్ చట్టం–1985 అంశాలపై శనివారం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. కె. రఘునాథ్ మాట్లాడుతూ, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు,చట్టాలపై అవగాహన పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. న్యాయమూర్తులు,న్యాయవాదులు, పోలీసు అధికారులు అందించిన మార్గదర్శకాలను కళాశాల విద్యార్థులు తప్పనిసరిగా ఆచరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన భైంసా జూనియర్ సివిల్ జడ్జి ఆర్.కె. వెంకటరమణ సుహాస్ మాట్లాడుతూ, ర్యాగింగ్ అనేది సరదా కాదు.,అది చట్టరీత్యా శిక్షార్హమైన నేరం అని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలు యువత జీవితాలను, కుటుంబాలను, సమాజ భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. ఎన్‌డిపిఎస్ చట్టం–1985లోని కఠిన నిబంధనలను వివరించి, ఒక్క తప్పు నిర్ణయం జీవితాంతం చెరగని మచ్చగా మిగిలిపోతుందని అన్నారు. ఉపనిషత్తుల సందేశమైన సత్యం వద ధర్మం చర స్వాధ్యాయాన్మా ప్రమద ను ఉటంకిస్తూ, సత్యం, ధర్మం, క్రమశిక్షణ, నిరంతర అధ్యయనం ప్రతి విద్యార్థి జీవితానికి బలమైన పునాదులు కావాలని సూచించారు.భైంసా సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ వంటి సామాజిక దురాచారాలకు దూరంగా ఉండి చదువుపై ఏకాగ్రతతో ముందుకు సాగాలని, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సమాజానికి గర్వకారణంగా నిలవాలని కోరారు. న్యాయవాదులు ముత్తన్న షేక్ అంజద్ మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన కలిగిన యువతే సమాజ నిర్మాణంలో కీలక శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. నహీదా, డా. జాదవ్ ఓంప్రకాష్, లు ఈ సందర్భంగా నాశముక్తభారత్ అంశంపై విద్యార్థులు అధ్యాపకులచే ప్రతిజ్ఞ చేయించారు ఆంటీ డ్రగ్స్ కోఆర్డినేటర్ డా. కె. సంతోష్ కుమార్, అధ్యాపకులు డా. భీమారావు, డా. రవికుమార్, డా. పవన్ కుమార్, డా. శంకర్, శ్రీ ఏ. రాజు, డా. సుధాకర్తో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

ఆపరేషన్ 'మస్కాన్ సెవెన్'లో సంగారెడ్డి జిల్లాలో 173 మంది బాల కార్మికులకు విముక్తి

బాల కార్మికులను పనిలో పెట్టుకున్న 136 మంది యజమానులపై కేసులు నమోదు

అదనపు ఎస్‌పి చైతన్య రెడ్డి

ప్రజాపక్షం / సంగారెడ్డి : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని జనవరి నెలలో ఆపరేసణ్ స్మైల్ ,జులై నెలలో ఆపరేషణ్ ముస్కాన్ పేర్లతో విస్తృత తనిఖీలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి రక్షించడం జరుగుతుందని అదనపు ఎస్‌పి చైతన్య రెడ్డి తెలిపారు. ఆపరేషన్ 'మాస్కాన్ సెవెన్'లో భాగంగా గత నెల జులై 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో 173 మంది బాలకార్మికులను రక్షించడం జరిగిందని వీరిలో 168 మంది బాలురు 05 మంది బాలికలు, ఉన్నారని తెలిపారు. బాలలను చట్టవిరుద్ధంగా



పనిలోపెటుకున్న 136 మంది యజమానులపై కేసులు నమో దు చేసి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. రక్షించిన బాలలను సంబందిత శాఖల సమన్వయంతో పునరావాసం కల్పించి వి ద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించ డం వారికి సురక్షింతమైన బాల్యాన్ని ఆందించడం ప్రతి ఒక్కరూ బాధ్యత అని పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్ సెవెన్‌లో విజయవంతం చేయడంలో పోలీసు శాఖ ,కార్మిక శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా బాలల పరిరక్షణ వి భాగం ,విద్యాశాఖ ,మెడికల్ డిపార్ట్మెం ట్ తదితర శా ఖల అధికారులు ,సిబ్బంది సమన్వయ ం ల అభినందనీయం అన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లల ను పనిలో పె ట్టుకోవడం, వెట్టి చాకిరి చేయించడం బలవంతంగా భిక్షాటన చేయించడం, పశువుల కా పరులుగా ,కిరాణా దుకాణాలు, మెకానిక్ షా పులు ,హోటళ్లు ,ఇటుక బట్టీలు, పౌల్ట్రీ పారాలు, పరిశ్రమలు, ఇతర పనులు చేయడం చట్టరీత్య నేరమని అదనపు ఎస్‌పి హెచ్చరించారు. ఇలాంటి చ ర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాలలపై వేదింపులు, దోపిడి జరుగుతున్న ట్లు తెలిసిన వెంటనేచైల్డ్ హెల్ప్ లైన్ 1098 ,డయిల్ 100కు సమాచారం అందించాలన్నారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి : సిఐ రేణుక

ప్రజాపక్షం/రేగోడు: మండలం కేంద్రంలో జగిర్యాల్ గ్రామంలో అల్లాదుర్గం సిఐ రేణుక మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు అనంతరం వారు మాట్లాడుతూ పేకాట బెట్టింగ్లు అనైన్ గేమ్లు కు దూరంగా ఉండాలని అన్నారు మద్యం సేవించి వాహనాల నడిపితే సీజ్ చేస్తామని ద్విచక్ర వాహనాల దారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని అన్నారు వర్షాకాలం సందర్బంగా విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు అనంతరం మొక్కలు నాటి ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలని వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు కార్యక్రమంలో ఎస్ఐ పోచాయ్య సర్పంచ్ ర్యాకల్ వీరమ్మ ఉప్పు సర్పంచ్ రమేష్ మాజీ సర్పంచ్ నర్సిములు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నాని తాజా చిత్ర 'ది ప్యారడైజ్' ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన స్పందన లభించింది. పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌తో పాటు, చిత్రంలోని మొదటి పాట 'ఆయా షేర్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థా యిలో, ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు.

రీల్

## 'మెరుపులే మెరుపులే' సాంగ్ లాంచ్ చేసిన వినాయక్



హీరో హవీష్ కథానాయకుడిగా, దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ' హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్ కథానాయికగా నటిస్తున్నారు. తొలి పాట 'కొంచెం కొంచెం'కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మెరుపులే మెరుపులే సాంగ్ లాంచ్ చేశారు. డైరెక్టర్ వివి వినాయక్ ఈ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వి.వి. వినాయక్ మాట్లాడుతూ: ఇక్కడి ఎనర్జీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కేఎల్ యూ నివర్సిటీకి వస్తున్నప్పుడు నాకు రామోజీ ఫిల్మ్ సిటీకి వచ్చిన అనుభూతి కలిగింది. సత్యనారాయణని చూస్తుంటే రామోజీరావుని చూసినట్లే అనిపించింది. ఈ యూనివర్సిటీ ఎంత అద్భుతంగా ఉందో, సినిమా కూడా అంతే బాగుంటుందని నమ్ముతున్నాను. ఆయన తన కుమారుడి కోసం పెట్టుకున్న కలలన్నీ ఈ సినిమాతో నెరవేరాలని కోరుకుంటున్నాను. హవీష్ చాలా పెద్ద కమర్షియల్ హీరో అవ్వాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. త్రినాథరావు నక్కిన తీసిన 'నేను లోకల్', 'సినిమా చూపిస్త మావ' సినిమాలు నాకు చాలా ఇష్టం. హీరో హవీష్, దర్శకుడు త్రినాథరావు నక్కిన, నిర్మాతలు నిఖిల, కాంచన, కావ్యా థాపర్ పాల్గొన్నారు.

## 'సర్దార్ 2' యాక్షన్ టీజర్ రిలీజ్



హీరో కార్తీ తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'సర్దార్'కి సీక్వెల్ 'సర్దార్ 2'తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. తాజాగా రిలీజ్ అయిన యాక్ష న్ టీజర్ ఆకట్టుకుంటోంది. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ కూడా కీలక పాత్రల్లో కనిపించారు. సామ్ సిఎస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు అదనపు బలం చేకూ ర్చి, ప్రతి యాక్షన్ బ్లా క్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీ సుకెళ్లింది.ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సహ నిర్మాత ఎ. వెంకటేష్, నిర్మాతలు ఎస్. లక్ష్మ ణ్ కుమార్, ఇషాన్ సక్సేనా సంగీతం సామ్ సిఎస్, డిఒపి జార్జ్ సి విలియమ్స్.

## 6న 'ది ప్యారడైజ్' టీజర్



హీరో నాని తాజా చిత్ర 'ది ప్యారడైజ్' ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన స్పందన లభించింది. పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌తో పా టు, చిత్రంలోని మొదటి పాట 'ఆయా షేర్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అం దుకుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థా యిలో, ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఎల్‌ఎల్‌వి సినిమాస్ బ్యా నర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తా జాగా ఈ సినిమా టీజర్‌ను ఆగస్టు 6న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ అప్‌డేట్‌తో సినిమాపై నెలకొన్న ఆసక్తి మరింత పెరిగింది. 1 నిమిషం 35 సెకన్ల నిడివి గల ఈ టీజర్‌లో సినిమా వరల్డ్ తో పాటు కథలోని ఎమోషనల్ ఇంటెన్సిటీని చూపించబోతున్నారు. 'ది ప్యారడైజ్' తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ 'బతుకమ్మ'

- రవిబాబు టైం డెడికేషన్ ఉన్న డైరెక్టర్
- జయసుధ పక్కన కూర్చొని విమాన ప్రయాణం జీవితంలో మరచిపోలేను
- 'ప్రజాపక్షం' స్పెషల్ ఇంటర్వ్యూలో నటుడు విజయ్ భాస్కర్

'బతుకమ్మ' సినిమా ప్రతి ఒక్కరికీ గుర్తుంటుంది. ఈ సినిమాలో హీరోగా నటించిన విజయ్ భాస్కర్ కూడా అందరికీ గుర్తుంటాడు. ప్రతి ఒక్క నటుడికి జీవితంలో చెప్పుకో దానికి ఒక సినిమా ఉంటుంది. విజయ్ భాస్కర్ కెరీర్‌లో కూడా బతుకమ్మ అనే సినిమా ఓ టార్నింగ్ పాయింట్. విజయ్ భాస్కర్ కెరీర్ బతుకమ్మకు ముందు బతుకమ్మ తరువాత అనేలా మారిపోయింది. 6టీన్స్ సినిమాలో ఒక హీరోగా చేసిన విజయ్ భాస్కర్ మొదటి సినిమాతో భారీ సక్సెస్ అందుకున్నారు. ఆ తరువాత కొన్ని సినిమాలు చేసినా తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో వచ్చిన బతుకమ్మ సినిమా మాత్రం అతని జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

**ప్రశ్న : సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఎలా జరిగింది ?**

**విజయ్ భాస్కర్:** సినిమా రంగంలో నేను అనుకోకుండా వచ్చాను. అందరిలాగే నేను ప్రయత్నించాను. నువ్వు వాస్తవాన్ని, ఖుషి, మా అన్నయ్య వంటి సినిమాల్లో నటించాను. ఆ తరువాత 6టీన్స్ సినిమాలో ఒక హీరోగా నటించాను. హీరోగా సుమారు ఇరవై సీన్లను, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ముఫై సినిమాల్లో నటించిన. కేవలం ఒక్క తెలుగు సినిమాలే కాదు ... హిందీ, కన్నడ, భోజపూరి, ఒరియా, తమిళ ఇలా నాలుగైదు భాషల్లో సినిమాలు చేశాను. తమిళంలో ప్రకాష్ రాజ్ ప్రొడక్షన్‌లో వచ్చిన తెలుగులో గౌరవం సినిమాలో నటించాను. హిందీలో రెండు సినిమాలు, తమిళంలో మూడు సినిమాలు, కన్నడలో (తెలుగులో ఉల్లాసంగా ఉత్సహంగా) , నమిత సినిమా చేశాను. భోజ్ పూరిలో ఏకంగా ఇరవై సినిమాలు చేశాను. ఒరియాలో కూడా రెండు సినిమాలు చేసిన. సంబిత్, అమ్లా హీరోలతో కలసి పని చేసిన. నేను ఏ భాషలో నటించిన ఆ సినిమా స్క్రిప్టు నేను తెలుగు లో రాసుకుని ప్రాక్టీస్ చేసి చెప్పేవన్నీ. దీంతో కన్నడ లో మాట్లాడితే నన్ను కన్నడ వాడే అనుకునేవాళ్లు. భోజపూరి లో డైలాగులు చెప్తే భోజపూరి అతనే కావచ్చు అనుకునే వాళ్ళు. వాళ్ళ భాషను అంత పర్ఫెక్ట్ గా ప్రాక్టీస్ చేసి చెప్పేవాన్ని .

**ప్రశ్న : 6టెన్స్ సినిమా ఆడియోతో పాటు సినిమా కూడా సూపర్ హిట్ అయింది ? ఎలా అనిపించింది?**

**విజయ్ భాస్కర్ :** 6టీన్స్ సినిమాలో నేను ఒక హీరోగా నటించిన. హీరోగా నటించిన మొదటి సినిమా ఇది. ఈ సినిమా పాటల క్యాసెట్లు లక్షల్లో అమ్ముడు పోయాయి. ఈ సినిమా రిలీజ్ అయినప్పుడు క్యాసెట్స్ ఉన్నాయి కదా ... ఈ క్యాసెట్స్ విపరీతంగా అమ్ముడు పోయాయి. ఏ పాన్ షాప్ లో చూసిన, ఎక్కడ చూసిన 6టీన్స్ పాటలే వినిపించేవి. పాన్ షాపుల్లో నా పాటలు విని ఎంతో హ్యాపీగా అనిపించేంది. నా అదృష్టం కాబోలు నేను హీరోగా నటించిన తొలిచిత్రం 6టీన్స్ ఆడియో సూపర్ హిట్టే, సినిమా కూడా సూపర్ హిట్టే. తరువాత నేను హీరోగా నటించిన బతుకమ్మ సినిమా కూడా ఆడియో సూపర్ హిట్ అయింది. సినిమా కూడా హిట్ అయింది.

**ప్రశ్న : కొన్ని సీరియల్స్ కూడా చేసినట్టున్నారు?**

**విజయ్ భాస్కర్ :** అవును... రాఘవేంద్ర రావు తీసిన కేరాఫ్ అనసూయలో నటించిన. ప్రతిఘటన అనే సీరియల్, రాధమ్మ కూతురు అనే సీరియల్‌లో కూడా నటించా. సీరియల్స్ చెయ్యమని ఇప్పటికీ అవకాశాలు వస్తూనే ఉన్నాయి. కానీ నేనే సినెమాలకే ప్రాధాన్యత ఇస్తున్నాను.



**ప్రశ్న : బతుకమ్మ సినిమాకు ముందు .... తరువాత అంటే మీ కెరీర్ గురించి ఎలా విశ్లేషించుకుంటారు?**

**విజయ్ భాస్కర్ :** బతుకమ్మ సినిమా రిలీజ్ తరువాత నుంచి ఇప్పటి వరకు కూడా బయట ఎవరు చూసినా బతుకమ్మ హీరో కదా అంటుంటారు. బతుకమ్మ తరువాత నాకు ప్రజల్లో మంచి గుర్తింపు లభించింది. బతుకమ్మ పండుగ సమయంలో టీవీల్లో నేను నటించిన బతుకమ్మ సినిమా వస్తుంటే ఇప్పటికీ చాలా మంది టీవీల్లో సినిమా చూస్తూ నాకు ఫొటోస్ షేర్ చేస్తుంటారు. అన్నిటికంటే మరచిపోలేని విషయం, సంతోషకరమైన విషయం ఏమిటంటే బతుకమ్మ సినిమా తరువాత నేను సహజ నటి జయసుధ పక్కనే కూర్చొని విమానంలో ప్రయాణం చేశాను. ముంబై లో ఉన్న కొంతమంది మన తెలుగు వాళ్ళు ప్రతి ఏడాది ఈవెంట్స్ చేస్తుంటారు. అలా బతుకమ్మ రిలీజ్ అయినా తరువాత ముంబై లో జరిగిన ఒక ఈవెంట్‌కు నన్ను కూడా పిలిచారు. అప్పుడు నేను జయసుధపక్కన్నే కూర్చొని విమానంలో ప్రయాణం చెయయడం నేను ఎన్నటికీ మరచిపోలేను. బతుకమ్మ సినిమాకు ఆడిషన్ కు వెళ్ళినప్పుడు డైరెక్టర్ ఫ్రీగా చెయ్యాలి అంటే చెయ్యను అని చెప్పిన. నెలనెలా కిరాయి కట్టాలి ...బతకడానికి ఖర్చుకు ఉంటాయి కాబట్టి ఫ్రీ గా అయితే చెయ్యను అన్నాను. ''పని వచ్చిన వాడే పైసలు అడుగుతాడు '' అని నేను అన్న డైలాగు డైరెక్టర్‌కు బాగా నచ్చి బతుకమ్మ సినిమాలో హీరోగా పెట్టుకున్నాడు. నాకు నెల నెల పదివేల రూపాయలు జీతంలాగా ఇచ్చారు.

**ప్రశ్న : కెరీర్‌లో ఒకటి రెండు సినిమాలు తప్ప పెద్దగా సక్సెస్ లేకపోవడానికి కారణం ?**

**విజయ్ భాస్కర్ :** మహానగరంలో శివ చందు, నిన్నే కోరుకుంటా, ఉడుత ఉడుత ఊచ్ వంటి సినిమాలు చేసిన కానీ అప్పట్లో థియేటర్ లో మాత్రమే రిలీజ్ ఉండేది. సో కొన్ని సినిమాలకు థియేటర్‌లు సరైనవి దొరక్క పోవడం ఒక కారణం కావొచ్చు. నిర్మాతలు కొంతమంది సినిమాను సరిగ్గా ప్రమోషన్ చెయ్యకపోవడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ధర్మయోధుడి చరిత్ర అనే సినిమా సప్తగిరి థియేటర్లో మూడు వారాలు ఆడింది. అలాంటి దేవుడి పాత్ర పోషించడం, ఆ సినిమా మూడు వారాలు థియేటర్ లో ఆడటం నా అదృష్టం. విక్రమ్ తో కలసి 9 నెలలు సినిమా కూడా చేశాను. తీపిగుర్తు అనే సినిమాలో సీనియర్ కమెడియన్ సుధాకర్ తో కలసి నటించాను.

**ప్రశ్న : ఓల్డ్ ఏజ్ హోమ్ నడుపుతున్నారని విన్నాను?**

**విజయ్ భాస్కర్ :** నేను నడపడం లేదు కానీ ఓల్డ్ ఏజ్ హోమ్ వాళ్లకు సహాయం చేస్తుంటాను. మేము కొంపల్లిలో ఉండేటప్పుడు ''అమావాస్య అన్నదానం'' అనే కార్యక్రమం స్టార్ట్ చేశాము. నేను హైదరాబాద్ బతకడానికి వచ్చినప్పుడు సరిగ్గా తిండి కూడా దొరికేది కాదు. అలాంటి పరిస్థితి నుంచి వచ్చినం కాబట్టి అన్నం విలు వ తెలిసిన వాణ్ణి కాబట్టి కొంపల్లిలో ఈ కార్యక్రమం స్టార్ట్ చే శాం. ఇప్పటికీ ప్రతిఏడాది విజయవంతంగా నడుస్తోంది. వనస్థలిపురంలో ఉండే ఒక ఓల్డ్ ఏజ్ హోమ్ కు సహాయం చేస్తుంటాను. చిరంజీవి బ్లడ బ్యాంక్ లో బ్లడ డొనేషన్ ఇస్తున్నాము. అంతేకాదు చివరి రోజుల్లో ఉన్న వాళ్లకు బెడ్ , తదితరుల వస్తువులు ఉచితం గా అందిస్తుంటాము. ఇలా చేతనైనంత సహాయం చేస్తుంటాను.

**ప్రశ్న : దర్శకుడు రవిబాబు సినిమాలు వరుసగా చేస్తున్నారు. ఆయనకు కోపం ఎక్కువ అంటారు నిజమేనా?**

**విజయ్ భాస్కర్ :** ఫిలిం ఇండస్ట్రీలో చాలా మంది బయట నుంచి విన్నవి , ఎవరో చెప్పినవి మాట్లాడుకుంటారు. కానీ ఎవరితోనైనా కలసి పని చేసినప్పుడే వారి గురించి తెలుస్తుంది . నేను కూడా బయట విన్నాను రవిబాబు కోపిష్టి అని కానీ నేను సెట్స్‌కు వెళ్లిన తరువాత నాకేమి అలా అనిపించలేదు. ఏకంగా ఆయనతో ఇప్పుడు మూడో సినిమా చేస్తున్న. 9 గంటలకు షాట్ తీయాలంటే తొమ్మిదికి తీయాల్సిందే. అది ఆయన డెడికేషన్. టైం సెన్స్ చాలా పాటించే దర్శకుడు రవిబాబు. సెట్ లోకి రాగానే ఫస్ట్ ఫోన్ సైలెంట్ లో పెట్టాలి. ఒక రోజు ముందే స్క్రిప్ట్ ఇచ్చేస్తాడు. మొత్తం ప్రిపేర్ అయి రావాలి. వారం వారం పేమెంట్ ఇచ్చేస్తాడు. ఆయన దగ్గ్ర ఒక సిస్టం ఉంటుంది. ఆ సిస్టం అందరికి మంచిదే. అలా పని చేయడం వాల్ల అందరికి డిసిప్లేన్ వస్తుంది. 'ఏనుగుతొండం ఘటికాచలం' అనే సినిమాలో నను హీరోగా పెట్టి చేశాడు. రేజర్ లో అవకాశం ఇచ్చాడు. ఇప్పుడు రవిబాబుతో మూడో సినిమా చేస్తున్నాను. ఇండస్ట్రీకి వచ్చి ఇరవై ఐదేళ్లు అయింది. అప్పుడు కష్టపడి పని చేశాను కాబట్టే ఇప్పుడు కొంత హ్యాపీగా ఉన్నాను.

## ఆదివాసీ రైతుల భూ సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

కోదండరెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదివాసీ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో శనివారం ఆదివాసి న్యాయవాదులతో ఛైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు భూమి సునీల్ కుమార్, రాములు నాయక్, గడుగు గంగాధర్, మరికంటి భవాని రెడ్డి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసి న్యాయవాదులు ఏజెన్సీ ప్రాంతాల్లో ధరణి రికార్డుల్లో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, రైతుల పేర్లలో ఉన్న తప్పిదాల వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషన్‌కు వివరించారు. భూ రికార్డులపై అవగాహన లేకపోవడం, సవరణ ప్రక్రియపై సరైన సమాచారం అందకపోవడం వల్ల సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూభారతి చట్టం కింద ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి భూ రికార్డులను సరిచేయాలని సూచించారు. రికార్డులు సక్రమంగా ఉంటేనే రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ఆదివాసి రైతులకు అందుతాయని తెలిపారు.అదే విధంగా పోడు భూముల హక్కులు, రికార్డులు, సాగు సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలని కోరారు. అలాగే 1924 ఏజెన్సీ నియమాల ప్రకారం ఏర్పాటు చేసిన ఏజెన్సీ మొబైల్ కోర్టులు సక్రమంగా పనిచేయకపోవడంతో భూ వివాదాలకు సంబంధించిన అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వేగంగా పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆదివాసి న్యాయవాదులు రైతు కమిషన్ దృష్టికి తీసుకు వచ్చిన అన్ని అంశాలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆధార్ సొసైటీ నాయకులు గోంది వెంకటరమణ, మెట్ల పాపయ్య, జె.జె. రాంబాబు, ఆదివాసి అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు అర్రే పాపారావు, న్యాయవాదులు వాసం ఆనంద్ కుమార్, బట్ట వెంకటేష్, ఎఎస్ఎఫ్ నాయకులు అజయ్ కుమార్, గణేష్ పాల్గొన్నారు.

## ఉక్కుపాదం (మొదటి పేజీ తరువాయి)

అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని, హైకోర్టు ఆదేశాల మేరకు ఇప్పటికే ఉన్న జాబితానే సమర్పించామని, ఇందుకు విరుద్ధమైన ప్రచారం అసత్యమని కొట్టిపారేశారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా చేపట్టిన రీసర్వేలో ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్ నంబర్ కేటాయిస్తామని, కేవలం 2 శాతం అభ్యంతరాలు మాత్రమే వచ్చాయని వెల్లడించారు. రాష్ట్రంలో 85 వేల ఎకరాల అసైన్డ్ భూములపై త్వరలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కేంద్రం నిధులు విడుదల చేయకపోయినా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఫైనల్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో వర్షపు నీరు కారుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, అయినప్పటికీ వాటికి మరమ్మతులు చేయిస్తామని మంత్రి చెప్పారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత అంచనాలకు మించి 1020 శాతం అధిక ఆదాయం వచ్చిందని, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌ల ఆదాయం రూ.13 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఏడాది రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు.

## చెప్పాలి (మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించని ప్రధాని, విద్యార్థులను క్షమించడం గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని దుయ్యబట్టారు. నీట్ కారణంగా తీవ్ర దుఃఖంలో ఉన్న వారి బంధువులతో గాంధీ మాట్లాడుతూ తమ బిడ్డను కోల్పోయి తల్లిదండ్రులు విలపించడం కంటే బాధాకరమైనది మరొకటి లేదన్నారు. కోల్పోయిన ప్రతి యువ ప్రాణం వెనుక, ఎప్పటికీ వీడని బాధతో సతమతమవుతున్న ఒక కుటుంబం, విచ్ఛిన్నమైన విద్యా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. లీకైన ప్రశ్నపత్రాలు, రద్దయిన పరీక్షలు, సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైందని దుయ్యబట్టారు. 'తమ బిడ్డను కోల్పోయి దుఃఖిస్తున్న ఒక్క కుటుంబాన్నైనా ఆయన కలిశారా? పేపర్ లీక్‌ల వల్ల తమ మొత్తం పొదుపు, జీవితం, సమయం, కలలు అన్నీ కోల్పోయిన వారిని కలిశారా? సమాధానం లేదు! భారతదేశ విద్యార్థులకు ప్రధానమంత్రి క్షమాపణ అవసరం లేదు మోదీజీ వారికి క్షమాపణ చెప్పాలి' అని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

## ఆపరేషన్ ముస్కాన్‌లో 6,307 మంది చిన్నారుల విముక్తి

1,705 కేసులు నమోదు..
1,710 మంది అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణాపై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్12'లో ఏకంగా 6,307 మంది చిన్నారులను రక్షించి బాలల సంరక్షణలో మరోసారి తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ ఆపరేషన్‌లో 5,041 మంది బాల కార్మికులను విముక్తి చేయడంతో పాటు 1,705 కేసులు నమోదు చేసి, 1,710 మందిని అరెస్టు చేయడం గమనార్హం. జులై 1 నుంచి 31 వరకు మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేశాయి. రాష్ట్రంలోని 124 పోలీసు సబ్ డివిజన్లలో 620 మంది పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు, టీ దుకాణాలు, మాంసం దు కాణాలు, వెల్డింగ్ వర్క్‌షాపులు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రక్షించిన 6,307 మంది చిన్నారుల్లో 5,892 మంది బాలు రు, 415 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 3,447 మం ది తెలంగాణకు చెందినవారు కాగా, 2,860 మంది ఇతర రాష్ట్రాలు, నేపాల్‌కు చెందినవారు ఉన్నారు. మొత్తం 5,041 మంది బాల కార్మికులు, ఒక బానిస కార్మికుడు, 647 మంది వీధి బాలలు, 43 మంది భిక్షాటన చేస్తున్న చిన్నారులు, 11 మంది ఇంటి నుంచి పారిపోయిన చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే డ్రాప్‌అవుట్లు, బాల్య వివాహాలు, అక్రమ దత్తత వంటి ఇతర విభాగాల్లో 563 మంది చిన్నారులను కూడా రక్షించారు.ఆపరేషన్ సందర్భంగా నమోదైన కేసుల్లో 1,989 మంది చిన్నారులు



రక్షించగా, కార్మిక శాఖ 1,381 తనిఖీ నివేదికలు జారీ చేసి కనీస వేతనాల చట్టం కింద రూ.37.95 లక్షల జరిమానాలు విధించింది. రక్షించిన చిన్నారుల్లో 5,737 మందిని కుటుంబాలకు అప్పగించగా, మిగిలిన 570 మందిని బాలల సంరక్షణ కేంద్రాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టారు. బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనలో అన్ని ప్రభుత్వ శాఖల సమిష్టి కృషితో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచిందని మహిళా భద్రత విభాగం డైరెక్టర్ చారు సిన్హా తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక ఆపరేషన్లను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com